www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


ఢాకాలోని మైల్ స్టోన్ స్కూల్ వద్ద విమాన శకలాలు

స్కూలుపై కూలిన విమానం

పైలట్ సహా 20 మంది దుర్మరణం.. వారిలో అత్యధికులు విద్యార్థులు

171 మందికి గాయాలు

11 బంగ్లాదేశ్‌లో దుర్ఘటన

ముంబైలో రన్‌వే పక్కకు ఎయిరిండియా విమానం

మంగళవారం | 22-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 136

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి ఉ.7:06, త్రయోదశి తె.4:39, నక్షత్రం: మృగశిర రా.7:25 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: తె.3:17-4:47, దుర్ముహూర్తం: ఉ.8:29-9:21, రా.10:26-11:09, అమృతఘడియలు: ఉ.11:14-12:43, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:55, సూర్యాస్తమయం: 6:48 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నరాలు నలిపి.. కిడ్నీలు, లివర్లు చిదిమి..

జగన్ ధనాశకు జనం బలి!

నాసిరకం మద్యంతో ఒళ్లు గుల్ల



ఆ ఐదేళ్లలో భారీగా కిడ్నీ లివర్, నరాల వ్యాధులు

పదిరెట్లు పెరిగిన నరాల బలహీనతలు

రెండింతలైన కాలేయ రోగాలు

ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు గణాంకాలివి

చనిపోయిన వారెందరో లెక్కల్లేవు

కాసుల కోసం కక్కుర్తి! అంతులేని ధనాశ! దీనికోసం జనం ప్రాణాలనే పణంగా పెట్టారు. కేవలం కమీషన్ల కోసం మద్యం విధానాన్ని మార్చారు. నాసిరకం మద్యంతో దుకాణాలను ముంచెత్తారు. 'మద్యం' అనే విషంతో మనుషుల ప్రాణాలతో ఆటాడుకున్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో... అచ్చంగా మద్యం వల్ల తలెత్తిన నరాలు, కిడ్నీలు, కాలేయ వ్యాధులతో బాధపడిన వారి సంఖ్య అంతకుముందు ఐదేళ్లతో పోల్చితే అనేక రెట్లు పెరిగింది. ఇవేవో ఉత్తుత్తి ఆరోపణలు, కల్పిత గణాంకాలు కావు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు (జగన్ హయాంలో ఆరోగ్యశ్రీ) అధికారికంగా తేల్చిన లెక్కలు!

నరాలు నిర్వీర్యమై జనం వణికిపోనీ!

కలుషితం కడగలేక కాలేయం కుళ్లిపోనీ!

మూత్రపిండాలే మలినమై కుంగిపోనీ!

జవసత్వాలుడిగి.. కడకు మనిషే మట్టిలో కలిసిపోనీ..

వాళ్లకేం లెక్కలేదు! జనమేమైపోయినా చింతలేదు!

ఆ మురాకు ముడుపులు కావాలి!

కమీషన్లతో సొంత ఖజానా నిండాలి!

ప్యాలెస్‌లు కళకళలాడుతూ ఉండాలి!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'వామ్మో... ఏపీ మద్యమా! వద్దు బాబోయ్! కుదిరితే ఎయిర్‌పోర్టులో నాకో బాటిల్ తీసుకురా! లేదంటే... హైదరాబాద్‌లోనో, బెంగళూరులోనో పట్టుకురా! ఏపీ సరుకు మాత్రం వద్దు'... ఆ ఐదేళ్లూ మందుబాబుల మధ్య వినిపించిన మాట! జే-బ్రాండ్ లిక్కర్ అంతగా భయపెట్టింది. ఇవేవీ అనవసరమైన ఆందోళనలు, అవసరంలేని భయాలు కావు! జగన్ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించిన మద్యం నిజంగానే విషతుల్యమని 'రోగాల సాక్షి'గా రుజువైంది. కేవలం ధనాశ, దురాశతో మద్యం విధానాన్ని మార్చేసి... చీప్ లిక్కర్ పేరుతో చెత్త మద్యాన్ని జనం నోళ్లల్లో పోశారు. జగన్ మందు దెబ్బకు జనం జవసత్వాలుడిగిపోయాయి. నరాలు చచ్చుబడిపోయాయి. మూత్రపిండాలు మొరాయించాయి. కాలేయాలు విఫలమయ్యాయి. ఎన్టీఆర్ ఆరోగ్య సేవ ట్రస్టు వద్ద నమోదైన అధికారిక గణాంకాల

మిగతా 13వ పేజీలో...

జే బ్రాండ్లకు గేట్లెత్తారు



అనుమతి పొందిన వెంటనే లక్షల కేసుల ఆర్డర్లు

10 వేల కేసులు దాటకూడదన్న నిబంధనకు స్వస్తి

ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా అనుమతి

చివరికి చిరునామాలు ఇవ్వకపోయినా ఓకే

పాపులర్ బ్రాండ్లకు ఆర్డర్లలో మొండిచేయి

గత ప్రభుత్వాల్లో లక్షల్లో అమ్ముడైన బ్రాండ్లవి

జగన్ జమానాలో పది కేసులూ ఇవ్వని వైనం

మద్యం స్కామ్ చార్జిషీట్‌లో సిట్ వెల్లడి


మిథున్ రెడ్డి @ 4196

రాజమండ్రి జైలు స్నేహ బ్యారక్‌లో రిమాండ్ ఖైదీగా వైసీపీ ఎంపీ

మంచం, టీవీ, వాటర్ బాటిల్, ప్రొటీన్ పౌడర్ ఇవ్వాలని పిటిషన్

2 పూటలా ఇంటి నుంచి భోజనం.. అల్పాహారం అనుమతించాలని విజ్ఞప్తి

ఉదయం నుంచి సాయంత్రం వరకూ జైలు బయటే ద్వారకానాథ్ రెడ్డి



జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా!



పార్లమెంటు సమావేశాల తొలిరోజే ఉపరాష్ట్రపతి సంచలన నిర్ణయం

అనారోగ్య కారణమంటూ రాష్ట్రపతికి లేఖ

రెండేళ్ల పదవీకాలం ఉండగానే విరమణ

అనారోగ్యం కాదు.. రాజకీయ కారణాలే

ధన్‌ఖడ్ నిర్ణయంపై విశ్లేషకుల అంచనా

సెప్టెంబరు 19లోపు ఉపరాష్ట్రపతి ఎన్నిక

అప్పటిదాకా డిప్యూటీ చైర్మన్‌కు బాధ్యతలు


పార్లమెంటు సమావేశాల తొలిరోజైన సోమవారం రాజ్యసభలో జగదీప్ ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజునే... తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాల రీత్యా వైద్య సలహా మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖ పంపించారు. సోమవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ధన్‌ఖడ్ స్వయంగా తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. ఆయన సోమవారం సాయంత్రం వరకు రాజ్యసభలో క్రియాశీలంగా ఉన్నారు. ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా వెనుక రాజకీయ కారణాలుండవచ్చునని ఢిల్లీలో చర్చలు

మిగతా 2వ పేజీలో...



జీరో ఫేర్ టికెట్

మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు

ఆర్టీసీ బస్సుల్లో 100% ప్రభుత్వ రాయితీ

అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

విద్యుత్ బస్సులు, చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశం

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. వంద శాతం ప్రభుత్వ రాయితీతో మహిళలకు 'జీరో ఫేర్ టికెట్' ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి మహిళా ప్రయాణికురాలికి

మిగతా 14వ పేజీలో...

తియ్యని మత్తు!

అడ్డదారుల్లో గంజాయి అమ్మకాలు

ఒడిశా, బిహార్, పశ్చిమబెంగాల్ కేంద్రంగా గంజాయి కలిపిన చాక్లెట్ల తయారీ

ఆకర్షణీయ ప్యాకెట్‌లపై ఆయుర్వేద ముద్ర.. తెరిచి చూస్తే గంజాయి వాసన

తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడిగా అమ్మకాలు

"ఆ ప్యాకెట్ చూడగానే ఆకర్షణీయంగా కనిపిస్తుంది. తెరిస్తే నల్లటి గోళీ ఆకారంలో ఒక చాక్లెట్ ఉంటుంది. వాసన చూస్తేనేమో గంజాయిలా, తింటేనేమో తియ్యగా ఉంటుంది. ఆ తర్వాత మత్తులోకి జారుకోవడమే ఇక! చిన్నారులకైతే ఏం చేస్తున్నామో కూడా తెలియనంత మైకం!! ఇదీ గంజాయి కలిపిన ఆ చాక్లెట్‌ల ప్రభావం. గంజాయిపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో పాటు విస్తృత దాడులు చేస్తుండటంతో అక్రమార్కులు గంజాయి అమ్మకానికి సరికొత్త అక్రమ మార్గాలు ఎంచుకుంటున్నారు. ఆ కోవలోదే ఈ గంజాయి చాక్లెట్. అనుమానం రాకుండా ఆయుర్వేదం పేరు చెప్పి 'భాంగ్ గోళీ' అంటూ అమ్మేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడిగా వీటి అమ్మకాలు జరుగుతున్నాయి."


మార్కెట్‌లో దొరుకుతున్న గంజాయి కలిపిన చాక్లెట్ ప్యాకెట్‌లు

(తెనాలి - ఆంధ్రజ్యోతి)

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధానంగా నగరాల్లోని పలు పాన్ షాపులు, సిగరెట్ దుకాణాల్లో గంజాయి చాక్లెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఒడిశా, బిహార్, పశ్చిమబెంగాల్ వంటి కొన్ని రాష్ట్రాల్లో వీటిని తయారుచేసి, అక్రమంగా రవాణా చేస్తున్నారు. కొన్ని ఆన్‌లైన్

మిగతా 14వ పేజీలో...



2

కమ్యూనిస్టు దిగ్గజం

వీఎస్ అచ్యుతానందన్ కన్నుమూత

101 ఏళ్ల సుదీర్ఘ జీవన ప్రస్థానం

సాధారణ నేపథ్యం నుంచి ఉన్నత శిఖరాలకు..

82 ఏళ్ల వయసులో తొలిసారి సీఎంగా

అవినీతిని సహించని రాజీలేని వైఖరి..

సొంత పార్టీ నేతలపైనా విమర్శలు

ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్ సంతాపం

బరాక్ ఒబామా 'అరెస్టు'!

ఏఐ వీడియో పోస్ట్ చేసిన ట్రంప్ 11

ఒబామాను అరెస్టు చేస్తుంటే తాను.. చిరునవ్వులు చిందిస్తున్నట్లు వీడియో

అమెరికా అధ్యక్షుడి తీరుపై విమర్శలు

భారత్‌పై చైనా కుయుక్తులు!

ఎలక్ట్రానిక్స్ రంగంలో అనధికార వాణిజ్య ఆంక్షలు

ముఖ్య పరికరాలు, మినరల్స్‌పై నియంత్రణలు

తమ ఇంజనీర్లు వెనక్కి రావాలంటూ ఆదేశాలు

'ప్రపంచ తయారీ హబ్'గా భారత్ ఆవిర్భావాన్ని దెబ్బతీయడమే లక్ష్యం

ప్రమాదంలో రూ.2.75 లక్షల కోట్ల ఫోన్ల ఎగుమతి

ఐసీఈఏ ఆందోళన.. కేంద్రానికి లేఖ



న్యూఢిల్లీ, జూలై 21: ఎలక్ట్రానిక్స్ రంగంలో భారతదేశ ఎదుగుదలను చూసి ఓర్వలేని చైనా.. కుయుక్తులకు పాల్పడుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమైన పరికరాలు, మినరల్స్‌పై నియంత్రణలు, 'భారత్‌ను వీడి వచ్చేయండి' అంటూ తమ దేశ నిపుణులకు ఆదేశాలిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) కేంద్ర ప్రభుత్వానికి ఓ లేఖ రాసింది. చైనా 'అనధికార వాణిజ్య ఆంక్షలకు' పాల్పడుతోందని పేర్కొంది. చైనా రహస్య చర్యలు భారతదేశ ప్రపంచ

మిగతా 11వ పేజీలో...



తొలిరోజే రభస

పహల్గామ్ అంశంపై స్తంభించిన పార్లమెంటు

ఉభయ సభల్లో కార్యకలాపాలను అడ్డుకున్న విపక్షం.. ఆపరేషన్ సిందూర్ పైనా చర్చకు పట్టు

పహల్గామ్ హంతకుల ఆచూకీ ఏదన్న ఖర్గే

వచ్చేవారం 16 గంటల చర్చకు ప్రభుత్వం ఓకే

వ్యూహంపై మంత్రులతో చర్చించిన ప్రధాని

జస్టిస్ వర్మ తొలగింపు.. 204 మంది ఎంపీల సంతకాలు.. అభిశంసన ప్రక్రియ ప్రారంభం

'ఆపరేషన్ సిందూర్' మన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది: ప్రధాని మోదీ

సభలో నా నోరు నొక్కేస్తున్నారు: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్రవాద దాడి, అనంతరం పాకిస్థాన్ మీద భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అంశాలపై పార్లమెంటు ఉభయ సభల్లో అత్యంత కీలక ప్రశ్నలను లేవనెత్తేందుకు ప్రతిపక్షాలు సన్నద్ధమవుతున్నాయి. సోమవారం తొలిరోజే ఈ అంశంపై ఉభయ సభల్లో గందరగోళం జరిగింది. లోక్‌సభ ఎలాంటి కార్యకలాపాలూ నిర్వహించలేక పోయింది. రాజ్యసభలో ప్రతిపక్షాలు ప్రశ్నోత్తరాల సమయాన్ని బహిష్కరించాయి. పహల్గామ్ ఘటనకు

మిగతా 2వ పేజీలో...

అన్ని హద్దులూ దాటేస్తున్నారు!

రాజకీయ ప్రయోజనాల కోసం ఈడీ దుర్వినియోగం: సుప్రీంకోర్టు

ముడా కేసులో కర్ణాటక సీఎం భార్యకు ఊరట

క్లైంట్లకు సలహాపై లాయర్లకు ఈడీ సమన్లు.. సుప్రీం తీవ్ర ఆగ్రహం

ఈడీ సూపర్ పోలీసు కాదంటూ మద్రాసు హైకోర్టు మొట్టికాయ



న్యూఢిల్లీ, జూలై 21: రాజకీయ ప్రయోజనాల కోసం ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్)ని దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈడీ అధికారులు అన్ని హద్దులూ దాటేస్తున్నారని వ్యాఖ్యానించింది. రాజకీయాల్లో పావుగా మారొద్దని ఈడీకి హితవు పలికింది. 'రాజకీయ యుద్ధాలను ఎన్నికల వరకే పరిమితం కానివ్వండి. ఇందులో మిమ్మల్ని ఎందుకు వాడుకుంటున్నారు?' అని ఈడీని ఉద్దేశించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. రాజకీయాలకు కోర్టును వేదికగా మార్చొద్దని హెచ్చరించింది. ఈడీ గురించి తాము ఇంతకంటే కఠినంగా మాట్లాడేలా

మిగతా 11వ పేజీలో...

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా!

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్నాయి. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణ కింద తాను రాష్ట్రపతికి రాజీనామా లేఖను సమర్పించానని జగదీప్ ధన్‌ఖడ్ వెల్లడించారు. ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిచ్చేందుకు వైద్య సలహాను అనుసరించి తాను వెంటనే రాజీనామా చేస్తున్నట్లు ఆయన రాష్ట్రపతికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతిగా ఉన్న కాలంలో ఇచ్చిన మద్దతు, విశ్వాసం, గౌరవాలకు గాను ప్రధానమంత్రికి, ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. మహోన్నత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉప రాష్ట్రపతిగా తాను ఎన్నో అమూల్యమైన అనుభవాలు, అంతర్గత విషయాలను తెలుసుకున్నానని చెప్పారు. ఈ కీలక సమయంలో దేశంలో చెప్పుకోదగ్గ ఆర్థిక ప్రగతి, అసాధారణమైన అభివృద్ధిని చూడగలగడం తనకెంతో సంతృప్తి ఇచ్చిందని తెలిపారు. దేశ చరిత్రలో పరిణామాత్మకమైన సమయంలో దేశసేవ చేయడం తనకు లభించిన గౌరవంగా అభివర్ణించారు. ధన్‌ఖడ్‌కు వచ్చే ఏడాది ఏప్రిల్‌తో 75 ఏళ్లు పూర్తవుతాయి.

రెండేళ్లు ఉండగానే

వెంకయ్యనాయుడి తర్వాత 2022లో ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన ధన్‌ఖడ్ నిజానికి 2027 ఆగస్టు 10 వరకు పదవిలో కొనసాగాల్సి ఉన్నది. ఆయన పైకి అనారోగ్య కారణాల వల్ల రాజీనామా చేసినట్లు చెబుతున్నప్పటికీ అంతర్గత రాజకీయ కారణాల వల్ల ఆయన తప్పుకొని ఉండవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ఇంతవరకూ ఏ ఉప రాష్ట్రపతీ మధ్యలో ఆరోగ్య కారణాల రీత్యా రాజీనామా చేయలేదని, ఆరోగ్యం దెబ్బతిన్న సందర్భాల్లో కూడా పదవిలో కొనసాగారని చెబుతున్నారు. ఇద్దరు ఉప రాష్ట్రపతులు మాత్రం రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు మధ్యలో రాజీనామా చేశారు. వీరిలో వి.వి.గిరి 1969 జూలై 20న రాజీనామా చేయగా, ఆర్.వెంకట్రామన్ 1987 జూలైలో రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వ



రిస్తున్న సమయంలో ఉపరాష్ట్రపతి అనారోగ్యానికి గురైతే వైస్ చైర్మన్ బాధ్యతలు నిర్వర్తించిన సందర్భాలున్నాయని, ప్యానెల్ చైర్మన్లు కూడా ఉంటారని, అందువల్ల ధన్‌ఖడ్ రాజీనామాకు ఇతరత్రా కారణాలుండవచ్చునని ఊహాగానాలు వినబడుతున్నాయి. అయితే, ఈ ఏడాది మార్చిలో దన్‌ఖడ్ గుండె సంబంధ సమస్యతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరారు. గత నెల కుమాయు విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవంలో స్పృహతప్పి పడిపోయారు. నిజానికి సోమవారం రాజ్యసభ సమావేశమైనపుడు ధన్‌ఖడ్ మామూలుగా వ్యవహరించారని, సభను సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారని రాజకీయ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. అయిదుగురు కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ధన్‌ఖడ్.. ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేసి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరగాలన్న విపక్షాల డిమాండ్‌ను తోసిపుచ్చారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్లు దొరకడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన ధన్‌ఖడ్.. ఆయన అభిశంసనపై రాజ్యసభలో చర్చ నిర్వహించాల్సి ఉంది. ప్రతిపక్షాలు సమర్పించిన తీర్మానం నోటీసుపై రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు తగు చర్యలు తీసుకొమ్మని ఆయన సమాచారం కూడా పంపారు. అంతా సవ్యంగానే జరుగుతున్నట్లు కనిపిస్తున్న సమయంలో ధన్‌ఖడ్ ఎందుకు రాజీనామా చేశారో రాజకీయ వర్గాలకు అంతుబట్టడం లేదు.

ధన్‌ఖడ్ స్థానంలో ఎవరు?

కొత్త ఉప రాష్ట్రపతిని 60 రోజుల్లో ఎన్నుకోవాల్సి ఉన్నందువల్ల ప్రభుత్వం త్వరలో అందుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభిస్తుంది. సెప్టెంబరు 19 లోపు కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవాల్సి వస్తుంది. అంతవరకూ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తాత్కాలికంగా చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రధాని మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మూతో సంప్రదించి ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తారు. ఈ పదవిలో ఎవరిని నియమించాలన్న విషయంపై మోదీ ఎన్డీఏ నేతలతో కూడా సంప్రదిస్తారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఉపరాష్ట్రపతిని ఉభయ సభల ఎంపీలు కలిసికట్టుగా ఎన్నుకుంటారు.

ఆరోగ్య కారణం నమ్మశక్యంగా లేదు

న్యూఢిల్లీ, జూలై 21: ధన్‌ఖడ్ రాజీనామాపై కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయన చెబుతున్న కారణం నమ్మశక్యంగా లేదన్నారు. సాయంత్రం 5 గంటల వరకు ఆయనతోనే ఉన్నానని, రాత్రి 7.30కు కూడా ఫోన్లో మాట్లాడానని తెలిపారు. రాజీనామా వెనుక బయటకు చెప్పేది కాకుండా ఇంకేదో ఉందని అభిప్రాయపడ్డారు. మంగళవారం సభా వ్యవహారాల కమిటీ సమావేశానికి నేతృత్వం వహించి, న్యాయవ్యవస్థకు(జస్టిస్ వర్మ) సంబంధించి కీలక నిర్ణయాన్ని ప్రకటించాల్సిన ఆయన హఠాత్తుగా రాజీనామా చేయడం తమను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ధన్‌ఖడ్ మరోసారి తన నిర్ణయంపై ఆలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రయోజనాల దృష్టిలో ఉంచుకుని ప్రధాని కూడా జోక్యం చేసుకోవాలని కోరారు.

విమర్శలు.. పరుష వ్యాఖ్యలు..

బెంగాల్ గవర్నర్‌గా, ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్‌ఖడ్ తీరిదీ!

2022 ఆగస్టు 11న భారత 14వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు

న్యాయ వ్యవస్థ తీరుతెన్నులపై పలు సందర్భాల్లో తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 21: తన పదవీకాలం ముగియడానికి రెండేళ్ల ముందే.. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్నారు. జాట్ సామాజిక వర్గానికి చెందిన ధన్‌ఖడ్.. 1951లో మే 18వ తేదీన రాజస్థాన్‌లోని కిఠానా గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. ఆయన తొలుత 1989లో జనతాదళ్ అభ్యర్థిగా రాజస్థాన్‌లోని ఝున్‌ఝునూ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 1991 దాకా లోక్‌సభ సభ్యుడిగా ఉన్నారు. ఆ సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 1998లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఝున్‌ఝును లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అప్పట్నుంచీ కొంతకాలంపాటు సీరియస్‌గా న్యాయవాద వృత్తిపైనే దృష్టి సారించారు. మళ్లీ, 2003లో బీజేపీలో చేరిన ఆయన.. అప్పట్నుంచీ ఆ పార్టీలోనే కొనసాగారు. పార్టీలో పలు కీలక పదవులు చేపట్టారు. 2019 జూలై 20న.. అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయన్ను పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమించారు. అప్పట్నుంచీ.. రాజకీయ అంశాలపై సామాజిక మాధ్యమాల్లో తన పోస్టుల ద్వారా మమత సర్కారుపై ధన్‌ఖడ్ విమర్శలు గుప్పించేవారు. దీదీ సర్కారుతో వ్యవహరించిన తీరుతో ఆయన పేరు దేశవ్యాప్తంగా తెలిసింది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆయన్ను.. 'నిజమైన విపక్షనేత'గా అభివర్ణించిందంటే బెంగాల్ ప్రభుత్వంతో ఆయన ఏ స్థాయిలో ఘర్షణ వైఖరితో వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు.

చివరకు.. 2022 జనవరిలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆయన పోస్టులను చూడలేక.. విసుగుతో ఆయన తనను ట్విటర్‌లో ట్యాగ్ చేయడానికి వీల్లేకుండా ఆయన ఖాతాను బ్లాక్ చేశారు. 2022లో ఎన్డీయే కూటమి ఆయన్ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రంగంలోకి దించడంతో.. గవర్నర్ పదవికి 2022 జూలై 17న ఆయన రాజీనామా చేశారు. 2022 ఆగస్టు 11న భారత 14వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. ఉపరాష్ట్రపతిగా ఉంటూనే న్యాయవ్యవస్థపై.. ముఖ్యంగా న్యాయనియామకాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బిల్లులు ఆమోదించే విషయంలో.. రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీం వెలువరించిన తీర్పును తప్పుబట్టారు. దేశంలో చట్టాలు చేసేదీ వారే.. వాటిని అమలుచేసేదీ వారే అన్నట్టుగా న్యాయమూర్తులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు కల్పించే ఆర్టికల్ 142.. ప్రజాస్వామ్య శక్తులకు వ్యతిరేకంగానూ.. 24 గంటలూ న్యాయవ్యవస్థకు అందుబాటులో ఉండే అణు క్షిపణిలా మారిందని వ్యాఖ్యానించారు.

లోకం తీరు



జరిమానా లేకుండా టీడీఎస్‌ను వాపసు చేయాలి

- ఐటీ బిల్లుపై 566 సూచనలు
- పార్లమెంటరీ కమిటీ నివేదిక సమర్పణ

న్యూఢిల్లీ, జూలై 21: ఆదాయపు పన్ను చట్టం-2025లో పలు సవరణలు చేయాలని సూచిస్తూ పార్లమెంటరీ కమిటీ సోమవారం లోక్‌సభకు నివేదిక సమర్పించింది. లోక్‌సభలో బీజేపీ సభ్యుడు బైజయంత్ పండా ఆధ్వర్యంలోని 31 మంది సభ్యుల సెలెక్ట్ కమిటీ ఈ బిల్లుపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించింది. మార్పులు, సవరణలపై మొత్తం 566 సూచనలు చేసింది. ఇందులో 32 కీలక సిఫార్సులు ఉన్నాయి. నిర్వచనాలను సరళతరం చేసి, చట్టం సులభంగా అర్థమయ్యేలా ఉండాలని తెలిపింది. అందువల్ల 'మునుపటి సంవత్సరం' (ప్రీవియస్ ఇయర్), 'అసెస్‌మెంట్ ఇయర్ (మదింపు సంవత్సరం) అన్న పదాలకు బదులుగా 'పన్ను సంవత్సరం' (ట్యాక్స్ ఇయర్) అన్న ఒక్క పదాన్నే ఉపయోగించాలని సూచించింది. 4,575 పేజీల ఈ నివేదికలో పన్ను మినహాయింపులపైనా సూచనలు చేసింది. తక్కువ ఆదాయం ఉండే ఉద్యోగులకు ఊరట కలిగించేలా కీలక సిఫార్సు చేసింది. పన్ను చెల్లించాల్సిన అవసరం లేనప్పటికీ కొందరు ఉద్యోగులకు టీడీఎస్ కింద జీతంలో పన్ను మినహాయిస్తారు. అనంతరం నిర్ణీత తేదీలోగా రిటర్నులు సమర్పిస్తే వసూలు చేసిన పన్నును తిరిగి చెల్లిస్తారు. ఒకవేళ రిటర్నులు సమర్పించడంలో జాప్యం జరిగితే జరిమానా విధిస్తారు. ఈ జరిమానాను ఇకపై విధించకూడదని సిఫార్సు చేసింది. మత-ధార్మిక సంస్థలకు గుప్తంగా లభించే అప్రకటిత విరాళాలకు పన్ను మినహాయింపులను కొనసాగించాలని సూచించింది. 'క్యాపిటల్ అస్సెట్, 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాపిటల్ కంపెనీ' వంటి నిర్వచనాలను ఆధునికీకరించాలని, 'వ్యాపార ఖర్చులు'లో అనే అంశంలో 'వాస్తవ చెల్లింపులు' అనే మాటను పునరుద్ధరించాలని కోరింది.

అందిన అభిశంసన తీర్మానాలు!

- జస్టిస్ వర్మను తొలగించాలని 204 మంది సంతకాలు
- లోక్‌సభలో 152 మంది, రాజ్యసభలో 52 మంది
- అభిశంసన ప్రక్రియను ప్రారంభించిన రాజ్యసభ

న్యూఢిల్లీ, జూలై 21: వివాదాస్పద హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించడానికి ఉద్దేశించిన అభిశంసన ప్రక్రియ మొదలైంది. ఆయన్ను పదవి నుంచి తొలగించే తీర్మానాన్ని చేపట్టాలని కోరుతూ 152 మంది ఎంపీలు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించారు. ఈ తీర్మానానికి పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యుల నుంచి మద్దతు లభించింది. దానిపై సంతకం చేసిన వారిలో బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, జేడీయూ, సీపీఎం ఇతర పార్టీల సభ్యులున్నారు. లోక్‌సభలో వంద, రాజ్యసభలో 50 మంది సభ్యులు కోరుకుంటే సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి మీద అభిశంసన ప్రక్రియ మొదలు పెట్టొచ్చు. లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ చైర్మన్‌లలో ఎవరైనా అభిశంసన ప్రక్రియను ముందుకు తీసుకు వెళ్లాలి. ఈసారి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆ బాధ్యతను తీసుకున్నారు. అభిశంసనకు అవసరమైన చర్యలు తీసుకొమ్మని రాజ్యసభ సెక్రెటరీ జనరల్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా, తానేమీ తప్పు చేయలేదని జస్టిస్ వర్మ అంటున్నారు. సుప్రీంకోర్టు కమిటీ అభిశంసన సిఫార్సును సవాలు చేస్తూ ఇప్పటికే ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

అధిక పింఛను దరఖాస్తుల్లో 11,01,582 తిరస్కరణ

న్యూఢిల్లీ, జూలై 21: ఈపీఎఫ్‌వో అధిక వేతనాలపై పింఛను కోసం వచ్చిన 15,24,150 దరఖాస్తులలో దాదాపు 98.5 శాతం పరిష్కరించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల సహాయ మంత్రి శోభా కరంద్లాజే లోక్‌సభకు సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలను వెల్లడించారు. అధిక వేతనాలపై పింఛనుకు అర్హులైన దరఖాస్తుదారులకు ఈపీఎఫ్‌వో ఇప్పటివరకు 4,00,573 డిమాండ్ లేఖలను జారీ చేయగా, 11,01,582 దరఖాస్తులను తిరస్కరించింది. ఇంకా 21,995 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు.

ఈ ఏడాది ప్రథమార్థంలో రూ.18,662 కోట్ల క్రిప్టోల చౌర్యం

న్యూఢిల్లీ, జూలై 21: ప్రపంచవ్యాప్తంగా క్రిప్టోల దొంగతనాలు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా దేశీయ క్రిప్టో ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ కాయిన్‌డీసీఎక్స్‌పై గతవారం దాడి చేసిన సైబర్ నేరగాళ్లు ఏకంగా 4.42 కోట్ల డాలర్ల (సుమారు రూ.378 కోట్లు) క్రిప్టో కరెన్సీలను దొంగిలించారు. దీనికన్నా ముందు.. ఈ ఏడాది ప్రథమార్థం(జనవరి-జూన్)లో ప్రపంచవ్యాప్తంగా 217 కోట్ల డాలర్ల (రూ.18,662 కోట్లు) క్రిప్టో దొంగతనాలు జరిగాయి. ఈ విషయాన్ని బ్లాక్ చెయిన్ అనలిటిక్స్ ప్లాట్‌ఫామ్ చైనాలిసిస్ నివేదిక వెల్లడించింది. బైబిట్ ఎక్స్ఛేంజ్‌లో జరిగిన 150 కోట్ల డాలర్ల చోరీ ఇప్పటివరకు క్రిప్టో పరిశ్రమ చరిత్రలోనే అత్యధికమని, ఈ ఏడాదిలో జరిగిన మొత్తం క్రిప్టో దొంగతనాల్లో 69 శాతానికి సమానమని రిపోర్టు వెల్లడించింది. ఇదిలా ఉండగా, సైబర్ దాడిలో నష్టపోయిన 4.42 కోట్ల డాలర్లను రికవరీ చేసుకునేందుకు కాయిన్‌డీసీఎక్స్ నజరానా ప్రకటించింది. ఈ దొంగతనానికి పాల్పడిన వారి జాడ తెలిపిన లేదా రికవరీకి తోడ్పడే సమాచారం అందించిన వారికి తిరిగి రాబట్టిన సొత్తులో 25% ఇస్తామని తెలిపింది.

పెళ్లయి 25 ఏళ్లయిన మహిళ 25 ఏళ్ల మేనల్లుడితో ప్రేమలో!

- భర్త, నలుగురు పిల్లలను వదిలేసి అతడితో పరార్

లఖ్‌నవూ, జూలై 21: పాతికేళ్లక్రితం పెళ్లయి నలుగురు పిల్లలున్న ఆ మహిళకు తన మేనల్లుడైన పాతికేళ్ల యువకుడితో ప్రేమ పుట్టింది. భర్తను కాదని ఆ యువకుడితోనే తన జీవితం అనుకున్న ఆమెకు పెళ్లీడుకొచ్చిన ఇద్దరు ఆడపిల్లలున్నారు! పెద్దమ్మాయి వయసు ఇరవై ఏళ్లు.. రెండో అమ్మాయి వయసు పద్దెనిమిదేళ్లు! మరో ఇద్దరు అబ్బాయిల్లో ఒకరి వయసు 17 ఏళ్లు.. మరొకరి వయసు 10ఏళ్లు! కట్టుకున్న భర్తను, కడుపున పుట్టిన పిల్లలను కాదని ఒకానొక రోజు ప్రేమికుడితో కలిసి ఆమె ఇంట్లోంచి వెళ్లిపోయింది. యూపీలోని సిద్ధార్థనగర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ప్రియుడి వెంట ఆమె వెళ్లిపోవడంతోనే స్టోరీ ముగియలేదు. ఇక్కడి నుంచే ట్విస్టుల మీద ట్విస్టులతో కథ సాగింది! కుటుంబ పోషణ కోసం నెలలో చాలా రోజులు ఆ భర్త ఇంటికి దూరంగా ఉంటుంటే.. ఆ ఇంటికి ఆమె మేనల్లుడు(25) తరచూ వచ్చేవాడు! ఆ ఇల్లాలికి, ఆ యువకుడి మధ్య చనువు పెరిగి.. అది ఇద్దరి మధ్య ప్రేమకు దారితీసింది. గత ఏడాది ఆమె, తన ప్రియుడితో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఇద్దరూ కోర్టులో పెళ్లి చేసుకున్నారు. దీనిపై ఆ భర్త, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొన్నాళ్లకు ఆ యువకుడితో గొడవలు తలెత్తడంతో ఆమె తిరిగి తన భర్త దగ్గరకు వచ్చేసింది. ఆమెను పెద్ద మనసుతో భర్త క్షమించేసి అక్కున చేర్చుకున్నాడు. అటు.. ఆమె ప్రియుడు కూడా ఇక ఎంతమాత్రం కలిసి ఉండే ప్రసక్తే లేదని పోలీసుల సాక్షిగా చెప్పాడు. అయితే కొన్నాళ్లకు.. ఆమె మళ్లీ ఇంట్లోంచి వెళ్లిపోయి ప్రియుడి చెంతకు చేరింది. ఆదివారం అతడిని వెంటబెట్టుకొని ఊరొచ్చేసింది. బంధువులు, గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. తనకు భర్త వద్దని, ప్రియుడితోనే కలిసి ఉండాలనుకుంటున్నట్లు పెద్దల ఎదుట ఆమె స్పష్టం చేసింది. 'నాతో కలిసి ఉండటానికి ఆమెకు ఇష్టంలేకపోతే.. ఆమెను నిరోధించే హక్కు నాకెక్కడిది?' అని చెబుతూ ప్రియుడితో కలిసి వెళ్లిపోయేందుకు భర్త అనుమతినిచ్చాడు.

విజయోత్సవాలుగా పార్లమెంటు సమావేశాలు

- ఆపరేషన్ సిందూర్ మన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 21: 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో జరిగే చర్చలో పాలక కూటమి ఎంపీల వైఖరి ఏ విధంగా ఉండాలో ప్రధాని మోదీ ఉద్బోధించారు. ఈ సమావేశాలను విజయోత్సవాలుగా అభివర్ణించారు. ఈ సెంటిమెంటును పార్లమెంటు సభ్యులు ఏకకంఠంతో తెలియజేయాలని సూచించారు. సోమవారం ఉదయం సమావేశాలు ప్రారంభమవుతాయనగా పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశాలు గర్వించదగినవన్నారు. 'జాతికి ఇది విజయోత్సవం.ఆపరేషన్ సిందూర్‌తో మన సాయుధ బలగాల సామర్థ్యాన్ని ప్రపంచం కళ్లారా చూసింది.



మీడియాతో మాట్లాడుతున్న మోదీ

లక్ష్యాలను అవి నూరు శాతం సాధించాయి. మన బలగాలు ఆపరేషన్ సిందూర్‌తో కేవలం 22 నిమిషాల్లో ఉగ్రవాద బాస్‌లను వారి ఇళ్లలోనే భూస్థాపితం చేశాయి. మేడిన్ ఇండియా ఆయుధాల సత్తాను సిందూర్ చాటిచెప్పింది. మన ఆయుధ శక్తి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దేశంలో ప్రస్తుతం పలు సానుకూల పరిణామాలు నెలకొన్నాయి. నక్సలిజం శరవేగంగా అంతరిస్తోంది. రెడ్‌జోన్ హరిత వృద్ధి జోన్‌గా మారుతోంది. చాలా జిల్లాలు నక్సలిజం గుప్పిట నుంచి బయటకు వచ్చాయి. స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారతీయ పతాకం రెపరెపలాడుతోంది' అని తెలిపారు. ఉగ్రవాదుల యజమాని పాకిస్థాన్ ముసుగు తొలగించేందుకు అఖిల పక్ష ఎంపీలు ప్రపంచ దేశాలను సందర్శించి.. ఆపరేషన్ సిందూర్ అసలు లక్ష్యాన్ని వివరించేందుకు చేసిన కృషిని మోదీ అభినందించారు. రాజకీయ పార్టీలకు వేర్వేరు ఎజెండాలు ఉంటాయని..అయితే జాతీయ ప్రయోజనాలు ఇమిడి ఉన్న అంశాల్లో ఐకమత్యం అవసరమని సూచించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత దేశంలో ఐక్యతను తాను చూశానన్నారు.

ఆయన మీ స్నేహితుడా.. వర్మ అని పిలుస్తున్నారు..!

- లాయర్ నెడుంపారాపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 21: ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మను.. కేవలం 'వర్మ' అంటూ సంబోధించిన న్యాయవాదిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని.. తన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలంటూ న్యాయవాది మాథ్యూ నెడుంపారా కోర్టును కోరారు. తాను మూడోసారి ఈ పిటిషన్‌ను దాఖలు చేస్తున్నానని.. ఒక సమయంలో జస్టిస్ వర్మను కేవలం 'వర్మ' అని ఆయన సంబోధించారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'జస్టిస్ వర్మ మీకేమైనా స్నేహితుడా..? ఇప్పటికీ ఆయన హైకోర్టు న్యాయమూర్తిగానే ఉన్నారని మరిచిపోయారా?' అంటూ న్యాయవాది నెడుంపారాపై సీరియస్ అయ్యారు. దీంతో నెడుంపారా.. 'ఆ గొప్పతనం ఆయనకు వర్తించదు' అంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. అయితే తమకు పాఠాలు చెప్పొదంటూ జస్టిస్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం మరోసారి మండిపడింది. పిటిషన్ అత్యవసర విచారణకు నిరాకరించింది.

నకిలీ ఓటర్ల తొలగింపునకే బిహార్లో జాబితాల సవరణ

- సుప్రీంకోర్టుకు తెలిపిన ఈసీ

న్యూఢిల్లీ, జూలై 21: అధికార పక్షానికి మేలు కలిగించే విధంగా బిహార్‌లోని ఓటర్ల జాబితాలో సవరణలు చేస్తున్నారంటూ వస్తున్న విమర్శలను ఎన్నికల సంఘం మరోసారి తిరస్కరించింది. నకిలీ ఓటర్లను తొలగించాలన్న లక్ష్యమే తప్ప మరో ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలు ప్రతిపక్షాలు దాఖలు చేసిన వ్యాజ్యాలకు సమాధానంగా సోమవారం ప్రమాణ పత్రాన్ని సమర్పించింది. ఓటరు జాబితా నుంచి నకిలీ ఓటర్లను తొలగించాలన్న రాజ్యాంగపర విధిని నిర్వర్తిస్తున్నట్టు తెలిపింది. దీనివల్ల అసలు ఓటర్లకు ఎలాంటి నష్టం ఉండబోదని పేర్కొంది.

యూజీసీ-నెట్ పరీక్ష ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 21: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జూన్ నెలలో నిర్వహించిన యూజీసీ-నెట్ పరీక్షల ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్-జేఆర్ఎఫ్ కోసం 5,269 మంది ఎంపికయ్యారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం 54,885 మంది అర్హత సాధించారు. కేవలం పీహెచ్‌డీ ప్రవేశాల కోసం 1,28,179 మంది అర్హత పొందారు. పరీక్ష కోసం మొత్తం 10,19,751 మంది పేర్లు నమోదు చేసుకోగా అందులో 7,52,007 మంది రాశారు. 4,28,853 మంది పురుషులు పేర్లు నమోదు చేసుకోగా, వారిలో 3,05,122 మంది పరీక్షకు హాజరయ్యారు. 5,90,837 మంది మహిళలు పేర్లు నమోదు చేసుకోగా, 4,46,849 మంది పరీక్ష రాశారు.

తొలిరోజే రభస

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడ్డ ఉగ్రవాదులను ఇంతవరకు ఎందుకు నిర్బంధించడం కానీ, నిర్మూలించడం కానీ చేయలేదని, యుద్ధాన్ని తానే నిలిపివేయించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనలో అంతర్యమేమిటని ప్రతిపక్షాలు ప్రశ్నించనున్నాయి. ఉభయ సభలు తొలి రోజు వాయిదా వేసిన వెంటనే ప్రధాని మోదీ హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రిజిజు, బీజేపీ జాతీయాధ్యక్షుడు నడ్డా, ఆర్థిక మంత్రి నిర్మల, వ్యవసాయ మంత్రి శివరాజ్‌లతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చను ఏ విధంగా నిర్వహించాలి? అన్న అంశంపైనే ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. మోదీ ఈ వారం విదేశీ పర్యటనలో ఉన్నందువల్ల ఆపరేషన్ సిందూర్‌పై వచ్చే వారం 16 గంటల పాటు చర్చించడానికి ప్రభుత్వం అంగీకరించింది. సోమవారం ఉదయం వర్షాకాల సమావేశాలు మొదలయ్యేందుకు ముందు స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగిన సభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశంలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు సమయాన్ని కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, సభా కార్యకలాపాలను నిలిపేసి పహల్గామ్‌పై చర్చ జరపాలని కాంగ్రెస్ విప్ మాణిక్కం టాగోర్ లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 267 నిబంధన కింద వెంటనే చర్చించాలని రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎంపీ రణదీప్ సూర్జేవాలా నోటీసులు సమర్పించారు. పూర్తి స్థాయి చర్చకు అనుమతిస్తానని రాజ్యసభ చైర్మన్ జగదీప్ దంఖడ్ హామీ ఇచ్చారు. అయితే, ఆపరేషన్ సిందూర్ సహా అనేక అంశాలపై వెంటనే చర్చ జరగాలని డిమాండ్ చేశాయి. నినాదాలతో హోరెత్తించాయి. గందరగోళం మధ్యలో ఉభయ సభల్లో పలు బిల్లులను ప్రవేశపెట్టారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆపరేషన్ సిందూర్‌పై మల్లికార్జున ఖర్గే, జేపీ నడ్డాల మధ్య వాగ్వాదం జరిగింది. పహల్గామ్ సంఘటనకు దారితీసిన ఇంటలిజెన్స్ వైఫల్యంపై, జవాబుదారీ లేకపోవడం, యుద్ధం ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 24 సార్లు చేసిన ప్రకటనలపై చర్చ జరగాల్సిందేనని ఖర్గే డిమాండ్ చేశారు. జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, సీడీఎస్, డిప్యూటీ ఆర్మీ చీఫ్, ఇతర అధికారుల ప్రకటనలపై కూడా చర్చ జరగాలని పట్టుబట్టారు. యుద్ధానికి సంబంధించిన వివరాలను సభలో చర్చించడం సరైంది కాదని జేపీ నడ్డా అన్నారు. చర్చల ద్వారానే సభను సాగించాలని, మనం అంతర్గతంగా పోట్లాడితే శత్రువుకు బలం చేకూర్చినట్లవుతుందని జగదీప్ దంఖడ్ అన్నారు. ప్రశ్నోత్తరాల సమయం జరుగుతుండగానే విపక్షాలు వాకౌట్ చేశాయి.



తన పుట్టిన రోజు సందర్భంగా పార్లమెంట్ హౌస్‌లో కేక్ కోస్తున్న ఖర్గే

సభలో నా నోరు నొక్కేస్తున్నారు!

- విపక్ష నేతగా మాట్లాడే హక్కుంది: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 21: విపక్ష నాయకుడిగా లోక్‌సభలో తనకు మాట్లాడే హక్కుందని, కానీ.. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నోరు నొక్కేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోమవారం సభ ప్రారంభమైన తర్వాత ఇటీవల కాలంలో మృతి చెందిన పార్లమెంటు సభ్యులు, మాజీ సభ్యులకు, పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి, అదేవిధంగా అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో దుర్మరణం చెందిన వారికి సభ్యులు నివాళులర్పించారు. అనంతరం.. స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. అయితే.. 'ఆపరేషన్ సిందూర్'పై చర్చించాలని విపక్ష సభ్యులు పట్టుబట్టారు. దీనికి స్పీకర్ అనుమతించలేదు. తొలుత ప్రశ్నోత్తరాలు జరగాలని, ఆ తర్వాత ఏ అంశాన్నయినా చర్చించేందుకు అనుమతి ఇస్తామన్నారు. దీంతో విపక్ష సభ్యులు తమ తమ స్థానాల్లో నిలబడి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ పరిణామాల క్రమంలో స్పీకర్ బిర్లా సభను వరుసగా రెండుసార్లు వాయిదా వేశారు. దీంతో సభ నుంచి బయటకు వచ్చిన రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. "రక్షణ మంత్రి సహా బీజేపీ సభ్యులకు మాట్లాడే అవకాశం ఇస్తున్నారు. కానీ, విపక్షం నుంచి ఏ ఒక్క సభ్యుడికీ ఆయన(స్పీకర్) అవకాశం ఇవ్వట్లేదు. నేను విపక్ష నాయకుడిని. మాట్లాడే హక్కుంది. కానీ, అవకాశమే ఇవ్వట్లేదు. ఇదొక కొత్త సంప్రదాయం" అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టు దిగ్గజం వీఎస్ అచ్యుతానందన్ కన్నుమూత

101 ఏళ్ల సుదీర్ఘ జీవన ప్రస్థానం.. అతి సాధారణ నేపథ్యం నుంచి రాజకీయ ఉన్నత శిఖరాలకు..

- 82 ఏళ్ల వయసులో తొలిసారి కేరళ సీఎంగా
- ప్రధాని మోదీ, విజయన్ సంతాపం


తిరువనంతపురం/హైదరాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం, భారత కమ్యూనిస్టు ఉద్యమ దిగ్గజ నేతల్లో ఒకరైన వెలిక్కాకతు శంకరన్ అచ్యుతానందన్ తుదిశ్వాస విడిచారు. గత నెల 23వ తేదీన గుండెపోటుకు గురైన వీఎస్‌ను.. తిరువనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. ఐసీయూలో చికిత్స తీసుకుంటున్న క్రమంలో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం కన్నుమూశారు. ఆయన వయసు 101 ఏళ్లు. వీఎస్‌గా ప్రసిద్ధినొందిన అచ్యుతానందన్.. కేరళలో అత్యంత ప్రజాకర్షణ కలిగిన నేతల్లో ఒకరిగా, రాజీలేని సీపీఎం నాయకుడిగా పేరొందారు. వీఎస్ మరణం పట్ల ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్ తదితరులు సంతాపం ప్రకటించారు. అతి సాధారణ నేపథ్యం నుంచి కేరళలోనే అతిపెద్ద మాస్ లీడర్‌గా



వీఎస్ ఎదిగారని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ పేర్కొన్నారు. ఎఝువ సామాజిక వర్గానికి చెందిన (కల్లుగీత కార్మిక) కుటుంబంలో 1923 అక్టోబరు 20వ తేదీన అచ్యుతానందన్ జన్మించారు. ఆయనకు నాలుగేళ్ల వయసు ఉన్నప్పుడు తల్లి, 11 ఏళ్ల వయసులో తండ్రి మరణించారు. బాల్యంలోనే కష్టాలను ఈదుకుంటూ వచ్చిన వీఎస్.. 17 ఏళ్ల వయసులో సీపీఐలో చేరి.. పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1946లో ట్రావెన్‌కోర్‌లో జరిగిన సాయుధ తిరుగుబాటులో పాల్గొని, నాలుగేళ్ల జైలు శిక్షకు గురయ్యారు. 1964లో సీపీఐ నుంచి ఒక వర్గం చీలిపోయి సీపీఎంను ఏర్పాటు చేసింది. సీపీఎం వ్యవస్థాపక నేతల్లో వీఎస్ ఒకరు. 1965-2016 మధ్య కాలంలో కేరళ అసెంబ్లీకి ఏడు పర్యాయాలు వీఎస్ ప్రాతినిధ్యం వహించారు. అవినీతి, అక్రమాలు, అనైతికతను ఎంతమాత్రం సహించని వీఎస్.. తన సొంతపార్టీ నేతలను కూడా వదిలిపెట్టేవారు కాదు. 82 ఏళ్ల వయసులో తొలిసారిగా ఆయన సీఎం పదవిని చేపట్టారు. కాగా ఆర్థిక సంస్కరణలను వీఎస్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. కేరళలో కోకాకోలా ప్లాంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆయన నడిపిన ఉద్యమం బాగా పేరొందింది. అచ్యుతానందన్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని గడిపిన ఆయన చివరి వరకూ నమ్మిన సిద్ధాంతాలకు, ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేశారని అన్నారు. దేశ రాజకీయాల్లో మచ్చలేని మహానేత వీఎస్ అచ్యుతానందన్ అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. వీఎస్ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. కమ్యూనిస్టు యోధుడిని కోల్పోయామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

చకచకా అమరావతి....

అమరావతిలో ముఖ్యకార్యదర్శి, కార్యదర్శుల బంగ్లాల నిర్మాణ పనులు



రాజధాని అమరావతిలో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మొత్తం భవనాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్ అధికారుల క్వార్టర్లు ఈ ఏడాది డిసెంబరులోగా పూర్తిచేస్తామని, ఇతర నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని పురపాలక శాఖమంత్రి పొంగూరి నారాయణ తెలిపారు. సోమ వారం ఆయన సీఆర్‌డీఏ ఇంజనీర్లతో కలిసి రాజధానిలో నిర్మాణ పనులు పరిశీలించారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్







ఐఏఎస్‌ల కోసం నిర్మించిన భవనాలు, లోపల దాదాపు పూర్తయిన పనులు



శరవేగంగా సాగుతున్న సీఆర్‌డీఏ కార్యాలయ నిర్మాణ పనులు

మంత్రివర్గ ఉపసంఘంతో చర్చించాక
అమరావతి రెండో దశ భూసమీకరణ

▸ మూడేళ్లలో నిర్మాణం కచ్చితంగా పూర్తి : మంత్రి నారాయణ



మంత్రుల క్వార్టర్ల వద్ద పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): 'అమరావతిలో రెండో దశ భూసమీకరణపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించారా? అని గత మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అందువల్ల మంత్రివర్గ ఉపసంఘంలో చర్చిస్తాం. ఉపసంఘం నిర్ణయం మేరకు వచ్చే కేబినెట్‌లో భూసమీకరణపై నిర్ణయం తీసుకుంటాం' అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూ రి నారాయణ తెలిపారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను సీఆర్డీఏ ఇంజనీర్లతో కలిసి మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల బంగ్లాలతో పాటు ఆలిండియా సర్వీస్ అధికారుల క్వార్టర్ల నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ఆయా నిర్మాణాలకు సంబంధించి నిర్మాణ సంస్థల ప్రతినిధులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నేలపాడులోని ఆలిండియా సర్వీస్ అధికారుల క్వార్టర్ల వద్ద మీడియాతో మాట్లాడుతూ...'గత ప్రభుత్వం అమరావతి రైతులతో పాటు కాంట్రాక్టర్లను కూడా అనేక ఇబ్బందులకు గురిచేసింది. అమరావతి నిర్మాణం మూడేళ్లలో కచ్చితంగా పూర్తి చేసి తీరుతాం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తాం. అమరావతిలో భవనాలు, ట్రంక్ రోడ్లు, సీవరేజి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎల్పీఎస్ లేఅవుట్లలో పనులకు కూడా టెండర్లు పూర్తయ్యాయి. 2014-19 మధ్యలోనే అధికారుల కోసం 4000 ఇళ్ల నిర్మాణానికి టెండర్లు కూడా పూర్తి చేసి నిర్మాణాలు ప్రారంభించాం. అయితే గత ప్రభుత్వం అన్ని పనులను నిలిపివేసింది. తిరిగి పాత టెండర్లు రద్దు చేసి, న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకుని కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఆలస్యమైంది. రాజధానిలో అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల వర్షాల కారణంగా ఇబ్బందులున్నాయి' అని వివరించారు.

72 సంస్థలకు భూకేటాయింపు

అమరావతిలో ఇప్పటివరకూ మొత్తం 72 సంస్థలకు భూకేటాయింపులు చేసినట్టు మంత్రి నారాయణ తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులతో స్వయంగా సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటు చేసి ఒప్పందాలు చేసుకున్నట్టు, వాటిలో మెజారిటీ సంస్థలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి నిర్మాణ పనులు ప్రారంభిస్తాయని మంత్రి తెలిపారు.

శ్రీవారికి మైసూరు సంస్థాన ఆతిథ్యం

▸ తిరుమలలో ఘనంగా పల్లవోత్సవం



కర్ణాటక సత్రం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి

తిరుమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం పల్లవోత్సవం ఘనంగా జరిగింది. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని టీటీడీ పల్లవోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి కర్ణాటక సత్రంలో మైసూరు సంస్థాన ఆతిథ్యాన్ని స్వీకరించారు. కర్ణాటక ప్రభుత్వం, మైసూరు సంస్థాన ప్రతినిధులు ప్రత్యేక హారతి సమర్పించారు. మైసూరు సంస్థాన రాజమాత ప్రమోదాదేవికి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్‌కు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రం కప్పి సత్కరించారు. అలాగే మైసూరు సంస్థాన ప్రతినిధులు చైర్మన్‌కు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, నరేష్, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

వర్షంలో ఎదురెదురుగా ఆటో.. లారీ ఢీ

▸ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
▸ మరో ఐదుగురికి గాయాలు
▸ పల్నాడు జిల్లా కనమర్లపూడి వద్ద ప్రమాదం
▸ దాయాదుల దాడిలో గాయపడి ఆస్పత్రికి వెళ్తుండగా ఘటన





ప్రమాదంలో ధ్వంసమైన ఆటో, లారీ

శావల్యాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): వర్షంలో ఆటో, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. మరో ఐదుగురు గాయాల పాలయ్యారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం జరిగిందీ ప్రమాదం. కాగా, స్థలం వివాదంలో దాయాదులు కొట్టారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసి, వారి సూచన మేరకు ఆస్పత్రికి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురవడం గమనార్హం. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శావల్యాపురం మండలం కారుమంచి బీసీకాలనీకి చెందిన బత్తుల శ్రీనివాసరావు, ఒత్తుల వెంకట్రావు అన్నదమ్ములు. శ్రీనివాసరావు కారుమంచిలో, వెంకట్రావు అద్దంకిలో నివాసముంటున్నారు. స్థలం విషయంలో వీరిరువురి మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. సోమవారం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు గాయాలయ్యాయి. గ్రామపెద్దలు ఇరు కుటుంబాలకు సర్దిచెప్పి పంపించారు. అనంతరం కొంతసేపటికి శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘర్షణ విషయంపై ఫిర్యాదు చేశారు. రక్తగాయాలవడంతో పోలీసులు వినుకొండ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించకోవాలని సూచించారు. దాంతో శ్రీనివాసరావు కుటుంబం ఆటోలో వినుకొండకు బయలుదేరింది. కనమర్లపూడి వద్ద యర్రగొండపాలెం నుంచి సత్తెనపల్లికి బొప్పాయి మొక్కల లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చింది. వర్షం కురుస్తుండడంతో ఇరు వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొని రోడ్డు పక్కన బోల్తా పడ్డాయి. ఆటోలో ఉన్న శ్రీనివాసరావు భార్య బత్తుల నాగమూర్తెమ్మ(48), వదిన అంజమ్మ(57), అన్న కొడుకు బ్రహ్మయ్య(34) అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనివాసరావు, తల్లి ముత్యాలమ్మ(68), మరో ఇద్దరు కుటుంబసభ్యులు, లారీ డ్రైవర్, క్లీనర్‌లకు తీవ్ర గాయాలవ్వడంతో 108లో వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ముత్యాలమ్మ మరణించారు. రూరల్‌సీఐ ప్రభాకర్‌రావు, ఎస్‌ఐలు లోకేశ్వరరావు, కృష్ణారావు సిబ్బందితో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేశ్వరరావు తెలిపారు. ప్రమాదంపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు.

క్వార్ట్జ్ కేసులో చిక్కిన మరో వైసీపీ నేత

▸ పోలీసుల అదుపులో బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి
▸ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి
▸ మాజీ మంత్రికి బిగుస్తున్న ఉచ్చు!

నెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలోని రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు జరిపిన కేసులో మరో వైసీపీ నేత బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ లోతుగా సాగుతున్న నేపథ్యంలో శ్రీకాంత్‌రెడ్డి పాత్ర బయటపడింది. ఈ క్రమంలో రుస్తుం మైన్స్ కేసులో శ్రీకాంత్‌రెడ్డిని కూడా నిందితుడిగా పోలీసులు మూడు రోజుల క్రితం చేర్చారు. అప్పటి నుంచి ఆయన కోసం వెతుకుతున్న పోలీసులు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని సోమవారం నెల్లూరు తీసుకొచ్చారు. ఒకటి, రెండు రోజుల్లో అరెస్టు చూపించే అవకాశాలున్నట్టు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత అతడి నుంచి అనేక కీలక విషయాలు రాబట్టినట్టు సమాచారం. గత ప్రభుత్వంలో ఓ మాజీ మంత్రికి అత్యంత సన్నిహితుడిగా శ్రీకాంత్‌రెడ్డి వ్యవహరించారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలన్నీ ఆ మాజీ మంత్రి కనుసన్నల్లోనే జరిగాయనేది బహిరంగ రహస్యం. ఇప్పుడు శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఆ మామూళ్ల వ్యవహారాలన్నీ బయటపడినట్టు తెలుస్తోంది. ఈ అక్రమ సంపాదనను నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో రియల్ ఎస్టేట్ కింద పెట్టుబడిగా పెట్టినట్టు పోలీసులు గుర్తించారు. దీంతో ఆ మాజీ మంత్రికి కూడా ఉచ్చు బిగుస్తోంది. త్వరలోనే ఆయన పేరును కూడా క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో చేర్చే అవకాశాలున్నట్టు సమాచారం. కాగా ఇప్పటికే క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి రిమాండ్‌లో ఉన్నారు. రెండు నెలలుగా ఆయన రిమాండ్‌లో ఉండగా, పలు మార్లు బెయిల్ పిటిషన్లను కోర్టు తిరస్కరించింది.

సెట్టేసి.. కొట్టేస్తున్నారు..!

భక్తి పేరుతో విశాఖలో భారీ దోపిడీకి స్కెచ్

▸ బీచ్‌లో అయోధ్య నమూనా ఆలయం ఏర్పాటు
▸ దర్శనం టికెట్ రూ.50, చెప్పులకు రూ.5 వసూలు
▸ కల్యాణోత్సవం పేరుతో మరో దోపిడీకి తెర
▸ ఒక్కో టికెట్ రూ.2,999లకు విక్రయం
▸ భద్రాద్రి నుంచి పండితులు వస్తారంటూ ప్రచారం
▸ ఈ ప్రచారంపై భద్రాచలం దేవస్థానం ఈఓ విచారణ
▸ నిర్వాహకులపై విశాఖ కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు





విగ్రహం, ఆలయం సెట్, దర్శన టికెట్

విశాఖపట్నం, జూలై 21(ఆంధ్రజ్యోతి): భక్తి ముసుగులో పక్కా వ్యాపారానికి తెరతీశారు. అయోధ్య రామాలయాన్నే దానికోసం ఎంచుకున్నారు. ఆ రామాలయం సెట్ వేసి భారీగా డబ్బులు కొట్టేస్తున్నారు. అయోధ్యకు వెళ్లి రాముడిని ఎప్పుడు చూస్తామో, ఇక్కడ దర్శనం చేసుకుంటే పుణ్యం వస్తుంది కదా! అనుకునే భక్తులే టార్గెట్‌గా విశాఖపట్నంలో పెద్దఎత్తున దోపిడీ చేస్తోంది ఓ బృందం. బీచ్ రోడ్డులో పార్క్ హోటల్ పక్కనే ఖాళీ స్థలంలో మే నెలాఖరులో అయోధ్య రామాలయం సెట్ వేశారు. రెండు నెలలే ఉంటుందని ప్రకటించారు. భక్తులు భారీగా వస్తున్నారు. నమూనా ఆలయంలోకి వెళ్లాలంటే రూ. 50 టికెట్ తీసుకోవాల్సిందే. చెప్పులు పెట్టుకోవడానికి ఇంకో రూ. 5 చెల్లించాలి. లోపలికి వెళ్లాక రాముడిని కళ్లారా చూసి నమస్కారం చేసుకునేలోపే అక్కడ ఉండే సిబ్బంది బయటకు లాగేస్తున్నారు. పగటి పూట జనాలు లేకపోయినా సరే పెద్దపెద్దగా కేకలు వేస్తూ నానా హంగామా చేస్తున్నారు. భక్తులు ఎక్కువగా వచ్చే సాయంత్రం వేళ బౌన్సర్లను పెడుతున్నారు.

బీచ్ రోడ్‌లో ట్రాఫిక్ జామ్

శని, ఆదివారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. కార్లు, ద్విచక్ర వాహనాలను బీచ్ రోడ్డులో పార్కు చేస్తున్నారు. వందలాది వాహనాలతో పార్కింగ్ ప్రదేశాలన్నీ నిండిపోయి సాధారణ ప్రజలు నడిచి వెళ్లడానికి కూడా రోడ్డుపై ఖాళీ ఉండడం లేదు. ఆ రెండు రోజుల్లో పార్క్ హోటల్ జంక్షన్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించడం పోలీసులకు సాధ్యపడడం లేదు. అయితే బీజేపీ పేరు చెప్పి నిర్వాహకులు పోలీస్ అధికారులను అటువైపు రానీయడం లేదని తెలుస్తోంది. ఆ పార్టీ యూత్ కమిటీలో రాష్ట్ర స్థాయి నేత దందాలో కీలకంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

కల్యాణోత్సవం అంటూ ప్రచారం

నిజానికి ఈ నెలాఖరుతో నమూనా ఆలయ ప్రదర్శన ముగించాలి. దీంతో మరో దోపిడీకి నిర్వాహకులు తెరలేపారు. ఈనెల 29న అయోధ్య రాముడికి కల్యాణోత్సవం నిర్వహిస్తామని, దానికి రూ. 2,999 టికెట్ తీసుకోవాలని ప్రచారం చేస్తున్నారు. ఫ్లెక్సీలు పెట్టి టికెట్లు కూడా విక్రయిస్తున్నారు. భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం పండితులు వచ్చి కల్యాణం క్రతువు నిర్వహిస్తారని కూడా సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఈ ప్రచారంపై భద్రాచలం ఆలయ అధికారులకు తెలిసి విచారణ నిర్వహించారు. అక్కడి నుంచి పండితులెవరూ విశాఖపట్నం రావడం లేదని తేలింది. కల్యాణోత్సవంపై కనీస సమాచారం కూడా ఇవ్వకుండా దేవాలయం పేరును దుర్వినియోగం చేస్తున్నట్టు గుర్తించిన ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్.రమాదేవి.. విశాఖపట్నం కలెక్టర్‌కు, పోలీస్ కమిషనర్‌కు, 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు, దేవదాయ శాఖ అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు సోమవారం నమూనా ఆలయం వద్దకు వెళ్లి ప్రాథమిక విచారణ చేశారు. అయితే తమ వెనుక బీజేపీ ఎంపీ ఒకరు ఉన్నారని నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారని, కేసు నమోదుకు పోలీసులు తటపటాయిస్తున్నారని తెలిసింది. ఇక్కడ ప్రదర్శన ఏర్పాటులో తప్పులేదని, కానీ దానిని వ్యాపారాత్మకంగా నిర్వహించడం, భద్రాచలం పేరును ఉపయోగించడం వారి దుర్బుద్ధిని వెల్లడిస్తోందని భక్తులు ఆరోపిస్తున్నారు.

సబ్సిడీ ఎరువులతో లింక్ ఉత్పత్తులు అంటగట్టడం నేరం

▸ ఫిర్యాదులు వస్తే కంపెనీలపై చర్యలు
▸ కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ హెచ్చరిక

గుంటూరు సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొనుగోలు సమయంలో లింక్ ఉత్పత్తులు కొనలేక ఇబ్బందిపడుతున్న రైతాంగానికి కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ శుభవార్త చెప్పింది. ఇక మీదట రైతులు సబ్సిడీ మీద లభ్యమయ్యే యూరియా, డీఏపీ వంటి ఎరువులతో పాటు లింక్ ఉత్పత్తులుగా భావించే నానో, బయో స్టిమ్యూలెంట్స్ కొనాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఆ మేరకు కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అనీతా సీ మేష్రామ్ సోమవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఎరువులను 1955 నిత్యావసర వస్తువుల చట్టం కింద చేర్చి నందువల్ల లింక్ ఉత్పత్తు లు అంటగట్టటం నేరం కిందకు వస్తుందని అదనపు కార్యదర్శి అనీతా సీ మేష్రామ్ స్పష్టం చేశారు. అటువంటి ఫిర్యాదులు వస్తే సదరు కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖను ఆదేశించారు. గత కొద్ది రోజులుగా లింక్ ఉత్పత్తుల కొనుగోలు వ్యవహారంలో ఎరువుల కంపెనీలకు, డీలర్లకు మధ్య వివాదం నడుస్తోంది. ఆ నేపథ్యంలో రాష్ట్ర ఎరువుల డీలర్ల అసోసియేషన్ నేతలు కేంద్రానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ తాజా ఉత్తర్వులు వెలువడినట్టు తెలుస్తోంది.

కోనేరు హంపీ విజయం స్ఫూర్తిదాయకం: చంద్రబాబు

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వేదికపై కోనేరు హంపి మరింత ప్రకాశించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఫిడే వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌కు చేరిన తొలి భారతీయ మహిళగా కోనేరు హంపి రికార్డు సృష్టించడంపై చంద్రబాబు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. గ్రాండ్ మాస్టర్ హంపీ సాధించిన విజయం పట్ల గర్వంగా ఉందని, ఈ విజయాన్ని చూసి దేశవ్యాప్తంగా ఎంతో మంది స్ఫూర్తి పొందుతారని సీఎం అన్నారు. మంత్రి లోకేశ్ కూడా హంపీకి శుభాకాంక్షలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చమురుతో చెలగాటం


రష్యా ఇంధనరంగం లక్ష్యంగా యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రకటించిన సరికొత్త ఆంక్షల్లో గుజరాత్‌లోని నాయారా ఎనర్జీ లిమిటెడ్‌కు చెందిన వాడినార్ రిఫైనరీ కూడా ఉంది. రష్యానుంచి చమురు కొనుగోలు చేసే దేశాలను కఠినఆంక్షలతో ఊపిరాడనివ్వకుండా చేయాలని పాశ్చాత్యదేశాలు సరికొత్తగా సంకల్పం చెప్పుకున్న నేపథ్యంలో, రాబోయే రోజుల్లో ఇటువంటివి అనేకం చూడాల్సిరావచ్చు. రష్యానుంచి చమురుకొంటున్నందుకు భారతదేశంమీద 500శాతం సుంకం విధించేందుకు ట్రంప్ ఆశీస్సులతో అమెరికా సెనేటర్లు ఒకపక్క బిల్లు సిద్ధం చేస్తుంటే, మరోపక్క నాటో అధినేత నోట ట్రంప్ బెదిరింపు భాష వినబడుతోంది. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపేలా రష్యామీద భారత్, చైనా, బ్రెజిల్ ఒత్తిడి తీసుకురావాలని, విఫలమైన పక్షంలో ఆంక్షలకు సిద్ధపడాలని నాటో అధినేత మార్క్ రుట్టే హెచ్చరించిన విషయం తెలిసిందే. రష్యన్ ఇంధన సంస్థ రోస్నెఫ్ట్‌నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న రిలయెన్స్ ఇండస్ట్రీస్‌కు, 49శాతం రోస్నెఫ్ట్ వాటాలున్న నాయారా ఎనర్జీకి ఈయూ నిషేధం పెద్ద సవాల్. రష్యా క్రూడ్ ఆయిల్‌ను భారత్‌లో శుద్ధిచేసి, యూరోపియన్ యూనియన్ మార్కెట్‌కు ఎగుమతి చేస్తున్న ఈ రెండు చమురు ఎగుమతి సంస్థలకు కష్టకాలం తప్పదేమో.

నాయారాలో రోస్నెఫ్ట్ సహా పలురష్యన్ పెట్టుబడులు గణనీయంగా ఉన్నందున అది ప్రథమ, ప్రధాన లక్ష్యమై ఉండవచ్చు. రష్యానుంచి ఏ కంపెనీ ఎంత ముడిచమురు దిగుమతి చేసుకుంటోందో, శుద్ధిచేసిన తరువాత ఎవరికి, ఎంత ఎగుమతి చేస్తోందో మన ప్రభుత్వం గుట్టువిప్పదు. రష్యా చమురు బావుల్లో నుంచి తోడిపోసిన ముడిచమురులో 80శాతం భారతదేశానికే చేరుతోందని, ఈ ఏడాది జూన్ వరకూ 231 మిలియన్ బారెల్స్ ముడి చమురును భారత్ కొనుగోలు చేస్తే, అందులో దాదాపు సగం రిలయెన్స్, నయారాకు అందిందని అంటారు. ఇప్పుడు రాస్‌నెఫ్ట్, యూసీపీ వంటి రష్యన్ సంస్థలు నయారా ఎనర్జీని రిలయెన్స్‌కు విక్రయించే ప్రతిపాదనలు చేస్తుండగా, ఈయూ ఆంక్షలు తెరమీదకు వచ్చాయి. ఓ పదేళ్లపాటు రోజుకు ఐదులక్షల బ్యారెళ్ళు దిగుమతి చేసుకోవడానికి రష్యాతో రిలయెన్స్ ఏడాది క్రితమే మరో భారీ ఒప్పదం చేసుకున్న విషయం తెలిసిందే.

భారత్‌లో శుద్ధిచేసిన రష్యన్ ముడిచమురు యూరప్‌కే పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్నప్పటికీ, పాశ్చాత్యదేశాలు అడపాదడపా మనల్ని తప్పుబట్టడం ఈ యుద్ధకాలమంతా జరుగుతున్నదే. రష్యా ముడిచమురు దిగుమతుల్లో అత్యధికం శుద్ధిచేసిన అనంతరం విదేశాలకే తరలిపోతున్నప్పటికీ, సదరు దిగుమతులు మన దేశ ప్రజల ప్రయోజనార్థం జరుగుతున్నట్టుగా మంత్రులూ అధికారులూ వ్యాఖ్యలు చేయడం అనాదిగా చూస్తున్నదే. భారత్ నుంచి ఈయూకు శుద్ధిచేసిన పెట్రోలియం ఎగుమతులు ప్రతీ ఏటా రెట్టింపవుతున్న విషయం గమనించాలి. ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముందు భారత్ మొత్తం చమురుదిగుమతుల్లో రష్యా వాటా ఒకశాతం కంటే లేదు. యుద్ధం మొదలు కాగానే, పలు రాయితీలు, మినహాయింపులతో రష్యా చవుకగా అందించిన చమురుతో భారత్ లబ్ధిపొందుతూ వచ్చింది. అడ్డూ అదుపూలేకుండా చమురు తోడి, చవుకగా అమ్మి, యుద్ధాన్ని బలంగా, సంవత్సరాలపాటు రష్యా కొనసాగించగలుగుతున్న నేపథ్యంలో, ఆయిల్ మీద ఆంక్షలతో రష్యాను నిర్వీర్యం చేయాలన్న మరో ప్రయత్నం ఇది.

యుద్ధానికి నువ్వేకారణమంటూ మొన్నటివరకూ ఉక్రెయిన్ అధ్యక్షుడిని తీవ్రంగా తప్పుబట్టి, అవమానించి, రష్యా అధ్యక్షుడిని తెగవెనకేసుకొచ్చిన ట్రంప్ ఇటీవలే మనసుమార్చుకున్నారు. అధికారంలోకి వచ్చిన కొద్దిగంటల్లోనే యుద్ధాన్ని ఆపగలనన్న ట్రంప్, తనమాట పూచికపుల్లలాగా తీసిపారేస్తున్న పుతిన్‌మీద అలిగారు, ఆగ్రహించారు. ఆయుధాలతో జెలెన్‌స్కీని బలోపేతం చేయాలని, ఆంక్షలతో పుతిన్‌ను నిర్వీర్యుడిని చేయాలని సంకల్పించారు. నిన్నటివరకూ నోరు విప్పడానికి జడిసిన నాటో, ఈయూ నాయకులంతా ఇప్పుడు ట్రంప్ అండ చూసుకొని రష్యామిత్ర దేశాలను బెదిరిస్తున్నారు. ఇటువంటి విన్యాసాలు చాలా చూశామనీ, ఏమి చేయాలో తమకు తెలుసునన్నది చమురు మంత్రి హర్‌దీప్ పురి వ్యాఖ్యల సారాంశం. ఆంక్షలు విధిస్తామని మనను బెదిరిస్తున్న ఈ దేశాలు రష్యా నుంచి ఒకపూట దిగుమతి చేసుకుంటున్న చమురు ఉత్పత్తులు మన మూడునెలల దిగుమతులతో సమానమని ఆయన ప్రకటించారు. రష్యా నుంచి ముడిచమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలను ఆంక్షలతో దెబ్బతీయాలన్న ప్రయత్నం అంతిమంగా ప్రపంచ చమురు మార్కెట్‌ను కుప్పకూలేట్టు చేస్తుందని గ్రహించాలి.

సృష్టి.. స్థితి.. లయంలో గాజా!


akbar

యుద్ధ బీభత్సాన్ని వ్యక్తం చేయలేని భాష ప్రపంచంలోనే ఉండదు. యుద్ధం ఏ స్థాయిదైనా కావచ్చు. అది ఆదిమ తెగల మధ్యదీ కావచ్చు, సమ ఉజ్జీల మధ్యదీ కావచ్చు. భాషలో ఒకపట్టాన వర్ణించలేని యుద్ధాలు చాలా అరుదు. మానవ సమూహాలన్నీ ఏదో ఒక దశలో యుద్ధంతో సహజీవనం చేశాయి. అందుకే వీర కావ్యాలూ గాథలూ లేని మానవ సమూహమే లేదు. కానీ నిరంతర బీభత్సమై, కిరాతకమై, నరమేధమై, సర్వస్వ హననమైన యుద్ధాలు మనుషుల విషాద వ్యక్తీకరణ సామర్థ్యానికే సవాలుగా నిలుస్తాయి. ఆ యుద్ధాలకు దూరంగా నివసించే మనుషులకు అదింకా కష్టంగా మారుతుంది. 2023 అక్టోబరు 7 నుంచి గాజాలో జరుగుతున్న జీవన విధ్వంసంపై ఇంకా గొంతుకలు పూర్తిగా పెగల్లేని పరిస్థితే ఉంది. మాటలకు తడుముకోవటమే ఉంది. వాక్యాల కోసం వ్యాకులత చెందటమే ఉంది. భావాల కోసం భాషలను గాలించటమే ఉంది. దృశ్యాలను ప్రదర్శించలేని అశక్తతే ఉంది. మన అనుభవం పూర్తిగా ఆకళింపు చేసుకోలేని, ఊహించుకోలేని విచ్ఛిన్న, విషాదకర, వివర్ణ పరిస్థితి గాజాలో నెలకొంది. నమ్మశక్యం కాకపోయినా ఇది నిజం! కిందామీదా పడుతూ నిటారు కఠిన కొండ శిలలను ఎక్కి చుట్టూ పరచుకున్న ప్రపంచాన్ని ఎంతమేరకు చూడగలమో అందులో వెయ్యోవంతు స్థాయిలోనే ఇప్పుడు గాజా బీభత్సాన్ని చూడగలం. అది అసంపూర్ణం. అసమగ్రం. అయినా ఆ పరిమిత దృశ్యమే అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. జరుగుతోన్న దారుణాలకూ కిరాతకాలకూ చరిత్ర మూలాల్లోకి వెళ్లేలా చేస్తోంది.

సరిహద్దు గోడలనూ, ఇనుపముళ్ల కంచెలనూ పగలగొట్టి హమాస్ తీవ్రవాద ప్రేరేపితులు (2023 అక్టోబరు 7) ఇజ్రాయెల్ భూభాగంలోకి చొరబడి 1200 మందికి పైగా చంపేశారు. ఎంతో మందిని బందీలుగా పట్టుకెళ్లారు. ఆ దారుణాన్ని అందరూ ఖండించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తినీ, సాంస్కృతిక భిన్నత్వాన్నీ మనసావాచాకర్మణా కోరుకునే వారిని నిలువెల్లా కలచివేసిన సంఘటన అది. అయినా హమాస్ లాంటి సంస్థలను ఎదుర్కొనటానికి యుద్ధాన్నే పరిష్కారంగా వారు భావించటం లేదు. ఏదో ఒక మిషతో గాజాపై యుద్ధాలు ప్రకటించటం, దాడులు చేయటం ఇజ్రాయెల్‌కు కొత్తకాదు. 2014 నాటికే గాజాపై 12 సార్లు ఇజ్రాయెల్ యుద్ధానికి పాల్పడిన విషయాన్ని ప్రముఖ ఫ్రెంచ్ చరిత్రకారుడు జీన్ పియర్ ఫిలియు పదేళ్ల కిందటే చెప్పారు. ఆ యుద్ధాల్లో ఇజ్రాయెల్ వేలాది మందిని చంపేసింది. అనేక భౌతిక సౌకర్యాలను విధ్వంసం చేసింది.

మధ్య ఆసియాలోనే కాదు, ప్రపంచంలోని ఏ దేశమూ ఇజ్రాయెలంత శత్రుదుర్భేద్యంగా ఉండదు. ఏదో చేస్తారన్న అనుమానంతో, అంచనాతో, ముందుగానే పడగొట్టాలనే ఆలోచనతో చుట్టుపక్కల దేశాలపై దాడులు చేయటంలో ఇజ్రాయెల్‌కు సాటి వచ్చే దేశమేదీ లేదు. అత్యాధునిక ఆయుధాలతో, డ్రోన్లతో, సైబర్ సెక్యూరిటీతో, క్షిపణి రక్షణ వ్యవస్థలతో, పటిష్ఠ గూఢచర్యంతో, అణ్వస్త్రాలతో ఇజ్రాయెల్ నెలకొల్పుకున్న ఆధిపత్యాన్ని సవాల్ చేయగలిగిన పరిస్థితి ఇరుగుపొరుగున కనపడదు. అయినా హమాస్ దాడితో తన అస్తిత్వానికే ముప్పు ఏర్పడిందనే కారణంతో గాజాపై 20 నెలలుగా కనీవినీ ఎరగని రీతిలో దాడులు చేస్తోంది. ఒక చిన్న ప్రదేశంపై చరిత్ర చూడని దాడులకు పాల్పడుతూ ఇప్పటికే 60 వేలకు పైగా మరణాలకు కారణమైంది. ఆహార పదార్థాలను అందనీయటం లేదు. మందులను చేరనీయటం లేదు. వితరణ హస్తాలనూ విరిచేస్తోంది. వేలభవనాలను శిథిలాలుగా మార్చుతోంది. మంచినీరునూ పారనీయటం లేదు. కరెంటుకు అంతరాయాలు సృష్టిస్తోంది. పాఠశాల భవనాలను కుప్పకూల్చుతోంది. ఆసుపత్రులపైనా బాంబుల వర్షం కురిపిస్తోంది. సొరంగాలు పేలుస్తోంది. ప్రాణం నిలుపుకోటానికి అవసరమైన ప్రతిదాన్నీ పనికి రాకుండా చేస్తోంది.

> ఎంత ఆయుధశక్తి ఉన్నప్పటికీ హృదయాల్లో రగిలే పాలస్తీనా జాతీయ ఆకాంక్ష ఇజ్రాయెల్‌కు ఎప్పటికీ స్థిమితత్వాన్ని ఇవ్వదు. మధ్యప్రాచ్యంలో పాలస్తీనా సమస్య కేంద్రంగా మండుతోన్న అసంతృప్త జ్వాలా చల్లారదు. భయానక, అమానుష, జాతివిద్వేష రాజకీయాలు యూరపులో 60 లక్షల మంది యూదుల ప్రాణాలను బలితీసుకోవటం మానవ చరిత్రను ఇంకా వెన్నాడుతూనే ఉంటుంది. ఇప్పుడు ఆ బాధిత జాతి భద్రత పేరుతో గాజాను బలిపీఠం ఎక్కించటం ప్రపంచ మానవత్వాన్ని వెంటాడదా?

గాజా (గాజా స్ట్రిప్) అనేది 140 చదరపు మైళ్ల ప్రాంతం. దాని సృష్టే కృతకమైంది. 1948 నాటి యుద్ధ సమయాన అసంబద్ధ సరిహద్దులతో దాన్ని ఏర్పరచారు. ప్రాచీన నాగరికత చరిత్రలో ఘనమైన పాత్రను పోషించిన ఒక నగరాన్నీ దాని చుట్టుపక్కల ప్రాంతాన్నీ.. విశాల పూర్వ పాలస్తీనాతో సంబంధాలను తెంచి సామాజిక జీవనాడులను ఛిన్నాభిన్నం చేసిన దృశ్యమే 77 ఏళ్లుగా అక్కడ ఉంది. 28 మైళ్ల పొడవు, ఉత్తరాన 4.3 మైళ్ల వెడల్పు, దక్షిణాన 7.8 మైళ్ల వెడల్పు, మళ్లీ మధ్యలో 3.4 మైళ్లకు కుదింపు.. పశ్చిమాన మధ్యధరా సముద్రం.. ఇలా భౌగోళికంగా అసహజ సరిహద్దులను నిర్దేశించిన గాజాకు.. 1948 నుంచి విషాదాలు, వైపరీత్యాలు వెన్నాడుతూనే ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన పరిమితులను అతిక్రమించి పాలస్తీనాకు కేటాయించిన (44శాతం) భూభాగంలో అధిక భాగాన్ని 1948లో బలవంతంగా స్వాధీనం చేసుకోవటంతోనే ఇజ్రాయెల్ ఆక్రమణల చరిత్ర మొదలైంది. మరోవైపు గాజా ప్రాంతాన్ని ఈజిప్టు, వెస్ట్‌బ్యాంకు ప్రాంతాన్ని జోర్డాన్ ఆక్రమించటంతో పాలస్తీనా ప్రజలకు తమదంటూ స్వేచ్ఛగా మసలే భూభాగమే లేకుండా పోయింది. ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్న ప్రాంతాల్లో పాలస్తీనా ప్రజల్లో భయోత్పాతాన్ని కలిగించటానికి వందలాది గ్రామాలను నేలమట్టం చేశారు. ప్రజలను తరిమేసిన తర్వాత గ్రామాల అవశేషాలను లేకుండా చేశారు. చచ్చీచెడి ఎవరైనా పాలస్తీనా వ్యక్తి మమకారంతో స్వప్రాంతానికి వచ్చినా తన గ్రామం ఎక్కడుందో కనిపెట్టలేని దుస్థితికి తీసుకువచ్చారు.


■ రాహుల్ కుమార్

ఇజ్రాయెల్ ఘాతుకాలకు భీతావహులై పారిపోయిన ప్రజలు గాజాకు చేరుకున్నారు. 1948కి ముందు గాజాలో 80 వేల మంది ప్రజలు మాత్రమే ఉండేవారు. ఇజ్రాయెల్ తరిమి వేయటంతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని 2,50,000 మంది గాజాకు తరలి వచ్చారు. అప్పటి నుంచీ గాజా శరణార్థుల మెజారిటీ ప్రాంతమైపోయింది. ప్రపంచంలోనే ఒక చిన్న ప్రదేశంలో అత్యధిక శరణార్థులున్న ప్రాంతంగా గాజా మారిపోయింది. అదొక సంక్షుభిత పరిస్థితి. ప్రస్తుతం 24 లక్షలు ఉన్న గాజా జనాభాలో 70 శాతం మంది శరణార్థుల కుటుంబాలకు చెందినవారే! జనాభాలో సగం మంది 18 ఏళ్ల లోపు వాళ్లే. కిక్కిరిసిన జనసాంద్రతలో గాజాకు సాటివచ్చే ప్రాంతమే లేదు! 1948 నుంచి 1967 వరకూ గాజా ఈజిప్టు పాలన కింద ఉన్నా తన రాజ్యంలో విలీనం చేసుకోలేదు. గాజా వాసులకు పౌరసత్వాన్నీ ఇవ్వలేదు. స్వేచ్ఛగా ఈజిప్టుకు వచ్చిపోయే పరిస్థితినీ కల్పించలేదు. రహస్య సొరంగాలను తవ్వి ఆ మార్గాల ద్వారా ఈజిప్టులోకి ప్రవేశించి, మారుపేర్లతో కూలీలుగా వెళ్లటం, అక్రమంగా సరుకులు కొనుగోళ్లు, అమ్మకాలు చేయటం జీవన వ్యాపారమైంది. 1988లో హమాస్ ఏర్పడి, 2006లో గాజాలో అధికారాన్ని సొంతం చేసుకున్న తర్వాత సొరంగాల వ్యవస్థ (500 కిలోమీటర్లు) విస్తృతమైంది. సొరంగాలు ఆర్థిక జీవన కేంద్రాలుగా, సమరవ్యూహ–రక్షణ క్షేత్రాలుగా మారాయి.

1967 నాటి యుద్ధంలో గాజాను ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. అంతకుముందు నుంచీ కూడా గాజాని ప్రమాదకరంగానే భావించింది. లక్షలాది శరణార్థులున్న చోటులో తీవ్ర ఇజ్రాయెల్ వ్యతిరేకతతో పాటు పాలస్తీనా విమోచన ఉద్యమాలూ అక్కడే ఊపిరిపోసుకున్నాయి. అందుకే గాజాను అన్ని విధాలుగా తొక్కిపెట్టటమే ఇజ్రాయెల్ భద్రతా వ్యూహంలో కీలకంగా మారింది. పగటిపూట కూలీలుగా పనిచేసి రాత్రి వెనక్కి వచ్చేసేలా 1967 తర్వాత గాజా ప్రజలకు కొంత వెసులుబాటు కల్పించినా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచటానికి ఏ విధంగానూ ప్రయత్నించలేదు. పరిశ్రమలు అభివృద్ధి కాలేదు. వ్యవసాయం విస్తరించలేదు. రవాణా సౌకర్యాలను పొడిగించలేదు. విద్యావ్యాప్తికి దోహదం చేయలేదు. అంతర్జాతీయ సహాయంపై ఆధారపడటం గాజా వాసులకు తప్పలేదు. ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచి ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించటానికి గాజాలో ఏ ప్రయత్నం జరగలేదు. నిరసన ప్రదర్శనలకు దిగినప్పుడూ, సైనికులపై రాళ్లు రువ్వినప్పుడూ, రాకెట్లను ప్రయోగించినప్పుడూ అసాధారణరీతిలో విరుచుకుపడి కాల్పులు జరపటం.. సామూహికంగా శిక్షలు విధించటం.. తీవ్రవాదులకు ఆశ్రయాలుగా ఉన్నాయనే నెపంతో ఇళ్లపై బాంబులు కురిపించటం.. విచారణలు లేకుండా జైళ్లల్లో ఉంచటం.. జన సంచారాన్ని నియంత్రించటం గాజాలో నిత్యకృత్యమైంది. ఇలాంటి దుర్భర పరిస్థితులు నుంచి యువకులు ఫిదాయీలుగా మారటం గాజాలో మొదలైంది.

పాలస్తీనా కోసం పోరాడే సంస్థల్లో మొదట్లో లౌకిక, వామపక్ష దృక్పథంతో ఉండేవే ఎక్కువ. ఈ సంస్థలు అనుకున్న విధంగా ఫలితాలు సాధించలేకపోవటంతో హమాస్, ఇస్లామిక్ జిహాద్ లాంటి సంస్థలు గాజాలో బలాన్ని సంపాదించుకున్నాయి. ఏడు ప్రధాన సంస్థల్లో ఆ రెండు మాత్రమే మతదృక్పథంతో, జిహాద్ పేరుతో కార్యకలాపాలు నిర్వహించేవి. పాలస్తీనా ఏర్పాటు లక్ష్యానికి మతాన్ని జోడించి ప్రచార వ్యూహాన్ని రూపొందించటంలో హమాస్ ప్రజలను ఆకర్షించగలిగింది. గాజా, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాలకు పరిమిత పాలనాధికారాలు కల్పించటానికి ఉద్దేశించిన ఓస్లో ఒప్పందానికీ ఇజ్రాయెల్ తూట్లుపొడవటంతో గాజాలో అసంతృప్తి పెరిగిపోయింది. ఎంత అణచివేసినా ఆగని పోరాటాలతో సతమతమైన ఇజ్రాయెల్ గత్యంతరం లేని పరిస్థితుల్లో గాజా నుంచి వైదొలగింది. గాజాలో 2006 నాటి ఎన్నికల్లో హమాస్ విజయం సాధించింది. దీన్ని ఆమోదించని ఇజ్రాయెల్, అమెరికా, యూరోపియన్ యూనియను కూటమి గాజాపై ఆర్థిక దిగ్బంధాన్ని అమలుపరచాయి. 17 ఏళ్లుగా గాజా జీవితం మరింత తీవ్రంగా కుంగిపోయింది. గాజాలో తీవ్ర మానవ సంక్షోభం నెలకొందని వందలాది నివేదికలు వచ్చినా లక్ష్యపెట్టలేదు. మరోవైపు పాలస్తీనా సమస్య పరిష్కారం అంతర్జాతీయ రాజకీయ చిత్రపటం నుంచి చేజారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. అరబ్ దేశాలు కూడా పాలస్తీనా సమస్యపై శీతకన్ను వేయటంతో హమాస్ అక్టోబర్ 7న రాకెట్టు దాడులకు దిగటం ప్రపంచాన్ని కుదిపివేసింది.

> కిందామీదా పడుతూ నిటారు కఠిన కొండ శిలలను ఎక్కి చుట్టూ పరచుకున్న ప్రపంచాన్ని ఎంతమేరకు చూడగలమో అందులో వెయ్యోవంతు స్థాయిలోనే ఇప్పుడు గాజా బీభత్సాన్ని చూడగలం. అది అసంపూర్ణం. అసమగ్రం. అయినా ఆ పరిమిత దృశ్యమే అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. జరుగుతోన్న దారుణాలకూ కిరాతకాలకూ చరిత్ర మూలాల్లోకి వెళ్లేలా చేస్తోంది.

ఇజ్రాయెల్‌ను ఒక దేశంగా గుర్తించటానికీ, 1967 నాటికి ఉన్న సరిహద్దుల్లో స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకూ హమాస్ సిద్ధపడి 2017లో విధానాన్ని మార్చుకున్నా ముందడుగులు పడకపోవటం ఈ శతాబ్దపు విషాదంగానూ, చరిత్రాత్మక తప్పిదంగానూ భావించక తప్పదు. 44శాతం భూభాగం దక్కాల్సిన పాలస్తీనాకు గాజా, వెస్ట్‌బ్యాంక్‌తో కూడిన 22 శాతం భూమి ఇవ్వటానికి నిరాకరించటమే పరమ రాజకీయ లక్ష్యమైనప్పుడు.. ఎంత ఆయుధశక్తి ఉన్నప్పటికీ హృదయాల్లో రగిలే పాలస్తీనా జాతీయ ఆకాంక్ష ఇజ్రాయెల్‌కు ఎప్పటికీ స్థిమితత్వాన్ని ఇవ్వదు. మధ్యప్రాచ్యంలో పాలస్తీనా సమస్య కేంద్రంగా మండుతోన్న అసంతృప్త జ్వాలా చల్లారదు. భయానక, అమానుష, జాతివిద్వేష రాజకీయాలు యూరపులో 60 లక్షల మంది యూదుల ప్రాణాలను బలితీసుకోవటం మానవ చరిత్రను ఇంకా వెన్నాడుతూనే ఉంటుంది. ఇప్పుడు ఆ బాధిత జాతి భద్రత పేరుతో గాజాను బలిపీఠం ఎక్కించటం ప్రపంచ మానవత్వాన్ని వెంటాడదా?

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

గౌరవం పేరిట గుడ్డి విధేయత!

ఇటీవల ఒక పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరయ్యాను. ఇలాంటి సమావేశాలు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలోను, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడంలోను ఎంతో కీలకం. కానీ ఈ వేదికపై చోటుచేసుకున్న ఒక అంశం నన్ను తీవ్రంగా ఆలోచింపజేసింది. ఈ సమావేశంలో పిల్లల చేత తల్లిదండ్రుల పాదాలకు మొక్కించారు. పాదాలను ముద్దాడమని చెప్పారు. ఇది స్వచ్ఛందంగా జరగలేదు. కొందరు పిల్లల ముఖాల్లో ఇబ్బంది స్పష్టంగా కనిపించింది. మన దక్షిణ భారత సంస్కృతిలో ఇది అనూహ్యం. బెంగాలీ వంటి ఉత్తర భారత ప్రాంతాల్లో కొన్ని కుటుంబాలలో ఉండే సంప్రదాయాన్ని, మన సమాజంలో బలవంతంగా ప్రవేశపెట్టే ప్రయత్నమా అని అనిపించింది. ఉపాధ్యాయుల పాదాల్ని పిల్లలతో మొక్కించడం కూడా చూసాను. ఇవన్నీ



మన పిల్లలపై బలవంతంగా విధేయతను రుద్దే ప్రయత్నాలుగా అనిపించాయి. ఇలాంటి చర్యల వెనక ఉన్న భావజాలాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది. పిల్లలను గౌరవం పేరుతో తల వంచేట్టు చేసే బదులు, నిలబడి మాట్లాడే శక్తిని కలిగించటం నేడు ఎక్కువ అవసరం.

ఈ పాదపూజలు, తల వంచే శిక్షణలు విద్యా లక్ష్యాలకి విరుద్ధం. ప్రముఖ విద్యా తత్త్వవేత్త పాలో ఫ్రెయిర్, "విద్యార్థి ఒక ఖాళీ పాత్ర కాదు, ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని నింపే అధికారి కాదు. ఇద్దరూ కలిసి వారి మధ్య సంభాషణలో జ్ఞానాన్ని ఆవిష్కరించాలి" అంటారు. విద్య ఇలాంటి విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించాలి, గుడ్డి విధేయతను కాదు. గురువులు, పాఠ్యపుస్తకాలు చెప్పిన విషయాలను గుడ్డిగా ఆమోదించడం కంటే, వాటిని ప్రశ్నించడం, విశ్లేషించడం, కొత్త ఆలోచనలను అన్వేషించడం ముఖ్యం. శాస్త్రీయ ఆవిష్కరణలు, సామాజిక సంస్కరణలు ఎల్లప్పుడూ ప్రశ్నించే మనస్తత్వం నుండే జన్మించాయి. విద్యా వ్యవస్థలు విద్యార్థులను గుడ్డి విధేయత వైపు కాక, స్వతంత్ర ఆలోచన వైపు నడిపించాలి.

తలవంచడం, పాదాభివందనం వంటి సంప్రదాయాలు గౌరవాన్ని సూచిస్తాయి, కానీ కొన్ని సందర్భాలలో ఇవి విద్యార్థులలో భయం, ఆత్మవిశ్వాస లోపాన్ని సృష్టించవచ్చు. స్వతంత్ర ఆలోచనలు, ఆత్మగౌరవం లేని విద్యార్థి సమాజంలో తన గొంతును వినిపించలేడు. ఆధునిక సమాజంలో రేపటి పౌరులు కాబోయే నేటి విద్యార్థులు భవిష్యత్తులో తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచడం, అన్యాయాన్ని ఎదిరించడం, సమాజంలో సానుకూల మార్పుల కోసం కృషి చేయడం అవసరం. తలవంచే సంస్కృతి ఈ ఆత్మవిశ్వాసాన్ని అణచివేయగలదు. గౌరవం అనేది హృదయంలోని భావం, కేవలం శారీరక చర్యలలో లేదా బాహ్య ఉపచారాలలో మాత్రమే ఇది వ్యక్తం కాదు. పాదపూజలు భయం ఆధారంగా ఏర్పడతాయి – గౌరవం, ప్రేమ ఆధారంగా కాదు. ఇలాంటి భయ ఆధారిత సంబంధాలు పిల్లల విమర్శనాత్మక ఆలోచనకు అడ్డుపడతాయి. పిల్లలు ఏ విషయాన్నైనా ప్రశ్నించే ధైర్యాన్ని కోల్పోతారు. "పెద్దవారు చెప్పిందే నిజం" అనే అభిప్రాయం అలవాటవుతుంది.

ఇప్పటి రాజకీయ వర్గాల్లో పాత విలువలు, గురుకుల పద్ధతులు, ధార్మిక విశ్వాసాల పేర్లతో, ఆధిపత్య నిర్మాణాలను తిరిగి బలపరిచే ప్రయత్నం జరుగుతున్నది. ఇది కేవలం సంస్కృతి పరిరక్షణ కాదు, అధికారాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నం. ప్రశ్నించే పిల్లలకు బదులుగా విధేయత చూపే తరం కావాలన్న లక్ష్యం దీని వెనక ఉన్నది. ఇది కొత్త తరం ప్రజల్లో విమర్శనాత్మక ఆలోచనను అణిచివేస్తుంది. అలాంటి తరం ప్రభుత్వాన్ని ప్రశ్నించదు, సమాజపు తేడాలను ఎత్తి చూపదు, నియంత్రణను అంగీకరిస్తుంది. ఇది ఒక విధమైన సామాజిక మౌనాన్ని బలపరచే విధానం.

నూతన జాతీయ విద్యా విధానంలో 'గురుకుల పద్ధతి'కి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రాచీన సంస్కృత గ్రంథాలపై దృష్టి పెట్టి భారతీయతను నినాదంగా మార్చడం చూస్తుంటే, ఇది జ్ఞానం పెద్దవారివద్ద ఉండాలి, పిల్లలు వినాలి మాత్రమే అనే పద్ధతికి దారితీస్తోంది అనిపిస్తుంది.

విద్యార్థులు తలవంచే బదులు, నిలబడి మాట్లాడే శక్తిని పొందాలి. విద్య విమర్శనాత్మక ఆలోచనను, స్వతంత్ర దృక్పథాన్ని ప్రోత్సహించాలి. సంప్రదాయ గౌరవ వ్యక్తీకరణలు ఆధునిక సమాజంలో భావాధారితంగా, పరస్పర గౌరవంతో కూడినవిగా పరిణమించాలి. విద్యార్థులలో స్వేచ్ఛ, సంభాషణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ద్వారా మాత్రమే మనం సమసమాజాన్ని, పురోగమన దేశాన్ని నిర్మించగలం. తలెత్తి నడిచే విద్యార్థులు సమాజంలో సానుకూల మార్పులను తీసుకురాగల నాయకులుగా మారతారు.

– డా. కె.రమాప్రభ, సామాజిక కార్యకర్త

దాశరథీ కవితా పయోనిధీ!



ఎత్తిన దీపమట్లు ప్రసరించెడి నీడగు పద్యకాంతిలో
చిత్తములెల్ల గ్రోలె మధు శీధువులన్; కవితా ప్రసూనముల్
గుత్తులు గుత్తులై విరిసె! కోటపయిన్ ధ్వజమల్లలాడె! వా
గ్దత్తమె నీ కలమ్ము సుమి! దాశరథీ! కవితా పయోనిధీ!

మూల మెరుంగుచున్– తెలుగు భూమి పయిన్ వెదజల్లి నాడ వా
గాలిబు గీతముల్– రసజగంబది హారతులందజేసె– ఉ
ర్దూలలితాంగి నీ కలముతో గరచాలనముం బొనర్చె– అం
దా లెదనార బోసితివి; దాశరథీ! కవితా పయోనిధీ!

సమర మొనర్చినాడవు నిజాము పయిన్ కవనంబుతోడ– ఖ
డ్గములు, తుపాకి గుండ్లు, విశిఖాలకు మించిన ఆయుధమ్ముగా
తిమిరము నూడ్చ గల్గినదదే కద! సైనిక పాత్ర నక్షరో
ద్యమమున నిల్పి దాల్చితివి దాశరథీ! కవితా పయోనిధీ!

మానితమై ప్రజాభ్యుదయ మానసమై భవదీయ లేఖినీ
గానము మేలుకొల్పె తెలగాణమునెల్ల; కవిత్వమెన్నడున్
గాని సమాజసేవ దిశగా బయనింపవలెన్; తెలుంగు లా
స్థానకవీ! నమస్సులివె! దాశరథీ! కవితా పయోనిధీ!

ఊరకనే వరింపదు మహోదయ వీధులలో కవిత్వమె
వ్వారిని గాని; నీకదె య వారిత లీల లభించెగా కవీ
శా! రసశేఖరా! శతజయంతి రవీ! ఇవిగో నుతుల్ మహా
త్మా! రుచిరార్థ గేయనిధి! దాశరథీ! కవితా పయోనిధీ!

– రసరాజు

(నేడు దాశరథి కృష్ణమాచార్య శతజయంతి)

'నిత్య యవ్వనమే' సాధు సందేశం!


నేను ఒక ఏడాది క్రితం నా ఫేస్‌బుక్ వాల్‌పై మృత్యువు గురించి రాసిన ఒక కవితకు స్పందిస్తూ సాధు సుబ్రహ్మణ్య శర్మ ఇలా కామెంట్ చేసారు: "As age increases try to become younger. Don't await death. Let death take one unawares while fully immersed in executing a huge project, as in a battlefield!" ("వయసు పెరిగే కొద్దీ పడుచువారయ్యేందుకు ప్రయత్నించండి. చావు కోసం ఎదురుచూడ వద్దు. ఏదో ఒక పెద్ద కార్యంలో పూర్తిగా నిమగ్నమై ఉండగా చావు మనకే తెలీకుండా వచ్చి మనల్ని లాక్కెళ్ళిపోవాలి, యుద్ధరంగంలో లాగ." – సాధుశర్మ)

సాధుశర్మ పరిపూర్ణ జీవితాన్ని ఆస్వాదించారు. ఈ ప్రపంచాన్ని ప్రేమించారు. తన చుట్టూ ఉన్న పిల్లలను ప్రోత్సహించారు. 90 ఏళ్ల వయసులో కూడా ఈ ప్రపంచాన్ని మార్చటానికి కొత్తకొత్త తాత్త్విక భూమికల గురించి అన్వేషిస్తూ, తాను కనుగొన్న సత్యాలను ప్రపంచంతో పంచుకొంటూ జీవించారు. పైన ఆయనే చెప్పినట్లు మరణించే సమయంలో కూడా ఏదో పెద్ద ప్రాజెక్టును ఊహిస్తూ ఉండి ఉంటారు.

లక్ష్మీనరసింహ శర్మ, సుబ్బమ్మ దంపతులకు 1932 మార్చి 6న సాధు సుబ్రహ్మణ్య శర్మ జన్మించారు. వీరి ప్రాథమిక చదువు బళ్ళారిలోను, కాలేజి చదువు అనంతపురం, హైదరాబాద్‌లోను జరిగాయి. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖలో వివిధ హోదాలలో పనిచేసి, చివరకు జనరల్ మేనేజర్ ఇన్‌చార్జిగా 1990 మార్చి 31న పదవీ విరమణ చేసారు. ఈ జూలై 18న కాకినాడలోని స్వగృహంలో 93 ఏళ్ళ వయసులో మరణించారు.

సాధు సుబ్రహ్మణ్య శర్మ జ్ఞానదాహం అపారం. కవిత్వం, చరిత్ర, భాషాసంబంధ పరిశోధన, తత్త్వశాస్త్రం వంటి రంగాలలో వారు చేసిన ప్రామాణిక రచనలు అసాధారణం. 'సాధువాడిమాట–నవసహస్రాబ్ది బాట' అనే మకుటంతో సమకాలీన అంశాలు, నైతిక విలువలపై పద్యాలు రాశారు. 'కాలవాహిని' పేరుతో కవిత్వం రాశారు. అక్షరాలు దిద్దనవసరం లేకుండా తెలుగును బోధించేందుకు 'సాధుబాల శిక్ష' పాఠ్య పుస్తకం రాశారు. 'New Frontiers of Philosophy for an Alternate Model of Society or the Human Manifesto', 'Dialectics of Evolution, Systems Approach and New frontiers of Philosophy', 'Fight for Peace and Struggle for an Ideal Society' వంటి పుస్తకాలు ఇంగ్లీష్‌లో రాశారు. వీటిలో మొదటి పుస్తకం మానవజాతి ఎదుర్కొంటున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ పర్యావరణ సంక్షోభాలను చర్చిస్తుంది. సమకాలీన సమాజాన్ని, మానవ జీవనాన్ని పునర్నిర్మించే దిశగా ఒక గొప్ప మేధావి చేసిన ఆలోచనలు ఇందులో ఉన్నాయి. రెండవ పుస్తకంలో చరిత్రను ఒక కొత్త తాత్త్విక దృష్టితో ఎలా చూడాలో వివరిస్తూ, మరింత శాంతిమయ భవిష్యత్తును, శ్రేయస్సుతో కూడిన సమాజాన్ని సాధించేందుకు ఒక విన్–విన్ వ్యూహాన్ని ప్రతిపాదించారు. చరిత్ర పర్యంతం సామాన్య మానవుడు కేవలం విధేయత కలిగిన ఒక వస్తువుగానే ఉన్నాడని అతను మరింత తెలివైన పాత్ర పోషించాలి అని ఇందులో సాధుశర్మ అంటారు. మూడో పుస్తకంలో

> సాధు సుబ్రహ్మణ్య శర్మ జ్ఞానదాహం అపారం. కవిత్వం, చరిత్ర, భాషాసంబంధ పరిశోధన, తత్త్వశాస్త్రం వంటి రంగాలలో వారు చేసిన ప్రామాణిక రచనలు అసాధారణం. తెలుగువారు గర్వించదగిన గొప్ప తాత్త్విక రచనలను సుబ్రహ్మణ్య శర్మ చేసారు. వాటిపట్ల తెలుగునాట పెద్దగా చర్చ జరగకపోవటం నిజంగా బాధాకరం.




ఆధునిక సమాజం, హింస యుద్ధాల నుంచి ఎలా విముక్తి చెంది శాంతి వైపు ప్రయాణించాలో చర్చించారు. 770 పేజీల 'మేటి భారతదేశం' రచన మన చరిత్ర మూలాలను అన్వేషిస్తూ రాసిన విశ్లేషణాత్మక గ్రంథం. తెలుగువారు గర్వించదగిన గొప్ప తాత్త్విక రచనలను సుబ్రహ్మణ్య శర్మ చేసారు. వాటిపట్ల తెలుగునాట పెద్దగా చర్చ జరగకపోవటం నిజంగా బాధాకరం.

సాధు సుబ్రహ్మణ్య శర్మ తెలుగు పాఠకులకు ఎక్కువగా తెలిసింది 'బంకోలా' నవల ద్వారా. 'బంకోలా' అంటే లైట్ హౌస్ అని అర్థం. నవలలోని కథా కాలం 18వ శతాబ్దం. అది విదేశీయులు వ్యాపార నిమిత్తం వచ్చి దేశ రాజకీయాలను గుప్పెట్లోకి తెచ్చుకొంటున్న కాలం. స్వదేశీయులు మూడురకాలుగా విడిపోయారు: ఈ మార్పుని తమకు అనుకూలంగా మలచుకొని బాగుపడాలనుకొన్నవారు కొందరు, 'రాజెవ్వడైతే మాత్రం నా కష్టమే కదా నాకు దిక్కు' అనుకొని తటస్థంగా ఉండిపోయినవారు కొందరు, రాబోతున్న ఉపద్రవాన్ని పసిగట్టి సమాజాన్ని అప్రమత్తం చేయటానికి ప్రయత్నించిన ఆలోచనాపరులు మరికొందరు. వీరందరి మధ్యా సంఘర్షణ ఫలితంగా జరిగిన నాటకీయ పరిణామాలే బంకోలా నవల. కథానాయకుడు భైరి, ఓడల యజమాని నరసింహనాయకర్ కొడుకు. భైరి ఆలోచనాపరుడు, ఆంగ్లేయ స్నేహితుల నుంచి ప్రపంచ విజ్ఞానం గ్రహిస్తాడు, బ్రిటిష్ రాజకీయ ఆధిపత్య ఆలోచనలను గుర్తిస్తాడు. యానాం ఫ్రెంచి వారి వద్ద గుమస్తాగా పనిచేస్తూ వారి దాష్టీకాలను ఎదిరించి గొడవపడతాడు. మంజరి అనే వేశ్య ద్వారా విదేశీయుల దోపిడీని తెలుసుకొని ఢిల్లీ సుల్తానును కలిసి విదేశీయులను నిలువరించమని కోరటానికని ఢిల్లీ వెళతాడు. అక్కడ ఎవరూ ఇతని మాట ఖాతరు చేయకపోవటంతో తిరిగి కోరంగి వచ్చేస్తాడు. మరదలు పరదేశిని పెళ్ళాడి వ్యాపారంలో విజయం సాధిస్తాడు. అయితే బ్రిటిష్ వ్యతిరేక భావాలతో ఉన్నందుకు భైరి కొడుకును బ్రిటిష్ వారు హతమారుస్తారు. చివరకు, 1789 డిసెంబర్ 10న వచ్చిన కోరంగి సునామీలో భైరి, పరదేశి కొట్టుకుపోయి మరణించటంతో నవల ముగుస్తుంది. 'బంకోలా' నవలలో సుబ్రహ్మణ్య శర్మ ఆ కాలపు సామాజిక సంఘర్షణను నేపథ్యంగా తీసుకోవటం వల్ల ఇది గొప్ప చారిత్రక నవలగా రూపుదిద్దుకొంది. తెలుగులో ఈ కాలానికి సంబంధించి సామాన్యుల జీవితాలను ప్రతిబింబించే సాహిత్యం పెద్దగా లేదు. ఆ లోటు ఈ పుస్తకం తీర్చటంతో తెలుగు పాఠకులు దీనిని అపూర్వంగా ఆదరించారు.

ఇవేగాక, సాధుశర్మ రాసిన కొన్ని అముద్రిత రచనలూ ఉన్నాయి. 'జహిశత్రుల మహాబాహో', 'History of Freedom Struggle', స్వల్ప సంకేతాలతో సకల భాషలను రాసే విశ్వజనీన లిపిని కనిపెడుతూ ఆయన రాసిన మరో గ్రంథం ఇంకా అముద్రితాలే.

సాధు సుబ్రహ్మణ్య శర్మ 'సాధు ప్రైవేట్ లైబ్రేరీ'ని స్థాపించి స్కూల్ విద్యార్థుల కోసం స్వయంగా నడిపారు. పిల్లలు ఆటలు ఆడుకోవటానికి ఒక ఇల్లును అద్దెకు తీసుకొని అన్ని రకాల ఆట వస్తువులను వారికి అందుబాటులో ఉంచారు. ఇలా నిత్యయవ్వనంతో జీవించటమే ఆ గొప్ప తత్త్వవేత్త మనకు ఇచ్చిన సందేశం.

■ బొల్లోజు బాబా




వాణిజ్య పన్నుల శాఖ సీజ్ చేసిన లారీలు

గ్రానైట్ అక్రమ రవాణాపై నిఘా

- జిల్లా, మండస్థాయిల్లో టాస్క్‌ఫోర్సులు ఏర్పాటు
- 16 లారీలను సీజ్ చేసిన వాణిజ్య పన్నుల శాఖ
- మరో రూ.40 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అక్రమ మైనింగ్, గ్రానైట్ రవాణాపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. గ్రానైట్ అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన వరుస కథనాలపై కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పందించారు. గ్రానైట్ అక్రమ మైనింగ్, రవాణాను అరికట్టేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నామని సోమవారం ఆయన వెల్లడించారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, సీటీవో, మైనింగ్ ఏడీ, అదనపు ఎస్పీ, డీఎస్పీలతో కూడిన జిల్లా స్థాయి కమిటీ మైనింగ్, అక్రమ రవాణాను కార్యకలాపాలను పర్యవేక్షించనుంది. మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, ఎస్ఐ, రవాణ, వాణిజ్య పన్నులు, జీఎస్టీ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

నెలలో 35 గ్రానైట్ లారీలు స్వాధీనం

పల్నాడు జిల్లా నుంచి పెద్ద ఎత్తున గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతోంది. నెల రోజుల వ్యవధిలో 35 గ్రానైట్ లారీలను వాణిజ్య పన్నుల శాఖ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గ్రానైట్ మాఫియా లారీలను నిలుపుదల చేసిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులను తీవ్ర స్థాయిలో బెదిరింపులకు పాల్పడింది. మూడు లారీలను సైతం జిల్లా సరిహద్దులను దాటించడం జరిగింది. గత నెలలో 17 లారీలను సీజ్ చేయగా ప్రభుత్వానికి పన్నులు, జరిమానాల రూపంలో రూ.42 లక్షలు ఆదాయం లభించింది. రెండు లారీలను నాలుగు రోజుల క్రితం, 14 లారీలను శనివారం స్వాధీనం చేసుకున్నారు. లారీకి రూ.2.50 లక్షలు జరిమానా, పన్ను వసూలు చేసినా.. దాదాపు రూ.40 లక్షల ఆదాయం ప్రభుత్వానికి రానుంది.

టాస్క్ ఫోర్సు ఏర్పాటుతో ప్రభుత్వానికి నెలకు రూ.కోట్లలో ఆదాయం రానుంది. గ్రానైట్ లారీకి సూమారు రూ.54 వేల వరకు పన్ను చెల్లించాల్సి ఉంది. నెలకు వందల సంఖ్యలో లారీల్లో గ్రానైట్ జీరో బిల్లులపై జిల్లా సరిహద్దులు దాటిపోతోంది. దీనిని అరికడితే ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షమే.

గడువిస్తేనే.. ధీమా!

పంటల బీమా చెల్లింపు గడువు సమీపిస్తోంది. పంటలు సాగు చేయకమునుపే బీమా గడువు ముగియనుంది. మొన్నటి వరకు తీవ్ర వర్షా భావంతో ఏ పంటలు సాగు చేయాలో ఇంకా అన్నదాతలు తేల్చుకోలేని స్థితిలో ఉన్నారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పుడిప్పుడే సాగు పనులు ప్రారంభమవుతున్నాయి. పత్తి, కంది, మిరప పంటలకు బీమా ప్రిమియం చెల్లింపు గడువు ఈ నెలాఖరుకు ముగియనుంది. వరికి మాత్రం వచ్చే నెల 15వ తేదీ వరకు ఉంది. పంటల సాగు స్థితిని అంచనా వేయకుండానే పంటల బీమా గడువును నిర్ణయించడం ఏమిటని అన్నదాతలు ప్రశ్నిస్తు న్నారు. కనీసం ఆగస్టు నెలాఖరు వరకు బీమా గడువు పొడిగించాలని రైతులు కోరుతున్నారు.

పంటల బీమా గడువు నెలాఖరు వరకే

- వరికి మాత్రమే ఆగస్టు 15 చివరి తేదీ
- పత్తికి వాతావరణ ఆధారిత బీమా



(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పత్తి పంట సాగు చేయక ముందే ఈ నెల 15న బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగిసింది. అయితే పల్నాడు జిల్లాలో పత్తి సాగుపై ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక పంపడంతో బీమా గడువును ఈ నెలాఖరుకు పొగించారు. పల్నాడులో పత్తి పంటను మాత్రమే వాతావరణ ఆధారిత బీమా పథకం కింద ఎంపిక చేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద వరి, కంది, మిరప పంటలను ఎంపిక చేశారు. గడువు లోగా బీమా ప్రిమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ రైతులకు సూచిస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పత్తి సరిగా సాగు చేయలేదు. ఇప్పుడిప్పుడే కురుస్తున్న వర్షాలతో పత్తి సాగుకు రైతులు సమాయత్తమవు తున్నారు. పల్నాడు జిల్లాలో పత్తి సాగు సాధారణ విస్తీర్ణం 2,28,915 ఎకరాలు కాగా, ఇప్పటికి 31,420 ఎకరాల్లో అంటే 14 శాతం మాత్రమే పత్తి సాగు చేశారు. గుంటూరు జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 59,140 ఎకరాలు కాగా ఇప్పటికి 4,080 ఎకరాల్లో సాగు చేశారు. బాపట్ల జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 6,307 ఎకరాలు కాగా, 26 ఎకరాల్లో మాత్రమే ప్రస్తుతం సాగైంది. వర్షాలు కొనసాగితే పత్తి సాగు చేయనున్నట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణ ఆధారిత బీమా (మిగతా 6వ పేజీలో)

పదిమందికి ఎస్ఐలుగా..

ఉద్యోగోన్నతి

- జిల్లాలు కేటాయిస్తూ ఐజీ ఆదేశాలు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలో పది మందికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఐజీ త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారికి జిల్లాలు కూడా కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఎన్.రవికుమార్, కె.సుభాషిని, ఎన్.చంద్ర లీల, షేక్ యాస్మిన్, ఎల్.చిరంజీవి, ఎం అంజిరెడ్డి తదితరులను గుంటూరు జిల్లాకు కేటాయించారు. ఎల్.లక్ష్మీరాజ్యం, జి వాణిశ్రీని బాపట్ల జిల్లాకు, డి.దస్తగిరి, ఎస్.నాగేశ్వరరావును పల్నాడు జిల్లాకు


ఐజీ త్రిపాఠిని కలిసిన ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలు

కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలు సోమవారం రేంజ్ ఐజీ త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఉద్యోగోన్నతి పొందడం అంటే బాధ్యత పెరిగినట్లుగా భావించాలన్నారు. ఇకనుంచి మరింత బాధ్యతగా అంకితభావంతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఘాటు తగ్గితేనే.. రేటు



- మిర్చి సాగు విస్తీర్ణంపై రైతులు, ట్రేడ్ వర్గాల్లో చర్చ
- ఇదే చెబుతున్న నాలుగేళ్ల గణాంకాలు
- ఈ ఏడాది సాగుపై సర్వత్రా ఆసక్తి

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మిర్చి పంట సాగు విస్తీర్ణం ఈ ఏడాది ఎంత మేరకు జరుగుతుందోనన్న చర్చ అటు రైతులు, ఇటు ట్రేడ్ వర్గాల్లో నెలకొంది. ఇందుకు కారణం గత రెండేళ్లలో పంట విస్తీర్ణం పెరిగిన కారణంగా దాని ప్రభావం మిర్చి ధరలపై చూపడమే. గతేడాది ఏ దశలోనూ నాణ్యమైన మిర్చి క్వింటాల్ ధర రూ.13,500 దాటలేదు. నాణ్యత లేకుంటే రూ.7 వేల నుంచి రూ.10 వేల మధ్యనే వ్యాపారులు రైతులకు చెల్లించారు. ఇప్పుడు కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉంచి మిర్చిని కొద్ది కొద్దిగా బయటకు తీసి విక్రయిస్తున్నారు. అయినప్పటికీ పెద్దగా వ్యత్యాసం కనిపించడం లేదు. క్వింటాల్‌కు కేవలం రూ.500 చొప్పున మాత్రమే ధర పెరిగింది. కోల్డ్ స్టోరేజ్‌లలో ఉన్న నిల్వలను పరిగణనలోకి తీసుకుని.. మిర్చి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయకుండా ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోతే గతేడాది తలెత్తిన పరిస్థితులే పునరావృతం అవుతాయి.

నాలుగేళ్లలో పెరిగిన సాగు విస్తీర్ణం..

జిల్లాలో గత నాలుగేళ్ల క్రితం వరకు మిర్చి పంట సాగు విస్తీర్ణం 80 వేల హెక్టార్లకు కొంచెం అటు ఇటుగానే ఉండేది. ఎప్పుడైతే విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో పంట దెబ్బతిందో అప్పటి నుంచి దాదాపుగా రెట్టింపు విస్తీర్ణంలో రైతులు మిర్చిని సాగు చేయడం ప్రారంభించారు. మిర్చి పంటకు సోకుతున్న తెగుళ్ల నివారణకు ఎక్కువ మోతాదులో పురుగు మందులు వినియోగిస్తున్నారు. దీని వల్ల పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా ఉంటే ధర పెరుగుతుంది. అలా కాకుండా డిమాండ్‌కు మించి పంట ఉత్పత్తి జరిగితే ధర నేల చూపులు చూడటం తప్ప స్థిరంగా నిలిచే పరిస్థితి ఉండదు. ఒకప్పుడు విదేశాలకు గుంటూరు మిర్చి ఎగుమతి దారులే అధికంగా ఎక్స్‌పోర్టు చేసేవారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం ఏఎంసీ నుంచి కూడా తేజ వెరైటీ మిర్చి ఎక్కువగా ఎక్స్‌పోర్టు అవుతోంది. వీటిని రైతులు పరిగణనలోకి తీసుకొని స్వీయ నియంత్రణ పాటించాలని అధికారులు, ట్రేడర్లు సూచిస్తున్నారు.

జిల్లాలో మిర్చి సాగు, దిగుబడి ఇలా..

సంవత్సరం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
2018-19	80,814	4,80,924
2019-20	80,624	4,81,584
2020-21	76,568	5,35,976
2021-22	1,09,018	4,90,581
2022-23	1,61,587	6,46,348
2023-24	2,37,398	6,46,348
2024-25	1,45,713	8,74,278

మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు

- అమరావతి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను సీఆర్డీఏ ఇంజనీర్లతో కలిసి మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కొన్ని చోట్ల మాత్రం వర్షాల కారణంగా కొంచెం ఇబ్బందు కోసం 90 బంగ్లాలు, మంత్రుల కోసం 35 బంగ్లాలు, జడ్జిల కొరకు 36 బంగ్లాలు, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కొరకు మొత్తం 21 టవర్లలో 1968 ఫ్లాట్లు నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వివరించారు. గెజిటెడ్ అధికారుల్లో టైప్-1 అధికారుల కోసం 4 టవర్లలో 384 ఫ్లాట్లు, టైప్- 2 అధికారుల కోసం 4 టవర్లలో 336 ఫ్లాట్లు, గ్రూప్- డీ


అధికారుల భవనాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

లున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు 12 టవర్లలో 288 ఫ్లాట్లు, ఆలిండియా సర్వీస్ అధికారులకు 6 టవర్లలో మొత్తం 144 ఫ్లాట్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శుల కోసం 25 బంగ్లాలు, సెక్రటరీల ఉద్యోగుల కొరకు మొత్తం 6 టవర్లలో 720 ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు ఆయన తెలియ జేశారు. అమరావతిలోని హ్యాపీనెస్ట్ 6 టవర్లలో 1200 ఫ్లాట్లు నిర్మాణం జరుగుతుందన్నారు. వాటి ఫైలింగ్ వర్కులు వేగంగా (మిగతా 6వ పేజీలో)



ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులతో పలు రైళ్ల రద్దు

- కొన్ని పాక్షిక్ష రద్దు, దారి మళ్లింపు, క్రమబద్ధీకరణ

కడలి గర్భశోకం



- కలుషితమవుతున్న సముద్ర జలాలు
- మృత్యువాత పడుతున్న తాబేళ్లు, డాల్ఫిన్లు
- కాలుష్య కోరల్లో తీర ప్రాంతాలు
- పర్యావరణ పరిక్షణను పట్టించుకోని అధికారులు

సాంస్కృతిక వికాసానికి పునరంకితం కావాలి

- ప్రముఖ సినీ రంగస్థల నటుడు, దర్శకుడు కేఎస్‌టీ సాయి 8

ఎంఈవోలకూ.. ముఖ హాజరు

- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ 6

డెల్టాలో కుండపోత

- లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య


గుంటూరులో మూడొంతెనల వద్ద వర్షపు నీరు

తెనాలి, గుంటూరు జూలై 21, (ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు మండిన ఎండలు సెగరేపితే మనుషులతోపాటు పైర్లూ మాడిపోయాయి. వరి నారుమళ్లు, వెదసాగు వరి చివర్ల ఎండి కళావిహీనంగా మారిపోతే, ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడటంతో వాతావరణం చల్లబడింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో వరుణుడు కుమ్మరించేశాడు. ఆదివారం ఉదయం పడినా, తర్వాత చాలావరకు ఎండ మండిపోయింది. రాత్రి నుంచి వరుణుడు ప్రతాపం చూపించాడు. ఆదివారం అర్ధరాత్రి వరకు వర్షం పడతూనే వచ్చింది. మధ్యలో కాస్తంత విరామం ఇచ్చినా, సోమావారం మాత్రం పడిన చినుకు పడినట్టే ఉంది. ఏదో ఒక ప్రాంతంతో సంబంధం లేకుండా జిల్లా మొత్తం వర్షం పడింది. దీంతో పట్టణాల్లో రోడ్లన్నీ జలమయమైపోతే, చేలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి.

పూడిక తీతతో తప్పిన ముంపు..

తెనాలిలో మాత్రం తాజాగా మురుగు కాల్వల పూడిక తీయటంతో చిన్న వానకే మోకాళ్లలోతు నీటితో నిండిపోయే బోస్‌రోడ్‌పై చుక్కనీరు కూడా కనిపించలేదు. రోడ్లవెంట ఆక్రమణలు కూడా తీసేసి, రోడ్డుకంటే అంచులు ఎత్తు లేకుండా కాంక్రీట్ చేయడంతో వర్షపునీరు కాల్వలోకి వెళ్లిపోయి.. ముంపు సమస్య లేకుండా పోయింది. లోతట్టు ప్రాంతాలు మాత్రం వరద ముంపును తలపించాయి.

నీటితడుల కష్టాలకు తెర..

ప్రస్తుతం కురుస్తున్న వర్షం ఖరీఫ్‌కు ఊపిరి పోసినట్లయ్యింది. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంటే, 2025-26 ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటికే లక్షన్నర ఎకరాలకుపైగా వెదపద్ధతిలో సాగు మొదలు పెట్టేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఇప్పటికే ఖరీఫ్ సాగు కింద వరి నారుమళ్లు బోర్ల కింద పోస్తే, చాలావరకు వెద పద్ధతిలో విత్తనాలు చల్లేశారు. మరోపక్క లంక గ్రామాల్లోని అరటి, పసుపు, కంద, తమలపాకు వంటి వాణిజ్య పంటలకు వర్షం మేలే చేసింది.

వర్షపాతం ఇలా..

సోమవారం కురిన వర్షపాతం ప్రకారం తెనాలి డివిజన్‌లో మొత్తం 38.74 సెం.మీటర్ల వర్షం పడితే, సగటున 4.84 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కాకుమానులో 8.62 సెం.మీటర్ల, అత్యల్పండా తెనాలిలో 2.28 సెం.మీటర్ల వర్షపాతం నమోదయింది. తాడేపల్లిలో 3.24, మంగళగిరిలో 5.36, దుగ్గిరాలలో 4.86, కొల్లిపరలో 6.74, చేబ్రోలులో 3.62, పొన్నూరులో 4.02 సెం.మీటర్ల మేర వర్షపాతం నమోదయింది. తెనాలి, మరికొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా 30 నుంచి 40 రోజుల దశలో ఉన్న వరి చేలన్నీ నీట మునగటంపై రైతులు మంత్రి మనోహర్ దృష్టికి తీసుకొచ్చారు. యుద్ధప్రాతిపదికన కంచర్లపాలెం, ముంపు సమస్య ఉన్న ప్రాంతాల్లో కాల్వల పూడిక తీతపనులు చేపట్టారు. అలాగే వదలకుండా పడుతున్న వర్షం కారణంగా డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. భట్టిప్రోలు, రేపల్లె మెయిన్ డ్రెయిన్‌లలో చాలాచోట్ల గుర్రపడెక్క పేరుకుపోవటంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. పైర్లు వలం 30 శాతం మాత్రమే ఉండటంతో నష్టం పెద్దగా లేదు. డ్రెయిన్‌ల వెంటున్న చేలల్లో మాత్రం ముంపు తప్పడం లేదు. జూన్‌లో సాధారణ వర్షపాతం 97.1 మి.మీ కాగా, 65.1 మి.మీ మాత్రమే నమోదైంది. జూలైలో సాదారణ వర్షపాతం 164.9 కాగా ఈ నెల 19 వరకు 74.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. ఈ నెల 19న 74.5, 20న 18.4, 21న 52.2 మి.మీ కలిపి మొత్తం 145.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు.. వాతావరణ వర్గాలు తెలిపాయి. ఈ నెల ఒకటి నుంచి 21వ తేదీ వరకు సాదారణ వర్షపాతం 111.7 మిల్లీమీటర్లు కాగా ఇప్పటికే దీనిని అధిగమించేసింది.


తాడికొండ: పాములపాడు వద్ద కొండవీటి వాగులో చిక్కుకున్న కారు


ప్రత్తిపాడు మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు


బొంగరాలబీడు పాత వెహికల్ షెడ్డు రోడ్డుపై వర్షపు నీరు


సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించాలి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పీ-4 మార్గదర్శకాల ప్రకారం.. బంగారు కుటుంబాల గుర్తింపు, మార్గదర్శుల మ్యాపింగ్ ప్రక్రియను ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పీ4 పథకంతో పాటు హౌసింగ్, ఉపాధి హామీ పనులపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్, డ్వామా ఉద్యోగులు, మండల స్థాయి అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాల అవసరాలకు అనుగుణంగా ఆర్థిక సాయం, నైపుణ్యాల శిక్షణపై వివరాలు సేకరించాలని సూచించారు. పీ4 నీడ్ అసెస్‌మెంట్ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో లేఅవుట్లలో 11,049 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా కాగా, ఇప్పటి వరకు దాదాపు 54 శాతం పూర్తి అయ్యాయని చెప్పారు. మిగిలినవి లబ్ధిదారులు వెంటనే పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈల నైపుణ్యాభివృద్ధికి, ఇతర మార్కెటింగ్ అంశాలకు పరిశ్రమల శాఖ మండల స్థాయిలో వర్క్ షాపులు సక్రమంగా నిర్వహించేలా ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీగా డ్రైడే పాటించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ వీ జ్యోతిబసు, డీపీఓ సాయికుమార్, సీపీఓ శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాదు, డ్వామా పీడీ శంకర్, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు మార్కెటింగ్ సూపర్‌వైజర్ల ఇంక్రిమెంట్ల కోత

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గతంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న నల్లపాడు గొర్రెలమండీలో సెస్సు వసూళ్లలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు సూపర్‌వైజర్లపై ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకొంది. 2019 డిసెంబరు 20న మండీలో ఆకస్మిక తనిఖీలను అధికారులు నిర్వహించారు. ఆ సమయంలో భారీ వ్యత్యాసాలు కనిపించాయి. దీంతో సూపర్‌వైజర్లు ఎన్.అంజి బాబు (ప్రస్తుతం తెనాలి ఏఎంసీ), కె. రామకృష్ణ(ప్రస్తుతం గురజాల ఏఎంసీ)లను బాధ్యులుగా గుర్తిస్తూ అభియోగాలు నమోదు చేశారు. విచారణ జరిపిన అధికారులు ఇద్దరికి ఒక యాన్యువల్ గ్రేడ్ ఇంక్రిమెంట్‌ను క్యుములేటివ్ ఎఫెక్ట్‌తో నిలిపేస్తూ చర్య తీసుకొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'విజ్ఞాన్స్'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం


కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు

గుంటూరు (విద్య)జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేజోలు మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైంది. విజ్ఞాన్ టీబీఐ ఆధ్వర్యంలో ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్స్ ఇన్నోవేషన్ సెల్ ఆర్థిక సౌజన్యంతో 5 రోజుల పాటు "ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్"పై ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల అధ్యాపకులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అస్పైర్ టీబీఐ సీఈవో డాక్టర్ బీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఇంటర్ డిసిప్లినరీ లెర్నింగ్ ప్రాముఖ్యతను, "క్రియేటివిటీ అండ్ ఐడియా జనరేషన్" గురించి వివరించారు. మానసిక అడ్డంకులను ఎలా అధిగమించాలో, కొత్త ఆలోచనలను ఎలా కల్పించాలో అధ్యాపకులకు వివరించారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన అశోక ఇన్నోవేషన్ కోచ్ డాక్టర్ రవి చంద్ర రాజు మాట్లాడుతూ సమస్యలపై విద్యార్థుల్లో దృక్పథాన్ని పెంపొందించేలా అధ్యాపకులు మారాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● రూ.30వేల నగదు, బంగారు, వెండి వస్తువుల చోరీ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

యడ్లపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో కుమారుడి వద్ద ఉంటూ తరచూ స్వంత గ్రామానికి వచ్చి వెళుతూ ఉండే ఓ వృద్ధురాలి ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు నగదు, బంగారు, వెండి వస్తువులను అపహరించుకెళ్ళారు. ఆదివారం వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. యడ్లపాడు మండలం ఛైదవోలు గ్రామానికి చెందిన బండారు వరలక్ష్మి హైదరాబాద్‌లోని కుమారుడి వద్ద నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం ఇరుగు పొరుగువారు ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి హైదరాబాద్‌లోని వరలక్ష్మికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. హుటాహుటిన గ్రామానికి వచ్చిన ఆమె ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా వస్తువులన్నీ చిందరవందరగా నేలపై పడి ఉనాయి.. బీరువాలో దాచిన రూ.30వేల నగదుతోపాటు 4 గ్రాముల బంగారు, 40 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాల ఫుటేజిని పోలీసులు పరిశీలించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ముఖం కనిపించకుండా హెల్మెట్ ధరించిన దుండగుడు ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులుగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ వెల్లడించారు.

ఎంఈవోలకూ.. ముఖ హాజరు

- పనితీరు మెరుగుకు ప్రభుత్వం చర్యలు
- విధిగా రోజుకు ఒక పాఠశాల తనిఖీ
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

సత్తెనపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారులు ఇక నుంచి ఉదయం 9 గంటలకు ముఖ హాజరు వేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇక ఎప్పుడు పడితే అప్పుడు వెళ్లి రావడానికి వారికి చెక్ పడనుంది. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ఎంఆర్‌సీకు వెళ్లి ఎంఈవోలు ఆన్‌లైన్‌లో ముఖ హాజరు వేయాలి. ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేయాలి. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యా పథకాలు, హెచ్ఎంలు, టీచర్ల పనితీరు, ప్రమాణాలను పర్యవేక్షించేందుకు ఎంఈవోలను ప్రభుత్వం నియమించింది. గత వైసీపీ పాలనలో ప్రతి మండలానికి అదనంగా ఎంఈవో-2ను నియమించారు. ఐనా పాఠశాలల పర్యవేక్షణ గాడిన పడలేదు. ఇద్దరు ఎంఈవోలు ఉండటంతో అనేక మండలాల్లో ఆధిపత్య పోరు మొదలైంది. ఇంకో వైపు చాలా మంది ఎంఈవోలు స్థానికంగా నివాసం ఉండకుండా జిల్లా డివిజన్ కేంద్రాల్లోనే నివాసం ఉంటున్నారు. దీంతో పని వేళలు పాటించటం లేదు. ఎప్పుడో వెళ్లి హాజరు వేసుకుంటున్నారు. కొందరైతే జిల్లా కేంద్రంలో ఉంటూ అక్కడ నుంచే ఏదో ఒక కారణం చూపి ముఖహాజరు నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎంఈవోలతో పాటు ఎంఆర్‌సీలలో పని చేస్తున్న సీఆర్‌పీలు, ఆపరేటర్లు, ఇతర కింది స్థాయి సిబ్బంది కూడా 9 గంటలకే ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.

హాజరు తనిఖీలపై రోజూ నివేదిక

తోచిన కారణాలు చెప్పి తప్పించు కోవటానికి అవకాశం లేకుండా ఎంఈవోల మెడకు కమిషనర్ కత్తి బిగించారు. టీచర్ల మాదిరిగానే ఉదయం 9.30 గంటలకు ఎంత మంది ఎంఈవోలు హాజరు వేసింది జిల్లా విద్యాశాఖ ప్రతి రోజు కమిషనరేట్‌కు నివేదిక పంపించాలి. గతంలో కొందరు ఎంఈవోలు డివిజన్, జిల్లా కేంద్రాల నుంచి ఎప్పుడో బయలు దేరి దగ్గర ఉన్న పాఠశాలలకు వెళ్లి తూతూ మంత్రంగా తనిఖీలు చేసి హాజరైనట్లు నమోదు చేసుకొనే వారు. ఇప్పుడలా కాకుండా ఎంఈవోలు జీపీఎస్ విధానం అమలు చేస్తున్నారు. ఎంఆర్‌సీకి వెళితే అక్కడ లొకేషన్ చూపిస్తుంది. పాఠశాలలకు వెళితే అక్కడ లొకేషన్ చూపిస్తుంది.

రైతుల ఖాతాలను పునఃపరిశీలించి నగదు జమచేస్తాం

● తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా


దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్‌కమిటీ యార్డు సమావేశంలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ సంజనా సింహా

దుగ్గిరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతుల బాండ్లను పరిశీలించాక వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా అన్నారు. గతేడాది జనవరి 19న స్థానిక శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులు, వ్యాపారులకు బీమా మొత్తాన్ని చెల్లించే ప్రక్రియలో భాగంగా రైతులను, వ్యాపారులను సబ్‌కలెక్టర్ సోమవారం కలిసి మాట్లాడారు. అనంతరం మీడియాతో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్కరైనా అర్హులైనవారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, నష్టపోయిన వారిలో రైతులకు రూ.20.50కోట్లు, వ్యాపారులకు రూ.2కోట్లు మంజూరయ్యాయన్నారు. సోమవారం కొందరు రైతుల బాండ్లను, బ్యాంకుఖాతా పుస్తకాలను తనిఖీ చేశామని, మరి కొందరు రైతులకు సంబంధించిన వివరాలను మంగళ, బుధవారాల్లో తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పునఃపరిశీలన జరిపిన అనంతరం వారి ఖాతాల్లో జమచేస్తారన్నారు. యార్డుచైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ, పలువురు పసుపు వ్యాపారులు పాల్గొన్నారు.

బీజేపీ గుంటూరు జిల్లా నూతన పదాధికారుల జాబితా విడుదల

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా నూతన పదాధికారుల జాబితాని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు సోమవారం విడుదల చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా మంత్రి సుగుణ, సాధు రామకృష్ణ, వంగిపురపు విమలాదేవి, రెడ్డి శివ పార్వతి, కటారి వాసుదేవ నాయుడు, కత్తి మేరీ సరోజినిని నియమించామన్నారు. ప్రధాన కార్యదర్శులుగా హెచ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, కార్యదర్శులుగా పంచుమర్తి ప్రసాద్, ఆర్ వెంకటలక్ష్మి, మార్తా నరేంద్ర, నారదాసు వీరమణింద్ర, కే నారాయణ రెడ్డి, సురేష్ కుమార్ జైన్, దానబోయిన శివయ్య, కోశాధికారి ఆమతి వెంకటరమణ, ఐటీ కన్వీనర్‌గా కటకం అనూష, సోషల్ మీడియా కన్వీనర్ తూనుగుంట్ల రాజేష్‌ని నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ పాలన విజయాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. జిల్లా మండల స్థాయిలో పార్టీని మరింత శక్తివంతంగా తయారు చేయడానికి నూతనంగా నియమింపబడిన పదాధికారులు సంకల్పంతో పనిచేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో భారతీయ జనతాపార్టీ ఎక్కువ సంఖ్యలో ప్రజా ప్రతినిధులను తయారు చేయడంలో అందరూ భాగస్వామ్యం కావాలని తిరుపతిరావు పిలుపునిచ్చారు.

మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయని ఆయన అన్నారు. మొత్తం భవనాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఏఐఎస్ అధికారుల క్వార్టర్లు ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తిచేస్తామని, ఇతర నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఐకానిక్ భవనాల నిర్మాణాలపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు, డిజైన్ రూపొందించిన నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ప్రతినిధుల మధ్య తుది చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ఐకానిక్ భవనాల నిర్మాణం కూడా ప్రారంభిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నెలాఖరునాటికి 90 శాతం మ్యాన్ పవర్‌తో పనులు జరిపిస్తామని ఆయన చెప్పారు.

● డిసెంబర్ నాటికి మెజారిటీ సంస్థల నిర్మాణాలు ప్రారంభం

అమరావతిలో ఇప్పటివరకూ మొత్తం 72 సంస్థలకు భూకేటాయింపులు చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులతో స్వయంగా సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటు చేసి ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పిన ఆయన, వాటిలో మెజారిటీ సంస్థలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి నిర్మాణ పనులు ప్రారంభిస్తాయన్నారు.

గుర్రపు డెక్క చుట్టుకుని పశువుల మృతి


రేపల్లె డ్రెయిన్‌లో పడి మృతి చెందిన పాడి పశువు

వేమూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుమర్రు ఎస్‌టీ కాలనీకి చెందిన చౌటూరి చినపిచ్చయ్యకు చెందిన నాలుగు పాడి పశువులు సోమవారం రేపల్లె మెయిన్ డ్రెయిన్‌లో గుర్రపు డెక్కకు చుట్టుకుపోయి మృతి చెందాయి. పోతుమర్రు, చంపాడు గ్రామాల మధ్యలో ఉన్న ప్రధానమైన మురుగు కాల్వలో సంబంధిత అధికారులు గుర్రపుడెక్కను తొలగించలేదు. పిచ్చయ్యకు చెందిన నాలుగు పాడి పశువులు కాల్వలో దిగాయి. నాలుగు పశువులు కనపడని కారణంగా గ్రామస్తులు కాల్వలో దిగి గాలింపు ప్రారంభించారు. మూడు పశువులు మృతి చెంది గుర్రపు డెక్కకు చిక్కుకుపోయిన ఉన్నట్లు గుర్తించారు. మరో పాడి పశువు కనబడటం లేదు. అప్పు చేసి పాడి పశువులపై జీవనం సాగిస్తున్న పిచ్చయ్య తన జీవనోపాధిని కోల్పోయానని విలపిస్తున్నాడు. నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే తనకు రూ.2.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నాడు. ప్రభుత్వం ద్వారా తనకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు. బ్యాంకు ద్వారా చేసిన అప్పు చేసి రద్దు చేయించాలని విన్నవించుకుంటున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఎల్‌హెచ్‌బీ బోగీలతో లక్నో ఎక్స్‌ప్రెస్ అప్‌గ్రేడ్

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వారంలో రెండు రోజులు న్యూగుంటూరు మీదగా రాకపోకలు సాగించనున్న లక్నో ఎక్స్‌ప్రెస్‌ని ఎల్‌హెచ్‌బీ బోగీలతో రైల్వే శాఖ అప్‌గ్రేడ్ చేసింది. ఈ నెల 26వ తేదీ నుంచి నంబరు. 16093 చెన్నై సెంట్రల్ - లక్నో ఎక్స్‌ప్రెస్‌ని, 28వ తేదీ నుంచి లక్నో - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ని ఎల్‌హెచ్‌బీ బోగీలతో నడపనున్నట్లు రైల్వే శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని వలన ఏసీ టూటైర్ ఒకటి, ఏసీ త్రీటైర్ ఎనిమిది, స్లీపర్‌క్లాస్ నాలుగు, జనరల్ సెకండ్ క్లాస్ ఒకటి, ఎస్ఎల్ఆర్ ఒకటి బోగీలతో ఈ రెండు రైళ్లు ప్రయాణిస్తాయి.

లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కి మరో ఏసీ త్రీటైర్ ఎకానమి బోగీ

నిత్యం గుంటూరు మీదగా రాకపోకలు సాగించే విజయవాడ - లింగంపల్లి - విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లను శాశ్వతంగా మరో అదనపు ఏసీ త్రీటైర్ ఎకానమి బోగీని జోడించనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. నంబరు. 12795 విజయవాడ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 26, నంబరు. 12796 లింగంపల్లి - విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 27 నుంచి అదనపు బోగీలు జోడించి నడపనున్నట్లు పేర్కొన్నది.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

రూ.10.37 లక్షల విలువ గల చోరీ సొత్తు సీజ్ చేసిన పోలీసులు


నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టిన బాపట్ల సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్

బాపట్లరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల, గుంటూరుజిల్లాలలో రాత్రిపూట వరస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని బాపట్ల సీసీఎస్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను జిల్లా సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ సీసీఎస్ పోలీసుస్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మండలం మూలపాలెం గ్రామానికి చెందిన బెజ్జం జగదీష్ అనే వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటుపడి దొంగతనాలను ప్రారంభించాడు. బాపట్లజిల్లాలో జరుగుతున్న వరుస దొంగతనాల కేసులను సవాల్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడి పర్యవేక్షణలో సీసీఎస్ పోలీసుబృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడు బెజ్జం జగదీష్‌ను పర్చూరు, చిలకలూరిపేట వెళ్ళేరోడ్డులోని వైజంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి మూడు ఎల్‌ఈడీ టీవీలు, కంప్యూటర్, ఒకప్రింటర్, బంగారుచైను, సెల్‌ఫోన్‌లు, నల్ల పూసల గొలుసు మొత్తంగా రూ. 10లక్షల 37వేల విలువగల రికవరి సొత్తును స్వాధీనం చేసుకొని సీజ్ చేయటం జరిగిందని తెలిపారు. దొంగతనాల కేసు చేధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీఎస్ బాపట్లఇన్‌స్పెక్టర్ పి.ప్రేమయ్య సీసీఎస్ ఎస్సై రవిప్రకాష్, బి.రాంబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఇంటి నిర్మాణాల పేరుతో మోసం

తెనాలిలో కాంట్రాక్టర్ అరెస్టు


కాంట్రాక్టర్‌ను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు తీసుకువెళుతున్న ఎస్ఐ ఆనంద్

తెనాలి రూరల్, జూలై21(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణాల పేరుతో నగదు తీసుకుని లబ్ధిదారులకు నిర్మాణ పనులు పూర్తిచేయకుండా తప్పించుకు తిరుగుతున్న కాంట్రాక్టర్‌ను అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం తెనాలి మం డలంలోని పెదరావూరులో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా గత ప్రభుత్వంలో నివేశన స్థలాలను లబ్ధిదారులకు అందించారు. వాటిల్లో ఇంటి నిర్మాణాలకు గానూ ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.1,80,000 వంతున మంజూరు చేసింది. దీంతో ఇంటి నిర్మాణానికి కాంట్రాక్ట్ పద్ధతిలో కట్టి అప్పగిస్తామని తెనాలి మారీసుపేటకు చెందిన ఎస్‌జీ బిల్డింగ్ వర్క్స్ కాంట్రాక్టర్ అండ్ ఏజెంట్ పున్నారావు పలువురు లబ్ధిదారులను నమ్మబలికారు. నగదుతీసుకుని అగ్రిమెంట్ చేసి సకాలంలో ఇంటినిర్మాణ పనులు పూర్తిచేసి వారికి అప్పగించలేదు. నిర్మా ణ పనులపై లబ్ధిదారులు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించినా సరైన సమాధానం చెప్పకుండా నగదు తిరిగి చెల్లించకుండా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పలువురు లబ్ధిదారులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే కాంట్రాక్టర్‌పై గతంలో బుర్రిపాలెం, నేలపాడు గ్రామాల లేఅవుట్లకు సంబంధించి మోసం చేశాడన్న ఫి ర్యాదుతో న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నరసరావుపేట సబ్‌జైల్లో ఉన్న నిందితుడిని పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి తెనాలి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. తిరిగి నరసరావుపేట జైలుకు తరలించినట్లు ఎస్ఐ ఆనంద్ పేర్కొన్నారు. రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

అరాచకాలను చూడలేకనే వైసీపీకి బుద్ధి చెప్పారు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


వర్షంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ చేసిన అరాచకాలు, విధ్వంసం, దుర్మార్గపు పాలనను చూడలేకనే విసిగి పోయిన ప్రజలు గత ఎన్నికల్లో వైసీపీని ఓడించి బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లాయపాలెం, బుక్కాపురం, ఎండుగుంపాలెం గ్రామాల్లో జోరు వానలోనూ పుల్లారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఎండుగుంపాలెంలో మాట్లాడుతూ వైసీపీ హయాంలో రైతులు పండించిన సుబాబుల్ కర్రను అమ్ముకోనివ్వకుండా వేధించారన్నారు. అలాంటి వారే ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. రైతుల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లానని, ఈ క్రమంలోనే పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సాగు నీటి సంఘాల ఛైర్మన్ నెల్లూరి రామారావును ఆయన అభినందించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ షేక్ కరి ముల్లా, నాయకులు ఎన్ సదాశివరావు, బీ సత్యనారాయణ, జే మదన్, ఎన్ హరిబాబు, కే రమణ, డీ శ్రీనివాసరావు, జీ రమేష్, సుమన్, సింగయ్య, జయప్ర సాదు, విజయ సాయి, రాయన్న, ఇన్నయ్య, సుభానీ, రాఘవయ్య, అశోక్, రాజు పాల్గొన్నారు.

నాసిరకం మద్యంతో ఆరోగ్యాలు నాశనం చేసిన వైసీపీ

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాసిరకం మద్యం సరఫరా చేసి డబ్బుతో పాటు వారి ఆరోగ్యాన్ని నాశనం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఐదేళ్లపాటు ప్రజలను జలగల్లా పట్టి పీడించి మద్యం,మైనింగ్, ఇళ్ళ స్థలాలు స్కామ్‌లకు పాల్పడ్డారని విమర్శించారు. అప్పుడు టీడీపీ ప్రతిపక్ష పార్టీగా పోరాడితే అక్రమ కేసులతో అణిచివేయాలని చూశారన్నారు. సిట్ దర్యాప్తుతో మద్యం కుంభకోణంలో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని, ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు అతని వెనకున్న మాజీ సీఎం జగన్‌కు శిక్షపడే రోజులు తొందరలోనే వస్తాయన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి


మృతుడు గోపి (ఫైల్‌ఫొటో)

ఈపూరు, జూలై21(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని భద్రుపాలెం సమీపంలో సోమవారం జరిగింది. రొంపిచర్ల మండలం ఆరేపల్లికి చెందిన గుడిపాటి గోపి(22) మోటార్ బైక్‌పై భద్రుపాలెం వెళ్తుండగా ఎదురుగా ఆటో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో గోపి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని పోలీసులు అంబులెన్స్‌లో ఈపూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సరావుపేటకు తీసుకువెళ్ళారు. చికిత్స పొందుతూ గోపి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గోపి ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. గుడిపాటి సింగరయ్య,కోటేశ్వరమ్మలకు ఐదుగురు కుమార్తెల తరువాత గోపి పుట్టాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

చెల్లని చెక్కు కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేట లీగల్, జూలై 21, (ఆంధ్రజ్యోతి), చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో దిగువ కోర్టు విధించిన 18 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.25 లక్షలు ఫిర్యాదుకి నష్టపరిహారంగా చెల్లించేలా విధించిన శిక్షను యధాతథంగా ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్య శ్రీ సోమవారం తీర్పు వెలువరించారు. పట్టణానికి చెందిన నిందితుడు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు వద్ద 2013 ఫిబ్రవరి 27న రూ.25 లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోటు రాసి ఇచ్చాడు. చెల్లింపులో భాగంగా 2017 మే 5న రూ.25 లక్షల చెక్కును ఇచ్చాడు. నాగేశ్వరరావు చెక్కును తన బ్యాంక్ ఖాతాలో వేసుకోగా అది చెల్లలేదు. ఆయన కోర్టులో కేసు దాఖలు చేసుకున్నాడు. విచారణలో నేరం రుజువడంతో 2021 జనవరి 20న దిగువ కోర్టు కోర్టు పై విధంగా తీర్పును వెలువరించింది. నిందితుడు శ్రీనివాసరావు జిల్లా కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నాడు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పును యథాతథాంగా ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

గడువిస్తేనే..ధీమా!

(5వ పేజీ తరువాయి)

పత్తి ఎకరాకు రూ.1,900 ప్రిమియం ఈ నెల 31వ తేదీ కల్లా చెల్లించాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు బీమా పొగించడంతో పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ ఎం.జగ్గారావు సూచించారు.

సాగు మొదలు కాని కంది, మిరప

కంది, మిరప పంటలు సాగు చేయలేదు. ఆయా పంటల సాగుపై రైతులకు ఇంకా స్పష్టత లేదు. వచ్చే నెల మొదటి వారంలో సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేయనున్నారు. పల్నాడులో కంది సాధారణ సాగు విస్తీర్ణం 52,635 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సాగు చేపట్టలేదని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. వర్షాలు కొనసాగితే కందిసాగు ఈ నెలాఖరుకు ప్రారంభమయ్యే అవకాశాలు న్నాయి. అగస్టు 15 తర్వాతే మిరప సాగు చేసే అవకాశాలున్నాయి. అయితే.. అప్పటి వరకు బీమా సౌకర్యం లేదు. పంటలు సాగు చేయక ముందే బీమా పథకాల గడువు ముగుస్తుండటం గమనార్హం. జిల్లా యూనిట్‌గా పంటల బీమాను అమలు చేస్తే పంటలు సాగు చేశాక రైతులు బీమా ప్రిమియం చెల్లించే అవకాశం ఉంటుంది. బీమా గడువును ఆగస్టు ఆఖరు వరకు పొడిగించాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే బీమా సౌకర్యాన్ని వారు కోల్పోయినట్లే.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	119, 127, 137
చికెన్ విత్ స్కిన్(కిలో)	226.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	236.00

44,971 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 47,858 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,971 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,252 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13400	334	9500	12500
273	----	----	నెంబరు. 5	10000	13600
341	10000	13600	273	9800	12800
4884	----	---	341	10000	13500
సూపర్ 10	10000	13000	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12600
బ్యాడిగి	10000	12300	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

కారుణ్య నియామకపత్రాలు అందజేత

గుంటూరు(తూర్పు), జూలై 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జేసీ ఏ భార్గవ్ తేజతో కలసి కారుణ్య నియామకాలకు సంబంధించి కే దినేష్, సాయి క్రిష్ణలకు రెవెన్యూ శాఖలో జూనియర్ కార్యాలయ అసిస్టెంట్లుగా నియామక ఉత్తర్వులను అందించారు. అభ్యర్థులు ఉద్యోగ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి అభ్యుదయ ఉద్యమానికి తీరని లోటు

గుంటూరు(తూర్పు), జూలై 21(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సీపీఎం అగ్ర నాయకుడు అచ్యుతానందన్ మృతి కేరళ రాష్ట్రానికి, దేశ అభ్యుదయ ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. బ్రాడీపేటలో ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో వీఎస్. అచ్యుతానందన్ సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు మాట్లాడుతూ కేరళ మతోన్మాద కార్పొరేట్ శక్తులకు, కాంగ్రెస్ పార్టీ అవకాశవాదానికి వ్యతిరేకంగా ఆయన రాజీలేని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సురేష్, నళినీకాంత్, ఈమని అప్పారావు. ఎన్ భావన్నారయణ, లక్ష్మణరావు, పద్మ, కళ్యాణి, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

5న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

గుంటూరు(తూర్పు), జూలై 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ వచ్చే నెల 5న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు తెలిపారు. బ్రాడీపేట పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాతమీటర్లకు.. స్మార్ట్‌మీటర్లకు బిల్లులో వ్యత్యాసం రాదని చెబుతున్న ప్రభుత్వం రు.25వేల కోట్లు వెచ్చించి స్మార్ట్ మీటర్లు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని నారా లోకేశ్ పిలుపునిచ్చారని, టీడీపీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హైకోర్టులో పిల్‌వేశారని గుర్తుచేసుకున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గత ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ట్రూఅప్, సర్దుబాటు చార్జీల విధానానికి స్వస్తి పలకాలన్నారు. సమావేశంలో వై.నేతాజీ, కే నళినీకాంత్, పాశం రామారావు, ఎన్.భావనారాయణ, ఈమని అప్పారావు, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

27న కేఎస్ జవహర్ అభినందన సభ

గుంటూరు(తూర్పు), జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీ కళాశాల ఆవరణలో ఈ నెల 27వ తేదీన ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శ్యామ్యూల్ జవహర్‌కు సన్మానసభ నిర్వహిస్తున్నట్టు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘ నాయకుడు మేడిద బాబురావు తెలిపారు. ఏసీ కళాశాలలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్సీలకు సమస్యలపై చైర్మన్ అర్జీలు స్వీకరిస్తారన్నారు. మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ సన్మాన సభలో ఎస్సీ, ఉద్యోగ సంఘాలు, దళితులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుక్కమళ్ళ సంజీవరావు, బత్తుల వీరాస్వామి, హనోక్ బెంజిమెన్, బత్తుల అనిల్, డేవిడ్ విలియమ్స్, వినయ్, కోటేశ్వరరావు, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల

గుంటూరు(తూర్పు), జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 4, 5వ తేదీల్లో జరిగే జిల్లా 26వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కొత్తపేటలో విలేకరుల సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించి వివరాలను వివరాలను వెల్లడించారు. 4న మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ స్టేడియం నుంచి గాంధీ పార్కు వరకు భారీ ర్యాలీ జరుగుతుందని అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. 5న మల్లయ్య లింగం భవన్‌లో ప్రతినిధుల సభను నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, పుప్పాల సత్యానారాయణ, పచ్చల శివాజీ, బందెల నాసర్‌జీ, రెంటాల కుమారి, జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే జన్మదిన వేడుకలు

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నూరు రోడ్డులోని కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. దేశంలో ఖర్గే నేతృత్వంలో ఇండియా కూటమితో సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎన్ఎస్‌యూఐ నాయకులున్నారు.

నేడు మెగా జాబ్ మేళా

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ సహకారంతో 22వ తేదీ మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉదయం 9.00నుంచి సాయంత్రం 5.00 వరకు బ్రాడీపేట 3వ లైన్ మాస్టర్‌మైండ్స్ క్యాంపస్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తారని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. ఈ జాబ్‌మేళాకు 24 కంపెనీలు రాబోతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మూస కవిత్వం.. తాత్కాలికం

గుంటూరు(తూర్పు) జూలై 21(ఆంధ్రజ్యోతి): మూస కవిత్వం ఎక్కువ కాలం మనుగడ సాగించదని సాహితీవేత్త డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. పాత గుంటూరు, బాలాజీ నగర్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కవిత్వంతో కాసేపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డా. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొత్తదనంతో రాసేందుకు కృషి చేయాలని కవులకు సూచించారు. మంచి కవిత్వం రాయాలంటే అధ్యయనం బాగా చేయాలన్నారు. అనంతరం డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు, గాంధీ, నానా, వశిష్ఠ సోమేపల్లి, విజయలక్ష్మి, బుర్రి కుమారరాజు, ఎస్.ఎం. సుభాని తమ స్వీయ కవితలతో పాటు సమకాలీన కవులు రాసిన కవితల్లో తమకు నచ్చిన కవితలను చదివి వినిపించారు.



కార్యక్రమంలో పాల్గొన్న కవులు, రచయితలు

సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 368 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ, డీఆర్వో

గుంటూరు(తూర్పు), జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీల శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 368 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవతేజ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌తో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, హౌసింగ్, డీఆర్డీఏ పీడీలు ప్రసాదు, విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ, డీఈవో రేణుక, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులు వేధిస్తున్నారు..

ఆర్టీసీలో అధికారులు రూల్స్‌ను పక్కనబెట్టి డ్యూటీలు కేటాయిస్తున్నారని గుంటూరు-2 డిపోలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ తోట వేణుగోపాలరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చార్ట్ డ్యూటీలలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఆరవై ఏళ్ల వయస్సులో తనకు నైట్ డ్యూటీలు కేటాయిస్తున్నాడని వాపోయాడు. అదేమని అడిగితే రిజిష్టర్‌లో అబ్సెంట్ వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని చెప్పారు.

వసతి గృహాన్ని తరలించవద్దు...

నగరంపాలెంలో ఉన్న ఎస్టీ విద్యార్థుల వసతిగృహాన్ని ఏటీ ఆగ్రహారం, 13వ లైనుకు మార్చాలనే అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. కళాశాలలకు వెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న వసతిగృహం సౌకర్యంగా ఉందని తెలిపారు. అధికారులు ఎంపిక చేసిన వసతిగృహంలో సరైన భద్రత లేదన్నారు.

వర్షాలకు ముందస్తు చర్యలు

● జీఎంసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు వర్షాల వలన ఏమైనా సమస్యలు ఎదురైతే తెలిపేందుకు జీఎంసిలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ 0863-2345103 ఏర్పాటు చేస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం శ్రీనగర్, పిఎస్. నగర్, బొంగరాలబీడు తదితర ప్రాంతాల్లో పర్యటించి, వర్ష ప్రభావం వలన ప్రజలకు ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన చర్యల పై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో ఎక్కడా నీరు నిల్వకుండా, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ బెయిల్ అవుట్ చేయడానికి తగిన మోటార్లతో సిద్దంగా ఉండాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తగినంత మంది పారిశుధ్య సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని, తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని, పురాతన భవనాల్లో నివాసం ఉండే వారికి నోటీసులు ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. పర్యటనలో డీఈఈ కల్యాణరావు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


వాకీటాకీతో అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

పీజీఆర్ఎస్ అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కారం

● అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా, ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. సోమవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్,డిప్యూటీ కమిషనర్ల చాంబర్లలో పీజీఆర్ఎస్ ను అదనపు కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 11 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ ద్వారా మొత్తం 19 ఫిర్యాదులు అందాయని తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, బీ శ్రీనివాసరావు, సీపీ రాంబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, ఎంహెచ్‌ఓ (ఇంచార్జి)లు రామారావు, సోమశేఖర్, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

వీధి వ్యాపారులు గుర్తింపుకార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారులు ప్రతి ఒక్కరూ నగర పాలక సంస్థ జారీ చేసే గుర్తింపు కార్డు కలిగి ఉండాలని, లేకుంటే వీధి వ్యాపారానికి అనుమతించబోమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కేటాయించిన గుర్తింపు కార్డ్ ల ప్రామాణికంతో వారు నిర్వహించే వ్యాపారాల మేరకు జీఎంసీ ఏర్పాటు చేయనున్న వెండింగ్ జోన్లలో స్థల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. నూతన గుర్తింపు కార్డ్ ల దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 25 వరకు నగర నగర పాలక సంస్థ ప్రధాన మరియు సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ని కమిషనర్ ఆదేశాల మేరకు ఉపా సెల్ పిఓ రామరావు పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు.

వైసీపీ నాయకురాలి మోసం

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ వైసీపీ నాయకురాలు తమను మోసం చేసిందని నగరంలోని కొత్తపేట పరిధిలోగల రామిరెడ్డి తోటకు చెందిన బాధితులు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. రామిరెడ్డితోట రెండో లైన్‌కి చెందిన జల్లి నాగదుర్గకు ఎదురింటిలో ఉండే మహిళ అక్క అయిన పెదకాకానిలో ఉండే వైసీపీ నాయకురాలు గుల్జార్ అలియాస్ గుల్లు పరిచయమైంది. తనకు రాజకీయ నాయకులు, పెద్దపెద్ద వ్యాపారులతో పరిచయాలు ఉన్నాయని, వారి ద్వారా తనకు తక్కువ ధరకే బంగారం వస్తుందని, అంతేగాక వేలంలో తక్కువ ధరకే బంగారం వస్తుందని, దానిని తక్కువ ధరకే విక్రయిస్తానంటూ మాయమాటలు చెప్పి తన నుంచి పది లక్షలు తీసుకుందన్నారు. అంతేగాక తన తమ్ముడు మోహన్ నరసింహ కృష్ణ వద్ద కూడా ఐదు లక్షలు తీసుకుందన్నారు. అంతేగాక తమ ఇంటి వద్ద ఉండే ప్రభుత్వ టీచర్ షేక్ హారీఫా వద్ద కూడా మరో 10 లక్షలు తీసుకుందన్నారు. ఈ విధంగా వివిధ ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని వసూళ్లకు పాల్పడిందన్నారు. బంగారం ఇవ్వకపోవడంతో తమ డబ్బు తమకు తిరిగి ఇవ్వాలని అడుగుతుంటే బెదిరిస్తోందన్నారు. గుల్జార్, ఆమె భర్తపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు.

రూ.16 లక్షలు అడ్వాన్స్ తీసుకొని బెదిరింపులు

ఇల్లు విక్రయిస్తామని తమ వద్ద నుంచి 16 లక్షలు డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా, ఇల్లు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని లాలాపేట చిన్న బజారు వెనుక ప్రాంతానికి చెందిన అంగన్వాడి టీచర్ షేక్ సర్తాజ్ బేగం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తాము నివాసం ఉంటున్న ఇంటిని రషీదా అల్ నూర్ షరీఫ్ అనే మహిళ తన ఇంటిని 30 లక్షలు విక్రయిస్తానని చెప్పడంతో మొదట లక్ష రూపాయలు బయానా, ఆ తర్వాత 15 లక్షలు అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ రాయించుకున్నామన్నారు. మిగిలిన 14 లక్షలు ఇస్తామని, రిజిస్ట్రేషన్ చేయమంటే కాలయాపన చేస్తూ వచ్చారన్నారు. ఈ లోగా ఇంటికి యజమాని చనిపోగా రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆమె కుటుంబ సభ్యులు నిరాకరిస్తున్నారన్నారు. ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ఆమె వాపోయారు.

ఇల్లు ఖాళీ చేయకుండా రౌడీషీటర్ బెదిరిస్తున్నాడు

తమకు విక్రయించిన ఇంటిని ఖాళీ చేయకుండా రౌడీ షీటర్ తాళ్ల కిషోర్ తమను వేరు ఇస్తున్నాడని రాజేంద్రనగర్‌కు చెందిన వట్టికూటి ఇందుమతి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. 2020లో గోరంట్లకు చెందిన తాళ్ల కిషోర్ కుమార్ వద్ద 255 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని తెలిపారు అయితే కొద్ది నెలల్లో ఇల్లు ఖాళీ చేసి వెళ్తానని మాయమాటలు చెప్పి అప్పటి నుంచి రౌడీషీటర్ కిషోర్ అదే ఇంట్లో నివాసం ఉంటున్నాడన్నారు. ఇల్లు ఖాళీ చేయమంటే చేయకపోగా రామారావు అనే వ్యక్తితో కలిసి తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి తమను బెదిరింపులకు పాల్పడుతున్నాడన్నారు ఇల్లు ఖాళీ చేయమంటే చంపేస్తానని బెదిరిస్తున్నాడన్నారు. అయితే రౌడీషీటర్‌ను ఖాళీ చేయించి, నా ఇల్లు నాకు అప్పగిస్తామని టిడిపి నాయకురాలు నందిని తమను సంప్రదించిందన్నారు. ఇందుకుగాను తమ వద్ద నుంచి మూడు లక్షలు తీసుకొని వెళ్ళిపోయిందన్నారు. ఇల్లు ఖాళీ చేయించకపోగా ఇంకా డబ్బులు ఇవ్వాలంటూ నందిని బెదిరిస్తుందని బాధితురాలు పేర్కొన్నారు.

కౌలుకు తీసుకున్న వ్యక్తి పొలం తనదేనని బెదిరిస్తున్నాడు..

తన భార్య కనమర్లపూడి మాధవి అపర్ణకు ఆమె తండ్రి లింగమల్లు మధుసూదన వెంకట సుబ్బారావు 2010లో రేపూడి పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో కొనుగోలు చేసిన ఆరెకరం పొలాన్ని తన భార్యకు 2011లో రిజిస్ట్రేషన్ చేశాడని లాలాపేట చౌత్రా సెంటర్‌కు చెందిన కనమర్లపూడి సత్యనారాయణ తెలిపారు. అప్పటినుంచి ఆ పొలాన్ని అదే గ్రామానికి చెందిన పెరుమాళ్ళపల్లి రాయప్పకు కౌలుకు ఇచ్చామన్నారు. అప్పటినుంచి ఆయన కౌలు చెల్లిస్తూ వచ్చాడన్నారు. అయితే గడిచిన రెండేళ్లుగా కౌలు ఇవ్వడం లేదని, అదేమని గట్టిగా అడిగితే పొలం తమదేనని బెదిరిస్తున్నాడు అన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో సుమేధా విద్యార్థిని ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఎం చంద్రశేఖరరెడ్డి తదితరులు

గుంటూరు (విద్య), జులై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్ 11, 13 (గర్ల్స్) సింగిల్, డబుల్స్ విభాగంలో సుమేధ స్కూల్ విద్యార్థిని సంకట సాయి అక్షర ప్రథమస్థానం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ ఎం చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం రాంబాబు, పీఈటీ కిరణ్ రెడ్డి, తల్లి దండ్రులు దుష్యంత్ రెడ్డి, ప్రశాంతి జయరామి రెడ్డి తదితరులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు

రోల్‌బాల్ మినీ స్టేట్ చాంపియన్‌షిప్‌లో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థులకు పతకాలు

గుంటూరు కార్పొరేషన్, జులై 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోల్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కాకినాడలో నిర్వహించిన 7వ రోల్‌బాల్ మినీస్టేట్ చాంపియన్‌షిప్ 2025-26 పోటీలలో శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో మనస్విని(2వ తరగతి), కార్తికేయ(4వ తరగతి) పసిడి పతకాలు, గణేష్(6వ తరగతి) వెండి పతకం సాధించినందుకు పాఠశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అభినందించారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, పాటిబండ్ల బాలాత్రిపుర సుందరి, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్‌జహాన్, టి.శ్రీదేవి, కె.హరిప్రియ పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి నూతన కార్యవర్గం సహకరించాలి

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర అభివృద్ధికి నూతన కార్యవర్గం సహకరించాలని, మీ సమస్యలు ఏమైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నగర మేయర్ కోవలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం నరెడ్కో కాపిటల్ జోన్ గుంటూరు అసోసియేషన్ నూతన కార్యవర్గం మేయర్ రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనేక సమస్యల పరిష్కారాలపై మేయర్ తో చర్చలు జరిపారు. సమావేశంలో నూతన అధ్యక్షుడు కె.సి.అంకారావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనాథ్, సెక్రటరీ యోగేశ్వరరావు, కార్యదర్శి మాదాల శ్రీనివాస్, ట్రెజరర్ చిన్న తిరుపతయ్య, నాయుడు శ్రీనివాస్ తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


మేయర్ రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నరెడ్కో నూతన కార్యవర్గం

బంగారు కుటుంబాల దత్తత

గుంటూరు కార్పొరేషన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీ 4 కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చిన నరెడ్కో కమిటీకి నగరపాలక సంస్థ నుండి ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నరెడ్కో గుంటూరు కమిటీ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో మేయర్, కమిషనర్, అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసులతో పీ4పై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్లు మాట్లాడుతూ గుంటూరు నగరంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరిన వెంటనే నరెడ్కో కమిటి సానుకూలంగా స్పందించిందన్నారు. సమావేశంలో నరెడ్కో గుంటూరు ప్రెసిడెంట్ అంకారావు, సెక్రెటరీ ఎం.శ్రీనివాస్, ట్రెజరర్ కె.చిన్న తిరుపతయ్య, కార్పొరేటర్లు ఈరంటి వర ప్రసాద్, షేక్ మీరావలి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

● ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్


వినతులు స్వీకరిస్తున్న ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల కార్యక్రమంలో బాధితుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వారి సమస్యల పరిష్కారానికి అక్కడిక్కడే సంబంధిత అధికారులకు ప్రభాకర్ ఫోన్ చేసి మాట్లాడారు. అన్యాయంగా వైసీపీ నాయకులు భూ ఆక్రమణలు చేశారని తమ వద్దకు వచ్చే బాధితులు వాపోయారని ఆయన తెలిపారు. బాధితులకు తగిన న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఉందని భరోసా కల్పించారు.

జగన్ జాతీయ స్థాయి నేరస్తుడు: కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): జగన్ జాతీయస్థాయి నేరస్తుడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం కుంభకోణంలో జగన్ ఏ విధంగా 3,500 కోట్ల అవినీతికి పాల్పడ్డాడో సామాన్య ప్రజల్లో సవివరమైన చర్చ జరగాలని ఆయన అన్నారు. నాసిరకం మద్యం తయారు చేసి, వేలాది మంది నిరుపేద మద్యం ప్రియుల మరణాలకు కారకుడైన జగన్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాల ఏర్పాటే ఓ కుట్ర అన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని వేలకోట్లు దోచుకున్నందుకే 16 నెలలు జైల్లో చిప్పకూడు తిన్నానన్న భయం కూడా లేకుండా మళ్ళీ వేల కోట్లు దోచుకోవటం చూసి న్యాయమూర్తులు సైతం విస్తుపోతున్నారన్నారు. తమ ప్రభుత్వం అరెస్టు చేసి ఆధారాలను వెతకదని, పూర్తిస్థాయి ఆధారాలు దొరికిన తర్వాతే అరెస్టులు చేస్తున్నారని స్పష్టంచేశారు. గత ఎన్నికల్లో ఓట్లు కొనేందుకు దోచుకున్న సొమ్మును అందుకున్న ప్రతి అభ్యర్థి కేసులో ముద్దాయిగా మారాతాడని అన్నారు. జగన్ ధన దాహానికి అత్యాశాపరులైన ఐఏఎస్, ఐపీఎస్‌లు పోటీ పడి మరీ జైళ్లకు వెళుతున్నారన్నారు. మద్యం, గనులు, ఇసుక దోపిడీకి పాల్పడ్డ జగన్‌ను అరెస్టు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఆ పార్టీకి చెందిన కొందరు మాజీ మంత్రులు మిధున్ రెడ్డిని వెనుకేసుకు రావటం సిగ్గు చేటన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.12 లక్షలు మోసం

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆన్లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ యువకుడిని నిండాముంచారు. అరండల్ పేట పోలీసుల కథనం మేరకు... కొరిటెపాడుకి చెందిన హరికృష్ణ సెల్ ఫోన్‌కు ఇటీవల ఓ లింక్ వచ్చింది. అందులో ట్రేడింగ్ యాప్ ఉండడంతో ఆయన అదే అప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకున్నాడు. దాని ద్వారా ఆన్లైన్ ట్రేడింగ్ ప్రారంభించాడు. తొలుత వెయ్యి రూపాయలతో ట్రేడింగ్ చేయగా కొంత మొత్తం లాభం వచ్చింది. ఆ తర్వాత రెండు వేలు, పది వేలు ఇలా వేలల్లో పెంచుకుంటూ వెళ్ళాడు. ఆయనకు అంతే మొత్తంలో లాభాలు వస్తున్నట్లుగా చూపించారు ఆ మొత్తం ఆన్లైన్లో కనిపిస్తూ ఉంది. ఈ విధంగా 12 లక్షల వరకు ట్రేడింగ్లో పెట్టుబడి పెట్టాడు. ఆయన పెద్ద మొత్తంలో లాభం వచ్చినట్లు చూపించారు. దీంతో తన డబ్బు తీసుకునేందుకు ప్రయత్నించగా రాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ కు ఫోన్ చేయగా వారు వెంటనే స్పందించి ఖాతాలో ఉన్న సుమారు లక్షా పది వేల వరకు ఫ్రీజ్ చేశారు. బాధితుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లపాడు రైల్వే స్టేషన్ వద్ద అతిథి గృహంలో వాచ్‌ఉమెన్‌గా పనిచేస్తున్న ఉప్పుతోళ్ల శివమ్మ(40) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్వర్ణభారతి నగర్‌కు చెందిన శివమ్మ కొద్ది సంవత్సరాలుగా అతిథి గృహంలో కుటుంబంతో సహా ఉంటుంది. ఆమెకు భర్త, పిల్లలు ఉన్నారు. పదేళ్ళుగా ఆమె మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. ఈనెల 20న రాత్రి కూడా మూర్ఛ రావడంతో ఆమెను జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె అదే రోజు రాత్రి మృతి చెందారు. మృతురాలి తల్లి ఓర్సు రమణమ్మ సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

గుంటూరు (తూర్పు), జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం అర్ధరాత్రితో ముగిశాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో అండర్ 11,13 విభాగాలలో వేణు బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు, ఇతర విభాగాల్లో నరసరావుపేట, తాడేపల్లి, చిలకలూరిపేటలకు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి రంగారావు, దామచర్ల శ్రీనివాసరావు విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలు జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వరావు, శ్రీమాన్, సతీష్‌చంద్ర, రాము, రమేష్, హరి, బాషా, శ్రీనివాసరావు, చందు, రాణి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ నూతన బ్రాంచ్ ప్రారంభం


ఎస్‌బీఐ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జీఎం శైలేష్‌కుమార్ తదితరులు

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో ఎస్‌బీఐ నూతన బ్రాంచ్‌ను ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకులోని వివిధ చాంబర్‌లతో పాటు ఏటీఎంను ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో జీఎం మాట్లాడుతూ ఈ శాఖ నగరంలో 43వ బ్రాంచ్ అన్నారు. ఇక్కడ లాకర్ సౌకర్యం కూడా ఉందన్నారు. బ్రాంచ్ మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ బ్రాంచ్ ప్రారంభంతో ఇన్నర్‌రింగ్ రోడ్డుతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు మరింత చేరువైనట్లయిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణకుమార్‌ప్రభు, రీజనల్ మేనేజర్ కిషోర్‌కుమార్, బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు జయకుమార్, బషీర్ అహ్మద్, కోటిరెడ్డి, నరేంద్ర, రంగసాయి, ప్రదీప్, వీరాంజనేయచౌదరి తదితరులున్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీని నియమించాలి

● స్టడీ సెంటర్ వద్ద విద్యార్థులు, ఉద్యోగుల ఆందోళన

గుంటూరు(విద్య), జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి ఉపకులపతిని తక్షణం నియమించాలని ఉద్యోగులు, విద్యార్థులు ఆందోళన చేశారు, సోమవారం జేకేసీ కళాశాల స్టడీ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులకు 7 నెలలుగా జీతాలు అందడం లేదన్నారు. మరోవైపు స్టడీ సెంటర్లో నిర్వహణ ఇబ్బందికరంగా మారిందని అడ్మిషన్లు ఆగిపోయే పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ గోపీచంద్, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పైనే శ్రద్ధ..!

● రసాయనాలు లేకుండా పండ్లు, కూరగాయల సాగు ● ఇంటికి సరిపడా ఆహారంతో పాటు.. శారీరక శ్రమ ● గ్రూపులుగా.. 250కి పైగా టెర్రస్ గార్డెన్స్

తెనాలి పట్టణంలో విస్తరిస్తున్న మిద్దె తోటలు



కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న పట్టణాల్లో ఇళ్ల దగ్గర కాస్తంత స్థలం కూడా కానరావడం లేదు. ఉన్న స్థలమంతా ఇంటి నిర్మాణానికే సరిపోతోంది. ఇక మొక్కలకు చోటు ఎక్కడుందని దిగులు పడే వారికి మిద్దె తోటలు దారి చూపుతున్నాయి. తెనాలి పట్టణంలో దాబాలపై గార్డెన్లు పెంచే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మిద్దె తోటలను 250 మందికి పైగా పెంచుతున్నారు.



టెర్రస్ గార్డెన్‌లో పెంచుకుంటున్న వివిధ రకాల మొక్కలు

తెనాలి అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దాబాలపై కుండీలు పెట్టి వాటిలో రకరకాల మొక్కలను పెంచుతున్నారు. ఇంటిలోకి కావాల్సిన కూరగాయలు, ఆకు కూరలు, పూలు, పండ్లు సమకూర్చుకుంటున్నారు. సేంద్రియ ఎరువుతోనే వీటిని పెంచుతూ.. శారీరక శ్రమ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

గ్రూపులుగా ఏర్పడి..

హైదరాబాద్‌లో 2015లో ప్రారంభమైన మిద్దె తోటల సాగు క్రమేణా అన్ని ప్రాంతాలకు విస్తరించింది. తెనాలి పట్టణంలోని రామలింగేశ్వర పేటకు చెందిన సూర్యదేవర కృష్ణదేవ్, మరికొంత మంది మిద్దె తోటలకు శ్రీకారం చుట్టారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ పేరిట గ్రూపులు ఏర్పాటు చేసుకుని.. ఒకరి అనుభవాలను మరొకరు పంచుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో చాలామంది ఏ పని లేకపోవడంతో మిద్దె తోటల పెంపకంపై దృష్టి సారించారు. పట్టణంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో మిద్దె తోటలు పెంచే వారందరూ గ్రూపులుగా ఏర్పడ్డారు. సుమారు 80 వేల మంది టెర్రస్ గార్డెన్ సాగు చేస్తున్నారు. ఆక్సిజన్ అధికంగా అందించే స్నేక్ ప్లాంట్, అగ్లోనిమా, పీస్ లిల్లీ, జేడ్ వంటి మొక్కలు, రెండేళ్లలో కాపునకు వచ్చే పండ్ల మొక్కలు జామ, మామిడి, చెరకు, అంజూరా, బార్బడో, సపోటా, ఇంటికి రోజు సరిపడా ఆకు కూరలు, బెండ, వంగ, చిక్కుడు వంటి కూరగాయల మొక్కలు సాగు చేస్తున్నారు.



మిద్దె తోటలో మొక్కలతో సూర్యదేవర కృష్ణదేవ్

రసాయనాలు లేకుండా..

మొక్కలను అంటుకట్టి వివిధ రకాల పద్ధతుల్లో నూతన మొక్కలను కూడా గ్రాఫ్టింగ్ చేస్తున్నారు. వీటికి వచ్చే తెగుళ్లను రసాయనిక మందులతో కాకుండా ఇళ్లలో ఉండే మజ్జిగ, వెల్లుల్లి పేస్ట్, ఇంగువ, పసుపుతో చేసిన ద్రావణాలు పిచికారీ చేసి తెగుళ్లు, పురుగులను అరికడుతున్నారు. రోజు గంట పాటు కేటాయించి శారీరక శ్రమ పొందుతున్న వీరికి మరో వ్యాయామం పని లేకుండా ఆరోగ్యం లభిస్తుంది. మొక్కల్లో మొదట వచ్చిన కాపును విత్తనాలుగా తీసి మరికొందరికి ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతిరోజు వారి ఇళ్లల్లో దిగుబడి వచ్చిన కూరగాయలు, ఆకు కూరలను వాట్సాప్ గ్రూపుల్లో ఇస్తున్నారు. ఇటీవల కడప పట్టణంలో మిద్దె తోటను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పరిశీలించి అన్ని ప్రాంతాల్లో ప్రోత్సహించాలని సూచించారు. మనం తినే ఆహారం అత్యంత నాణ్యంగా.. మన ఇంటిపైనే పండించుకోవచ్చని మిద్దె తోటల పెంపకందారులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులతో

పలు రైళ్ల రద్దు

● కొన్ని పాక్షిక రద్దు, దారి మళ్లింపు, క్రమబద్ధీకరణ

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి - దుగ్గిరాల - తెనాలి - చుండూరు రైల్వే సెక్షన్‌లో మూడో రైలుమార్గం ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులు కారణంగా ఈ నెలలో వారం, వచ్చే నెలలో రెండు వారాల పాటు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 23 నుంచి 29, ఆగస్టు 6 నుంచి 24వ తేదీ వరకు నంబరు. 67213 విజయవాడ - తెనాలి, 67214 తెనాలి - విజయవాడ, ఈ నెల 28, 29, ఆగస్టు 6 నుంచి 24వ తేదీ వరకు నంబరు. 67229 విజయవాడ - గుంటూరు, 67223 గఉంటూరు - రేపల్లె, 67224 రేపల్లె - తెనాలి, 67222 తెనాలి - విజయవాడ రైళ్లను రద్దు చేసినట్లు సీపీఆర్వో ఏ శ్రీధర్ సోమవారం తెలిపారు. ఆగస్టు 8 నుంచి 24వ తేదీ వరకు నంబరు. 67221 విజయవాడ - తెనాలి, 67231 తెనాలి - రేపల్లె, 67232 రేపల్లె - తెనాలి, 67233 తెనాలి - రేపల్లె, 67234 రేపల్లె - గుంటూరు, 67235 గుంటూరు - తెనాలి, 67237 తెనాలి - రేపల్లె రద్దు చేశామన్నారు. ఆగస్టు 9 నుంచి 25వ తేదీ వరకు 67238 రేపల్లె - మార్కాపురం, 67239 మార్కాపురం - తెనాలి, 67236 తెనాలి - గుంటూరు, 67230 గుంటూరు - విజయవాడ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు 67249 గుంటూరు రేపల్లె, 67250 రేపల్లె - గుంటూరు రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు.

రెండు రోజుల పాటు నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

ఆగస్టు 17, 18 తేదీల్లో నంబరు. 12733 తిరుపతి - లింగంపల్లి, ఆగస్టు 18, 19 తేదీల్లో 12734 లింగంపల్లి - తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేశామన్నారు. అలానే నంబరు. 22708 తిరుపతి - విశాఖపట్టణం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 13, 15, 17, నంబరు. 22707 విశాఖపట్టణం - తిరుపతి డబుల్ డెక్కర్‌ని ఆగస్టు 14, 16, 18 తేదీల్లో రద్దు చేశామన్నారు.

రేపల్లె, డెల్టా ఎక్స్‌ప్రెస్‌ల పాక్షిక రద్దు

నంబరు. 17625 కాచీగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 11 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు వరకే నడిపి గుంటూరు - రేపల్లె మధ్యన రద్దు చేస్తున్నారు. ఈ కారణంగా నంబరు. 17626 రేపల్లె - వికారాబాద్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు రేపల్లె నుంచి కాకుండా గుంటూరు నుంచి వికారాబాద్‌కు బయలుదేరుతుంది. అలానే నంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 12 నుంచి 19వ తేదీ మధ్యన రేపల్లె నుంచి కాకుండా గుంటూరు నుంచి బయలుదేరుతుంది. నంబరు. 17645 చర్లపల్లి - రేపల్లె ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు వరకే ప్రయాణించి ఆగిపోతుందన్నారు.

51 రైళ్లు న్యూగుంటూరు మీదగా మళ్లింపు

విజయవాడ - తెనాలి మార్గంలో ప్రయాణించే 51 రైళ్లను న్యూగుంటూరు రైల్వేస్టేషన్ మీదగా మళ్లించనున్నట్లు సీపీఆర్వో తెలిపారు. కృష్ణాకెనాల్ - న్యూగుంటూరు మీదగా తెనాలికి మళ్లించి అక్కడి నుంచి రెగ్యులర్ రూట్‌లో నడుపుతామన్నారు. అలానే చెన్నై వైపు నుంచి వచ్చే రైళ్లను తెనాలి నుంచి న్యూగుంటూరు, కృష్ణాకెనాల్ మీదగా విజయవాడకు మళ్లిస్తామన్నారు.

వందేభారత్, జన్మభూమి మంగళగిరి మీదగా మళ్లింపు

నంబరు. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి, నంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 9 నుంచి 19వ తేదీ మధ్యన మంగళగిరి మీదగా మళ్లించనున్నట్లు సీపీఆర్వో పేర్కొన్నారు. నంబరు. 20702 తిరుపతి - సికింద్రాబాద్, నంబరు. 20701 సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 17, 18 తేదీల్లో మంగళగిరి మార్గంలో మళ్లిస్తామన్నారు. రంబకె, 17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్‌ని తెనాలి నుంచి విజయవాడ, కాజీపేట, పగిడిపల్లి మీదగా సికింద్రాబాద్‌కు మళ్లిస్తామన్నారు. ఆగస్టు 18వ తేదీన నంబరు. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్‌ని పగిడిపల్లి నుంచి కాజీపేట, విజయవాడ, తెనాలి మీదగా దారి మళ్లించి నడుపుతామన్నారు. నంబరు. 16032 కాత్రా - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 16న విజయవాడ - తెనాలి మీదగా, నంబరు. 16031 చెన్నై సెంట్రల్ - కాత్రా రైలుని ఆగస్టు 17న తెనాలి - విజయవాడ మీదగా మళ్లిస్తామన్నారు. నంబరు. 12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ, నంబరు. 12078 విజయవాడ - చెన్నై సెంట్రల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 13 నుంచి 18వ తేదీ వరకు న్యూగుంటూరు మీదగా కాకుండా కృష్ణా కెనాల్ నుంచి నేరుగా తెనాలి మార్గంలో నడపడం జరుగుతుందన్నారు. నంబరు. 12603 చెన్నై సెంట్రల్ - చర్లపల్లి చెన్నై ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 17, 18, 19 తేదీల్లో, నంబరు. 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 18, 19, 20 తేదీల్లో కాజీపేట మార్గంలో మళ్లిస్తామన్నారు. నంబరు. 07193 హైదరాబాద్ - కొల్లం స్పెషల్ రైలుని ఆగస్టు 9, 16, నంబరు. 07194 కొల్లం - హైద రాబాద్ స్పెషల్‌ని ఆగస్టు 11, 18 తేదీల్లో కాజీపేట మార్గంలో మళ్లిస్తామన్నారు. నంబరు. 16093 చెన్నై సెంట్రల్ - లక్నో అండమాన్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 19వ తేదీన 180 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు.

కడలి గర్భశోకం

- కలుషితమవుతున్న సముద్ర జలాలు
- మృత్యువాత పడుతున్న తాబేళ్లు, డాల్ఫిన్లు
- కాలుష్య కోరల్లో తీర ప్రాంతాలు
- పర్యావరణ పరిక్షణను పట్టించుకోని అధికారులు





లంకెవానిదిబ్బ సముద్రసమీపంలో మృత్యువాతపడ్డ తాబేలు

రేపల్లె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి. దీంతో జీవరాశులు అంతరించి పోవడమేగాక తీర ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుపోతోంది. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలగడంతో తాబేళ్లు, డాల్ఫిన్స్ మృతి చెందుతున్నాయి. రేపల్లె మండలంలోని లంకెవానిదిబ్బ, ఏలిచెట్లదిబ్బ తీర ప్రాంతాలకు మృతి చెందిన తాబేళ్లు, డాల్ఫి న్స్ కొట్టుకురావడంలో ఆందోళన కలిగిస్తోంది.

వ్యర్థాలతో అనర్థం..

ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలను సముద్రం లోకి వదిలేయడంతో జలాలు కలుషితమై.. జీవరాశులు చనిపోతున్నాయి. సముద్ర జలా లు, పర్యావరణాన్ని పరిరక్షించే అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ఇక్కడ నది, సముద్రం కలిసే ప్రాంతం కావడంతో ఎక్కు వగా డాల్ఫిన్‌లు ఉన్నాయి. సుమారు రెండు టన్నుల బరువు ఉండే డాల్ఫిన్ చేపలు మృతి చెంది ఒడ్డుకు వస్తున్నాయి. వీటిని వేటను మత్స్యశాఖ నిషేధించింది. కృష్ణా జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో కేర్న్ ఇండియా, రిలయన్స్ సంస్థలు ఆయిల్ కోసం తవ్వకాలు జరుపుతున్నాయి. దీంతో క్రూడ్ ఆయిల్ తెట్టలు తెట్టలుగా సముంద్రంలో కలుస్తోంది. దీంతో సముద్ర జలాలు కలుషితమై చేపలు, తాబేళ్లు, డాల్ఫిన్స్ మృతి చెందుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. ఇప్పటికైనా దీనిపై అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



లంకెవానిదిబ్బ సముద్రం ఒడ్డుకు కొట్టుకువచ్చిన మృతిచెందిన డాల్ఫిన్

తాబేళ్లతో సముద్ర జలాల శుద్ధి

ఆలివ్‌రెడ్‌లే తాబేళ్లు పాచి, మొక్కలు, వివిధ రకాల వ్యర్థ పదార్థాలను తింటూ సముద్ర జీవులకు ఉపకారం చేస్తాయి. సముద్రంలో ఆక్సిజన్‌ను పెంచేందుకు దోహద పడతాయి.

- అడ్డదిడ్డంగా ఉన్న నాచును తినడం వల్ల.. నాచు ఒక బెడ్‌లా ఏర్పడుతుంది. సముద్రం లోని జీవరాశులు ఈ బెడ్‌లో గుడ్లు పెట్టి సంతాన ఉత్పత్తిని పెంచుకునేందుకు ఉపయోగపడుతుంది.
- తాబేళ్లు గుడ్లు పెట్టే సమయంలో ఒక రకమైన జల్ విడుదల చేస్తాయి. ఆ జల్ భూమిలో బంకలా అతుక్కుపోయి తీర ప్రాంతం కోతలకు గురి కాకుండా నివారణకు ఉపయోగపడుతుంది. ఒక్కో తాబేలు మూడు నుంచి ఐదు కేజీల జెల్ వస్తుంది.
- తక్కువగా శ్వాస తీసుకోవడం వల్ల ఆలివ్‌రెడ్‌లే తాబేళ్లు 300 నుంచి 400 సంవత్సరాల వరకు జీవించగలుగుతాయి. సముద్ర జలాలు శుద్ధి చేయడం వల్ల తీర ప్రాంతంలో నివశించే ప్రజలు గాలిపాటుకు అంటువ్యాధుల బారిన పడకుండా ఉపయోగపడుతుంది.
- తాబేళ్లను చంపినా, గుడ్లను తిన్నా భారత వన్యప్రాణి చట్టం 1972 కింద నేరంగా పరిగణిస్తారు.

అమ్మ, నాన్న.. ఓ నకిలీ దత్త పుత్రిక!

● ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌తో ఆస్తి కొట్టేసే ప్రయత్నం? ● రెవెన్యూ అధికారులకు బాధితుడి ఫిర్యాదు



తెనాలి తహసీల్దార్‌కు తన ఆవేదనను వివరిస్తున్న బాధితుడు ఉమామహేశ్వరరావు

తెనాలి, జూలై 21, (ఆంధ్రజ్యోతి): సంతానం లేకపోయినా.. ఆయన ఆస్తికి వారసురాలిని చేశారు. తన భార్య కానీ, తాను కాని ఎవరినీ దత్తత తీసుకోపోయినా.. తమకు ఓ దత్తత కుమార్తె ఉందని రెవెన్యూ అధికారులు ధ్రువపత్రం సృష్టించారని.. తన యావదాస్తిపై సర్వ హక్కులు కల్పిస్తూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా ఇచ్చేశారని ఓ వ్యక్తి సోమవారం రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు.. గుంటూరు కలెక్టర్‌లో తెనాలి తహసీల్దార్‌కు అర్జీలు అందజేశారు. ఫిర్యాదు దారు చెప్పిన మేరకు.. చేబ్రోలు మండలం వేజండ్లకు చెందిన నన్నపనేని లక్ష్మీ నాగేంద్రం అనే మహిళను వెలగా ఉమామహేశ్వరరావు 1991లో రెండో వివాహం చేసుకున్నారు. అదే గ్రామంలో కలసి ఉంటున్నారు. లక్ష్మీ నాగేంద్రం 2021లో మరణించారు. వారికి సంతానం లేరు. ఆమె చనిపోయాక ఒక మహిళ తన భార్య మొదటి భర్త ఉన్న సమయంలో ఆమెను దత్తత తీసుకున్నారని.. నకిలీ ధ్రువపత్రాన్ని సృష్టించిందని బాధితుడు వాపోయాడు. దాని ద్వారా ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కుటుంబం ఉండేది చేబ్రోలు మండలంలో అయితే.. తెనాలిలో ఎందుకు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ ఇచ్చారని ప్రశ్నను లేవనెత్తారు. పైగా సర్టిఫికెట్‌లో తన పేరును అసలు ప్రస్తావించకుండా.. ఆమె ఒక్కరి పేరుపై సర్టిఫికెట్ ఎలా ఇస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. తెనాలిలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్న మహిళ.. ఆమెతో ముందే బేరం మాట్లాడుకుని సర్టిఫికెట్ పొందారనే అనుమానం వ్యక్తం చేశారు. లేకపోతే వేజండ్లకు చెందిన కుటుంబానికి.. తెనాలిలో ఏ విచారణ లేకుండా సర్టిఫికెట్ ఎలా మంజూరు చేస్తారని నిలదీశారు. తన ఆధార్, తన భార్య ఆధార్ వేజెండ్ల అడ్రస్‌లోనే ఉన్నాయని, అన్ని ఆధారాలు చేబ్రోలు మండలంలో ఉంటే, తెనాలిలో ఇచ్చిన సర్టిఫికెట్ ఎట్లా చెల్లుబాటవుతుందనేది అతని సందేహం. దీనిపై పూర్తి విచారణ జరిపించాలని, అప్పటి ఇన్‌ఛార్జ్ తహసీల్దార్‌కు రూ.లక్షల్లో లంచం ముట్టిందనే ఆరోపణలు చేశారు. దీనిపై పూర్తి విచారణ జరిపించాలని కోరారు. దత్తత పేరుతో కొందరు తన భార్య ఆస్తిని కొట్టేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ వివరణ కోరగా.. ఇటీవలే కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన పెట్టుకున్న అర్జీ వచ్చిందని, మరోసారి తమ కార్యాలయంలోనూ అందించారని తెలిపారు. దీనిపై ఇప్పటికే విచారణ చేస్తున్నామని, త్వరలో విచారించి అసలు విషయం తెలుస్తామన్నారు.

విద్యార్థినులు ఆపద సమయంలో...

112 లేదా 1098కి కాల్ చేయండి

మహిళా స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఆపద సమయంలో 112 లేదా 1098కి కాల్ చేసి రక్షణ పొందాలని మహిళా స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లచెరువు మహావీర్ కాలేజీలో విద్యార్థినులకు మహిళా భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ మీ సంరక్షణే మా సంకల్పం అనే నినాదంతో ముందుకు వెళుతోందన్నారు. మహిళల భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా విద్యార్థినుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, పోలీస్ శక్తి బృందాల సభ్యులు పాల్గొని, బాలికలపై నేరాలు, వాటి నివారణ, సంభవించిన పక్షంలో స్పందించాల్సిన తక్షణ చర్యలు, "గుడ్ టచ్ - బ్యాడ్ టచ్" వంటి కీలక అంశాలపై విద్యార్థినులకు వివరంగా అవగాహన కల్పించారు. అలాగే సైబర్ మోసాలు, వేధింపులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో లాలాపేట సీఐ శివ ప్రసాద్, మహిళా స్టేషన్ సీఐ నారాయణ, మహిళా ఎస్సై ప్రమీల, బేబీరాణి, కుమారి, శక్తి బృందాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

సాంస్కృతిక వికాసానికి

పునరంకితం కావాలి

సినీ రంగస్థల నటుడు, దర్శకుడు కేఎస్‌టీ సాయి

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతికళాకారుడు సాంస్కృతిక వికాసానికి పునరంకితం కావాలని సినీ రంగ స్థల నటులు, దర్శకులు కేఎస్‌టీ సాయి పిలుపునిచ్చారు. పట్టణంలోని జీఎస్ఎన్ టవర్స్ నందు సోమవారం బాపట్ల జిల్లా రచయితల సంఘం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో సాయి మాట్లాడుతూ సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ఉభయ తెలుగురాష్ట్రాలకే తలమానికమైన బాపట్ల సాంస్కృతిక రంగ పునర్ వైభవానికి కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళాకారులకు జన్మనివ్వటమేకాక పలువురికి ప్రేరణ ఇచ్చి వారిని ఉత్తమకళాకారులుగా తీర్చిదిద్దిన రంగస్థల కళాశాలగా బాపట్లకు దేశ,విదేశాలలో చిరస్మరణీయమైన పేరు ఉందన్నారు. యువకళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుదీర్ఘమైన తన రంగస్థల అనుభవాలను కళాకారులతో ఆయన పంచుకున్నారు. కార్యక్రమానికి రచయిత తిమ్మర శ్యామ్‌సుందర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పెనుమెత్స నాగరాజు, గుండ్రెడ్డి సత్యనారాయణ, ఆకురాతి మురళీకృష్ణ, అంబటి మురళీకృష్ణ, నందిరాజు విజయ్‌కుమార్, సీతారాం, కళ్ళంహరినాథరెడ్డి, సుబ్రహ్మణ్యం, బురుగుల సంగమేశ్వరశాస్త్రి,జీ శాంతారాం, డబ్ల్యుఎజికె.మూర్తి, షేక్.బాబావలి తదితరులు పాల్గొని బాపట్లకు చెందిన సాహిత్య, సామాజిక సంస్థలు గురించి వివరించారు.అనంతరం కేఎస్‌టీ సాయిని ఘనంగా సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్‌టీ సాయి

సమగ్ర భూసార రక్షణ ఎంతో ముఖ్యం

కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు, 21 జూలై(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో సమగ్ర భూసార సంరక్షణ ఎంతో ముఖ్యమని గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ఇందుకు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు (బయో ఫెర్టిలైజర్స్) ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నా యన్నారు. జీవన ఎరువుల వాడకం, నిరంతరం ఆదాయం వచ్చే పంటల విధానం, వరి ఏ గ్రేడ్ నమూ నాలపై వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్ల ను జిల్లా కలెక్టర్, జేసీ ఎ.భార్గవ్ తేజతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మంది రంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకు మారి, డీఆర్వో ఎన్.ఎస్.కే.స్ ఖాజావలి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర రావు పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ పొడి రూపంలో లభ్యమవుతున్న జీవన ఎరువుల కన్నా ద్రవ రూపంలో జీవన ఎరువులు ఎక్కువ కాలం నిల్వ ఉండి.. మెరుగ్గా పనిచేస్తాయన్నారు. జీవన ఎరువులు లాంఫాంలోని ఏరువాక కేంద్రం, అమరావతిలోని జీవన ఎరువుల పరిశోధన కేంద్రంలో లభ్యమవుతాయని తెలిపారు. జడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జీవన ఎరువులు వాడకంపై వ్యవసాయ శాఖ రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

వ్యాధి నిర్ధారణ



పొట్ట నొప్పి పని పట్టేలా...

పొట్టలో నొప్పికి పలు కారణాలు. వాటిలో కొన్ని స్వల్పమైనవి కావచ్చు, కొన్ని తీవ్రమైనవీ కావచ్చు. జీర్ణాశయం, పెద్ద, చిన్న పేగులు, పిత్తాశయం, క్లోమం... ఇలా పలు అవయవాలు కిక్కిరిసి ఉండే పొట్టలో నొప్పి తలెత్తితే, అందుకు అసలు కారణాలను ఆరా తీయడం అవసరం అంటున్నారు వైద్యులు.

పొట్టలో పలు చోట్ల నొప్పి తలెత్త వచ్చు. ఎగువ పొట్ట, కింది పొట్ట, కుడి, ఎడమ డొక్కల్లో, పొత్తికడుపు... ఇలా పొట్టలో నొప్పి తలెత్తే ప్రదేశాన్ని బట్టి ఆ నొప్పికి అసలు కారణాలను వైద్యులు అంచనా వేయగలుగుతారు. కొన్నిసార్లు పొట్టలో తలెత్తే నొప్పి వెన్నులోకి పాకవచ్చు. ఇంకొన్ని సందరాల్లో నొప్పి వచ్చిపోతూ ఉండొచ్చు. క్రమేపీ పెరిగిపోవచ్చు. పొడిచినట్టు, పిండినట్టు, మెలి పెట్టినట్టు... ఇలా భిన్నమైన లక్షణాలతో బాధిస్తూ ఉండవచ్చు. నొప్పికి అదనపు లక్షణాలు తోడవవచ్చు. అయితే అన్నిటికంటే ముందు, నొప్పితో ముడిపడి ఉండే ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన ఏర్పరుచుకోవడం ఎంతో అవసరం.

కారణాలు పలు రకాలు

అసిడిటీ: కడుపులో ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవడం వల్ల, ఆహారం తిన్న వెంటనే, పైపొట్టలో మంట, నొప్పి మొదలవుతుంది


పిత్తాశయంలో రాళ్లు: ఈ సమస్యతో తలెత్తే నొప్పి పైపొట్టలో కుడివైపున వేధిస్తుంది. తిన్న వెంటనే నొప్పి తలెత్తుతూ ఉంటుంది.

మూత్రపిండాల్లో రాళ్లు: కుడి, ఎడమ డొక్కలో ఒకేసారి తీవ్రమైన నొప్పి మొదలవుతుంది. తెరలు తెరలుగా వచ్చిపోతూ, క్రమేపీ తీవ్రత పెరుగుతూ ఉంటుంది. వాంతి, జ్వరం కూడా మొదలవుతాయి

ప్యాంక్రియటైటిస్: పైపొట్టలో వచ్చే నొప్పి వెన్ను వైపు పాకుతూ ఉంటుంది

కండరం చిరిగితే?

కొందరికి విశ్రాంత స్థితిలో ఎలాంటి నొప్పి లేకపోయినా, కదిలేటప్పుడు పొట్టలో నొప్పి వేధించవచ్చు. వెన్నుపూసల్లో సమస్యలు, కండరాల సమస్యలే ఇలాంటి నొప్పికి కారణాలు. కొందరికి బరువులు ఎత్తే సమయంలో పొట్టలో నొప్పి తలెత్తవచ్చు. కండరం చిరిగిన సందర్భాల్లో ఈ నొప్పి తలెత్తుతుంది. ఇదే చీలిక పెద్దదైతే అది హెర్నియాకు దారి తీస్తుంది. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు.



హెర్నియా: పొట్ట, పొత్తి కడుపు దగ్గర ఉబ్బెత్తుగా ఉండి, నొప్పి వేధిస్తే, హెర్నియాగా భావించాలి. అంతర్గత చర్మపు పొరలు పలుచబడడం వల్ల పేగులు ఆ జాగాలోకి చొరబడే సమస్యే 'హెర్నియా'. ప్రధానంగా బొడ్డు దగ్గర, పురుషుల్లో గజ్జల్లో హెర్నియా కనిపిస్తూ ఉంటుంది. సర్జరీలు జరగడం, పెద్ద వయసు హెర్నియాకు ప్రధాన కారణాలు

పేగులు అతుక్కుపోవడం: పలు సర్జరీల ఫలితంగా కొన్ని సందర్భాల్లో పేగులు అతుక్కుపోతాయి. ఈ సమస్యలో కూడా పొట్ట నొప్పి ఉంటుంది

అపెండిసైటిస్: బొడ్డు దగ్గర, పొత్తికడుపు దగ్గర తట్టుకోలేనంత నొప్పి వేధిస్తుంది. ఈ నొప్పి నెమ్మదిగా మొదలై క్రమేపీ తీవ్రమవుతుంది. మొదట పొట్ట ఉబ్బరంతో మొదలవుతుంది. బొడ్డు దగ్గర బిగుతుగా ఉన్న భావన కలుగుతుంది. ఆ తర్వాత నొప్పి పొట్టలో కుడివైపుకు పాకుతుంది. వాంతి అవుతున్న భావన కూడా కలుగుతుంది

గుండెపోటు: కొందర్లో పొట్టనొప్పి గుండెపోటుకు సూచన. పైపొట్టలో నొప్పితో పాటు, ఆయాసం, చమటలు పడితే గుండెపోటుగా భావించి సత్వరం వైద్యులను కలవాలి. ప్రత్యేకించి ముందు నుంచి గుండె సమస్యలున్నవారు, అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవాళ్లు, అధిక కొలెస్ట్రాల్ ఉన్న వాళ్లు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి

ఎప్పుడు తీవ్రంగా పరిగణించాలి?

పొట్టనొప్పి తలెత్తితే వైద్యుల దగ్గరకు పరుగులు పెట్టే వాళ్లు చాలా తక్కువ. చేతికి అందిన నొప్పి నివారణ మాత్రలు లేదా యాంటాసిడ్ మాత్రలు వేసేసుకుని, విశ్రాంతి తీసుకుంటారే తప్ప, నొప్పిని తీవ్రంగా పరిగణించరు. అయితే పొట్ట నొప్పిని తీవ్రంగా పరిగణించవలసిన సందర్భాలు కూడా ఉంటాయి. అవేంటంటే...

- గంటకు మించి కొనసాగినా
- ఒకే ప్రదేశానికి పరిమితమైనా
- తాకినప్పుడు నొప్పి పెరుగుతున్నా
- వాపు, ఉబ్బు కనిపించినా
- వాంతులు అవుతున్నా
- విరోచనం ఆగిపోయినా, నీళ్ల విరోచనాలు అవుతున్నా
- పొట్ట ఉబ్బరించినా
- నొప్పితో పాటు వాంతి, జ్వరం మొదలైనా

నొప్పి తలెత్తే ప్రదేశంతో పాటు అదనపు లక్షణాల ఆధారంగా వైద్యులు అసలు సమస్యను అంచనా వేయగలుగుతారు. సమస్యను కచ్చితంగా గుర్తించడంలో స్కానింగ్ సహాయపడుతుంది.

డాక్టర్ ఎమ్.ఎన్. పవన్ కుమార్
సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ, హైదరాబాద్



ఈ మందులు చెత్తబుట్టలో వేయొద్దు

కాలం చెల్లిన కొన్ని మందులను చెత్తబుట్టలో పారేయడం ప్రమాదకరమని కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ చెబుతోంది. నొప్పి, ఆందోళన మొదలైన సమస్యలకు వాడే ట్రమడాల్, టాపెంటడాల్, డైజిపామ్, ఆక్సికోడోన్, ఫెంటానిల్ వంటి 17 రకాల మందులు ఎంతో ప్రభావంతమైనవని ఔషధ నియంత్రణ సంస్థ వెల్లడించింది.



వైద్యులు సూచించిన రోగులు మినహా వాటిని ఎవరు తీసుకున్నా, తీవ్రమైన ప్రభావాన్ని కనబరుస్తాయనీ, ప్రాణాలకు కూడా ప్రమాదం ఉంటుందనీ, కొన్నిసార్లు ఒక్క డోసు తీసుకున్నా ప్రాణాలు పోయే అవకాశాలు ఉంటాయిని ఔషధ నియంత్రణ సంస్థ హెచ్చరిస్తోంది. అలాంటి ఆ మందులు మిగిలిపోయినా, కాలం చెల్లినా, లేదా లేబుల్ చిరిగిపోయినా చెత్తబుట్టలో పారేయవద్దని సూచిస్తోంది. అలా పారేస్తే, వాటిని పొరపాటున చిన్న పిల్లలు, పారిశుధ్య కార్మికులు, జంతువులు తినే ప్రమాదం ఉందని తెలిపింది. ఆ మందులు జంతువులు తాగే నీటిలో కలిసే ప్రమాదం కూడా లేకపోలేదని వివరించింది. చెత్తలోకి చేరిన ఆ మందులు అక్రమార్కుల చేతిల్లోకి చేరుకుంటే అవి దుర్వినియోగం అవడం లేదా మళ్లీ మార్కెట్‌లోకి చేరుకునేప్రమాదం ఉందని హెచ్చరించింది. అందుకే ఆ మందులను టాయిలెట్‌లో వేసి ఫ్లష్ చేయాలని సూచించింది.

మీకు తెలుసా?

గుండెపోటుకు ముందు...

గుండెపోటుతో అకస్మాత్తుగా కుప్పకూలిపోతున్న వాళ్లను చూస్తున్నాం! నిజంగానే గుండెపోటు అకస్మాత్తుగా తలెత్తుతూ ఉంటుందా? ముందస్తు లక్షణాలేవీ లేకుండానే ప్రాణాలను హరిస్తుందా? వాస్తవమేంటో తెలుసుకుందాం!



గుండెపోటుకు కొన్ని రోజులు, వారాల ముందు కొన్ని లక్షణాలు బయల్పడుతూ ఉంటాయి. వాటిని సకాలంలో గుర్తించి, అప్రమత్తం కాగలిగితే గుండెపోటుకు గురికాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు అంటున్నారు ప్రముఖ కార్డియాలజిస్ట్, మొనిసోలా అడానిజో. ఆ లక్షణాలు ఏవంటే..

ఛాతీలో నొప్పి, అసౌకర్యం: నొక్కినట్టు, బరువుగా ఉన్నట్టు అనిపించడం, ఛాతీలో మంట. ఈ లక్షణాలు ఛాతీ మధ్యలో లేదా ఎడమ వైపున కనిపించవచ్చు. లక్షణాలు వచ్చి పోతూ ఉండవచ్చు.

ఇతరత్రా నొప్పులు: గుండె సమస్య ఛాతీకే పరిమితం కావాలనే నియమమేమీ లేదు. వెన్ను, మెడ, దవడ, పైపొట్ట... ఈ శరీర భాగాల్లో కూడా నొప్పి రూపంలో బయల్పడవచ్చు.

శ్వాస ఇబ్బంది: గుండె జబ్బులు ఆక్సిజన్ ప్రవాహాన్ని తగ్గించి, శ్వాసను కష్టతరం చేస్తాయి. కాబట్టి నెమ్మదిగా మెట్లు ఎక్కుతున్నప్పుడు, లేదా పడుకుని ఉన్నప్పుడు శ్వాస ఇబ్బందికరంగా మారితే అప్రమత్తం కావాలి.

చమటలు: చల్లని గదిలో ఉన్నా, పడుకుని ఉన్నా అకస్మాత్తుగా చమటలు పట్టేస్తుంటే, వెంటనే గుండె వైద్యులను కలవాలి.

తలతిరుగుడు: గుండెపోటుకు ముందు తలతిరుగుడు, అజీర్తి, ఛాతీలో మంట, వాంతులు లాంటి లక్షణాలను ఎంతోమంది ఎదుర్కొంటూ ఉంటారు. కాబట్టి పొట్టలో అసౌకర్యాలకు ఛాతీలో ఇబ్బంది, నిస్సత్తువ, చమటలు కూడా తోడైతే వెంటనే వైద్యులను కలవాలి.

నిస్సత్తువ: ఎలాంటి శారీరక శ్రమకు లోను అవకపోయినా, ఉన్నట్టుండి నిస్సత్తువ ఆవరిస్తున్నా, చిన్నపాటి పనికే విపరీతంగా అలసట ఆవరిస్తున్నా గుండెలో సమస్య తలెత్తుతోందని అర్థం.

పరిశోధన

డిప్రెషన్ మందులతో నాడీ సంబంధ ముప్పు

కుంగుబాటు, ఆందోళన, నిద్ర సమస్యలకు వాడే మందుల వలన ప్రాణాంతక నాడీ సంబంధిత వ్యాధి, అమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ (ఎఎల్ఎస్) బారిన పడే ప్రమాదం ఉందని ఓ తాజా అధ్యయనంలో తేలింది. ఆ అధ్యయన వివరాలివీ..

ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ గురించి అందరికీ తెలుసు. ఆయన 21 ఏళ్ల వయసులో కండరాలకు సంబంధించిన అమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ వ్యాధికి గురై చక్రాల కుర్చీకే పరిమితమైపోయారు.



స్టీఫెన్ హాకింగ్‌ను వేధించిన ఇదే వ్యాధి మానసిక రుగ్మత మందుల వల్ల కూడా తలెత్తే ప్రమాదం ఉందనే ఒక అధ్యయనం జామా న్యూరాలజీలో ప్రచురితమైంది. డిప్రెషన్, ఆందోళన నిద్ర మాత్రల వలన ఎఎల్ఎస్ వచ్చే ప్రమాదముందని స్వీడన్ పరిశోధకులు ఆ అధ్యయనంలో వెల్లడించారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా వెయ్యి మంది పైగా ఏఎల్ఎస్ రోగులు, అయిదు వేలమందిపైగా ఆరోగ్యవంతుల సమాచారాన్ని పరిశోధకులు విశ్లేషించారు. మానసిక వ్యాధుల మందులు వాడిన వారు తర్వాతి కాలంలో ఎఎల్ఎస్ బారిన పడినట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ కోవకు చెందిన వారిలో ఎఎల్ఎస్ నిర్ధారణ కూడా ఆలస్యమవుతోందని, దాంతో కోలుకునే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని తెలుసుకున్నారు. ఎఎల్ఎస్ ప్రారంభ దశలోనూ ఆందోళన, నిద్రలేమి, డిప్రెషన్ లక్షణాలు ఉంటాయని దర్మశిల నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ పాండు రంగ తెలిపారు. ఈ మందుల వలన ఎఎల్ఎస్ వస్తుందనే కచ్చితమైన రుజువు లేనప్పటికీ, నాడీ సంబంధిత వ్యాధుల లక్షణాలు ఉన్నవారికి ఈ మందులు సూచించేటప్పుడు వైద్యులు ఒక సారి ఆలోచించాలని సర్ గంగా రామ్ హాస్పిటర్ వైస్ చైర్‌పర్సన్, డాక్టర్ అన్షు రోహత్గి అభిప్రాయపడుతున్నారు.

అలవాట్లు - పొరపాట్లు

ఆహార కోరికలకు కళ్లెం వేద్దాం

కొన్నిసార్లు తీపి మీదకు మనసు లాగుతుంది. ఇంకొన్నిసార్లు పులపుల్లగా ఏదైనా తినాలనిపిస్తుంది. ఆకలితో సంబంధం లేకుండా తలెత్తే ఇలాంటి ఆహార కోరికలకు పోషక లోపాలు కారణమంటున్నారు పోషకాహార నిపుణులు. పదార్థాల పట్ల ఆపేక్షల వెనకుండే మతలబుల గురించి తెలుసుకుందాం!

భోజనం తిన్న వెంటనే తీపి తినాలనిపిస్తోందా? అర్థరాత్రి ఉప్పటి స్నాక్స్ మీదకు మనసు మళ్లతోందా? లేదంటే చీజ్ పిజ్జాలూ, పన్నీర్ పకోడీలను లాగించేయాలనిపిస్తోందా? ఈ కోరికలు పూర్తిగా మానసికమైనవి కాకపోవచ్చు. వీటి వెనక భౌతిక, పోషణపరమైన కారణాలు కూడా ఉంటాయి. వీటి గురించిన అవగాహన లోపంతో తినాలనిపించినవన్నీ తినేస్తూ ఉంటే, అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరిపోయి ఊబకాయంతో పాటు, సంబంధిత ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకున్న వాళ్లం అవుతాం! కాబట్టి ఆహార కోరికల్లో రకాలతో పాటు అవెందుకు కలుగుతాయో, వాటితో ఎలా వ్యవహరించాలో, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎలా ఎంచుకోవాలో తెలుసుకోవడం అవసరం.

తీపి కోరికల కారణాలు

ఎదురుగా ఎన్ని పదార్థాలున్నా తీయగా ఏదైనా తినాలనిపిస్తే, అందుకు కారణాల కోసం అన్వేషించాలి. ఈ కోరిక వెనకుండే ప్రధాన కారణాలు ఏవంటే...

- రక్తంలో చక్కెల మోతాదుల్లో హెచ్చుతగ్గులు
- మానసిక సంతృప్తి లేదా ఒత్తిడి నుంచి ఉపశమనం
- నిద్ర లేమి
- మెగ్నీషియం లేదా క్రోమియం లోపం

ప్రత్యామ్నాయాలు ఇవే!

- తాజా పండ్లు
- డార్క్ చాక్లెట్ (70%+ కోకో)
- దాల్చిన చెక్క టీ
- నట్ బటర్, ఓట్స్‌తో చేసిన స్మూతీలు

మాంసాహార కోరికకు కారణాలు

చికెన్, మటన్, చేపలు... ఇలా తరచూ మాంసాహారం తినాలనిపిస్తుంటే...

- ప్రోటీన్ లేదా ఐరన్ లోపం
- విటమిన్ బి 12 లోపం
- గర్భం లేదా అధిక శారీరక శ్రమ

ప్రత్యామ్నాయాలు ఇవే!

- లేత మాంసం
- ఉడకబెట్టిన గుడ్లు, గ్రిల్ చేసిన చేపలు
- మొలకలు, పప్పుధాన్యాలు, టోఫు, ఫోర్టిఫైడ్ ఆహారపదార్థాలు

ఆరోగ్యకరమైన ఆహారం మీద మక్కువ పెరిగేదెలా?

- **క్రమేపీ అలవాటు చేసుకోవాలి:** అనారోగ్యకరమైన పదార్థాల స్థానాన్ని ఆరోగ్యకరమైన పదార్థాలతో అంచెలవారీగా భర్తీ చేస్తూ ఉండాలి
- **మనసు పెట్టాలి:** తినాలనే కోరికను భావోద్వేగాలు ప్రభావితం చేస్తున్నాయా? లేదంటే భౌతిక ఆకలితోనే తినాలనే కోరిక కలిగిందా? అన్నది ఎవరికి వారు ఆలోచించుకోవాలి. తినే సమయంలో ఇంద్రియాలకు పని పెట్టాలి
- **సమతులాహారం:** భోజనంలో మాంసకృత్తులు, పీచు, ఆరోగ్యకరమైన కొవ్వులు చేర్చుకోవాలి
- **సంతృప్తినిచ్చే మార్గాలు:** ఆహారంతో సంబంధం లేని నడక, సంగీతం వినడం, అభిరుచులను సాధన చేయడం లాంటి అలవాట్లు అలవరుచుకోవాలి
- **లోపాలను సరిదిద్దుకోవాలి:** పోషకాహార లోపాలను ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ, శరీరంలో కొరవడిన ఖనిజ లవణాలు, విటమిన్లను భర్తీ చేసుకోవాలి
- **పేగుల ఆరోగ్యం కీలకం:** పులిసిన పదార్థాలు, పీచు ఎక్కువగా ఉండే కూరగాయలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- **సరిపడా నీరు:** శరీరంలో నీటి పరిమాణం తగ్గకుండా చూసుకోవాలి.

పుల్లటివి తినాలనిపిస్తే...

గర్భిణులకే కాదు అప్పుడప్పుడూ అందరికీ పులుపు తినాలనిపిస్తుంది. ఎందుకంటే...

- జీర్ణ వ్యవస్థ సమస్యలు
- విటమిన్ సి లోపం
- గర్భధారణ సంబంధిత హార్మోన్లలో మార్పులు

ప్రత్యామ్నాయాలు ఇవే!

- నిమ్మరసం
- ఉసిరి జ్యూస్ లేదా పుల్లని క్యాండీ
- పెరుగు వంటి పులిసిన పదార్థాలు



ఆహార కోరికలు శరీరం అందించే సూచనలు. ఈ కోరికలు పోషక లోపాలు, భావోద్వేగాలు, అలవాట్లకు మూలాలు. కాబట్టి తినాలనే కోరికలను అర్థం చేసుకుని, ఆరోగ్యకరమైన మార్గంలో వాటిని సంతృప్తి పరుచుకోగలిగితే పోషక లోపం తలెత్తకుండా చూసుకోవచ్చు. నిజానికి పదార్థాలు తినాలనే కోరికలు చెడ్డవేమీ కావు. పోషక లోపాలను గ్రహించి సరిదిద్దుకునే వీలు కల్పించే సాధనాలుగా వాటిని భావించాలి. నిరంతర అలవాట్లు, క్రమేపీ మార్పులతో ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఆస్వాదించగలుగుతాం!

చేదు, కారం కోరికకు కారణాలు

అరుదుగా చేదు, కారాల మీదకు కూడా మనసు మళ్లుతుంది. అలా ఎందుకంటే...

- జీర్ణ సంబంధ ప్రేరకం కోసం...
- కాలేయం విషాలను వదిలించుకోవడం కోసం

ప్రత్యామ్నాయాలు ఇవే!

- మెంతులు. కూరల్లో మెంతిపిండి చల్లుకుని తినాలి
- కాకరకాయ కూరలు, వేపుళ్లు తినొచ్చు
- హెర్బల్ టీ

ఉప్పని స్నాక్స్ కోరిక వెనక

బంగాళాదుంప చిప్స్, సాల్టెడ్ పీనట్స్ లాంటి ఉప్పని స్నాక్స్ తినాలనిపిస్తే ఒంట్లో ఖనిజలవణాలు లోపించాయని అర్థం.

- డీహైడ్రేషన్ లేదా ఎలక్ట్రోలైట్ అసమతుల్యత
- ఒత్తిడి
- అడ్రినల్ ఫెటీగ్

ప్రత్యామ్నాయాలు ఇవే!

- పింక్ సాల్ట్ కలిపి వేయించిన నట్స్
- ఉప్పు కలిపిన కొబ్బరి నీరు
- వేయించిన శనగలు లేదా మఖ్‌నా

కోరిక	లోపం	ప్రత్యామ్నాయం
చాక్లెట్	మెగ్నీషియం	నట్స్, గింజలు, పచ్చని ఆకుకూరలు
రెడ్ మీట్	ఐరన్ లేదా బీ12	పప్పు, పాలకూర, గుడ్లు, లీన్ మీట్
చీజ్, క్రీమ్‌ఫుడ్	కాల్షియం, మంచి కొవ్వుల	నువ్వులు, బాదం పప్పు, డెయిరీ పదార్థాలు
తీపి	క్రోమియం, మెగ్నీషియం లోపం, నిద్ర లేమి	అరటిపండ్లు, నట్స్, తృణధాన్యాలు
ఉప్పు	సోడియం లోపం, డి హైడ్రేషన్	పింక్ సాల్ట్ , కొబ్బరి నీరు, ఆకు పచ్చని ఆకు కూరలు

డాక్టర్ అడ్డు కిరణ్మయి
సీనియర్ క్లినికల్ న్యూట్రిషనిస్ట్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
హైదరాబాద్.



తెలుసుకుందాం

రోజుకు ఎన్నిసార్లు తినాలి?

సాధారణంగా రోజుకు మూడు సార్లు ఆహారం తీసుకుంటాం. అయితే కొందరు అంతకంటే ఎక్కువసార్లు తింటారు. ఇలా చేయడం వలన ఆరోగ్యం మీద ఎలాంటి ప్రభావం ఉంటుందో, వైద్యులు ఏమంటున్నారో తెలుసుకుందాం..

రోజులో మూడు కంటే ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం వలన కొన్ని ప్రయోజనాలు, కొన్ని నష్టాలు ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మనం ఏం తింటున్నాం?, ఎంత మోతాదులో తింటున్నాం? అన్న దాని మీదే శరీరానికి లాభమా? నష్టమా? అనేది ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు. శరీరానికి సమతుల్య పోషకాహారం అవసరం. కొద్ది, కొద్దిగా ఎక్కువసార్లు తినడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా మధుమేగ రోగులకు, ఇన్సులిన్ సెన్సిటివిటీ ఉన్నవారికి దీని వలన ప్రయోజనం చేకూరుతుందని లక్డీకాపూల్‌లోని గ్లెనీగేల్స్ హాస్పిటల్ చీఫ్ డైటీషియన్, డాక్టర్ పి భావన తెలిపారు. ఇలా తినడం వల్ల రక్తంలో చక్కెరస్థాయిలు సిరంగా ఉంటాయనీ, ఇలా కొద్ది కొద్దిగా తినడం వలన జీర్ణవ్యవస్థ మీద ఒత్తిడి తగ్గుతుందనీ అంటున్నారు. ఛాతీ మంట, జీర్ణకోశ సమస్యలతో బాధపడే వారికి దీనిని సిఫారసు చేస్తారని కూడా ఆమె చెప్పారు. ఇలా తినడం వలన రోజంతా శక్తి సమకూరే అవకాశం ఉంటుంది. అయితే ఎక్కువ సార్లు తినడం వలన నష్టాలు కూడా లేకపోలేదు. తరచూ తినడం వల్ల సహజంగా కలిగే ఆకలి సంకేతాలకు భంగం కలుగుతుందని ముంబైలోని గ్లెనీగల్స్ హాస్పిటల్ ఇంటర్నల్ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్, డాక్టర్ మంజూష అగర్వాల్ పేర్కొన్నారు. ఆహారం జీర్ణమవడానికి సరిపడా సమయం ఉండకపోవడం, ఎక్కువ మొత్తంలో తింటూ ఉండడం, క్యాలరీలు, చక్కెర, కొవ్వులు ఎక్కువగా ఉన్న ఆహారం తినడం వలన అధిక బరువు సమస్య పొంచి ఉంటుందని ఆమె హెచ్చరించారు. అలాగే ఎక్కువసార్లు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మీద ఒత్తిడి పెరుగుతుందని, గ్యాస్, ఉబ్బరం, అజీర్తి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. అలాగే మెటబాలిక్ సమస్యల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాల్లో తేలిందని డాక్టర్ మంజూష అగర్వాల్ వెల్లడించారు. అయితే భోజనానికి, భోజనానికి మధ్య ఎంత సమయం అవసరం అన్నది వ్యక్తుల జీవనశైలి, ఆరోగ్య పరిస్థితి మీద ఆధారపడి ఉంటుందని ఆమె వెల్లడించారు.



డిజిటల్ బ్యాంకింగ్ చానల్స్ మరింత కట్టుదిట్టం: ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకుల డిజిటల్ బ్యాంకింగ్ చానల్స్‌ను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరింత పటిష్ఠం చేసింది. ఈ చానల్స్‌తో బ్యాంకులు మరో సంస్థకు చెందిన ఉత్పత్తులు, సేవలు ప్రదర్శించడాన్ని నిషేధించింది. బ్యాంకుల అనుబంధ సంస్థలు, జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీలకూ ఇది వర్తిస్తుందని తెలిపింది. దీనికి సంబంధించి 'ఆర్‌బీఐ (డిజిటల్ బ్యాంకింగ్ చానల్స్ అథరైజేషన్) డైరెక్షన్స్, 2025 పేరుతో సోమవారం కొన్ని ముసాయిదా నిబంధనలు విడుదల చేసింది. ఈ ముసాయిదా నిబంధనలపై వచ్చే నెల 11లోగా బ్యాంకులు, సంబంధిత పార్టీలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ప్రతి బ్యాంకు ఖాతాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం రిస్క్ ఆధారిత లావాదేవీల పర్యవేక్షణ, నిఘా వ్యవస్థలను కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌బీఐ కోరింది.

పదేళ్లలో 12 లక్షల క్రెటా కార్ల విక్రయం


హ్యుండయ్ మోటార్



హైదరాబాద్: హ్యుండయ్ మోటార్ ఇండియాకు చెందిన మిడ్‌సైజ్ ఎస్‌యూవీ కారు క్రెటా భారత్‌లో అడుగుపెట్టి పదేళ్లు పూర్తయింది. ఈ పదేళ్ల విజయవంతమైన ప్రయాణంలో మొత్తం 12 లక్షల వాహనాలు అమ్ముడయ్యాయి. 2015లో భారత్‌లో మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విభాగంలో సాహసోపేతంగా అడుగు పెట్టి ఇప్పుడు 12 లక్షల మంది కస్టమర్ల ఇళ్లలో ఆనందాలు నింపుతున్నామని, పదేళ్లుగా ఈ సెగ్మెంట్‌లో క్రెటా నంబర్ 1 స్థానం నిలబెట్టుకుంటూనే వస్తోందని హ్యుండయ్ మోటార్ ఇండియా ఎండీ ఉన్‌సూ కిమ్ అన్నారు. 2015 నాటికి ఈ సెగ్మెంట్‌లో కేవలం రెండు మోడళ్లుండేవని, ఇప్పుడు వాటి సంఖ్య 12కి పెరిగినప్పటికీ అంత పోటీలో కూడా క్రెటా అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటూ రావడం లక్షలాది మంది కస్టమర్ల విశ్వాసానికి ప్రతీక అని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ అన్నారు. గత పదేళ్లలో క్రెటా వార్షిక అమ్మకాలు రెట్టింపు పైబడి పెరిగాయని, 2015-16 ఆర్థిక సంవత్సరంలో 92,996గా ఉన్న అమ్మకాలు 2024 నాటికి 1,86,919కి చేరాయని ఆయన వెల్లడించారు. మిడ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో క్రెటా 31 శాతం మార్కెట్ వాటా కలిగి ఉందన్నారు. ప్రస్తుతం క్రెటా.. పెట్రోల్, డీజిల్, టర్బో, ఎలక్ట్రిక్ వేరియెంట్లలో మాన్యువల్, ఆటోమేటిక్ ఆప్షన్లలో అందుబాటులో ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ



హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	543	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

గ్లాండ్ ఫార్మా రేసులో బ్రూక్‌ఫీల్డ్, ఈక్యూటీ

ఫోసన్ నుంచి 51.8% వాటా కొనుగోలుకు సన్నాహాలు • ప్రతిబంధకంగా కంపెనీ షేరు ధర



దేశీయ ఫార్మా రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే గ్లాండ్ ఫార్మా యాజమాన్యం మళ్లీ చేతులు మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కంపెనీ ఈక్విటీలో 51.8 శాతం వాటా ఉన్న చైనా కంపెనీ ఫోసన్ గ్రూప్ తన వాటాను అమ్మకానికి పెట్టినట్టు సమాచారం. ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు బ్రూక్‌ఫీల్డ్, ఈటీక్యూ ఈ వాటా కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది. సీవీసీ క్యాపిటల్ పార్ట్‌నర్స్, వార్‌బర్గ్ పింకస్ అనే పీఈ సంస్థలు కూడా త్వరలో ఈ వాటా కొనుగోలుకు ముందుకు వస్తాయని భావిస్తున్నారు.

ఫోసన్ వాటా విలువ రూ.30,000 కోట్లు

గ్లాండ్ ఫార్మా షేరు సోమవారం బీఎస్ఈలో స్వల్పలాభంతో రూ.2,012.15 వద్ద క్లోజైంది. గత నెల రోజుల్లోనే కంపెనీ షేరు ధర 16 శాతం పెరిగింది. ఈ లెక్కన గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో చైనా కంపెనీ ఫోసన్‌కు ఉన్న 51.8 శాతం వాటా విలువ దాదాపు రూ.30,000 కోట్ల వరకు ఉంటుంది. దీంతో పాటు మైనారిటీ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటాను ఓపెన్ ఆఫర్ ద్వారా కొనుగోలు చేయాలి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం చూస్తే ఇందుకు ఎంత లేదన్నా మరో రూ.25,800 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇంత భారీ మొత్తం పెట్టేందుకు ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు వెనుకాడుతున్నట్లు సమాచారం. దీంతో ఈ అమ్మకం ఎంత వరకు ముందుకు కదులుతుందన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది.

1978లో ఏర్పాటు: గ్లాండ్ ఫార్మాను 1978లో పీవీఎన్ రాజు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో ఇంజెక్టబుల్స్, కొత్త ఔషధాల అభివృద్ధి, తయారీ (సీడీఎంఓ)లో కంపెనీకి మంచి పట్టుంది. 2016లో చైనా కంపెనీ ఫోసన్ గ్రూప్..గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో 86 శాతం వాటాను మరో పీఈ సంస్థ కేకేఆర్ నుంచి 126 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. గల్వాన్ సరిహద్దు ఘర్షణ తర్వాత కేంద్రం చైనా కంపెనీలపై పట్టు బిగిస్తోంది. అప్పటి నుంచి చైనా కంపెనీ ఓపెన్ మార్కెట్లో షేర్లు విక్రయించడం ద్వారా ప్రస్తుతం తన వాటాను 51.8 శాతానికి కుదించుకుంది. ఈ వాటాను కూడా ఏవైనా పీఈ సంస్థలకు విక్రయించి గ్లాండ్ ఫార్మా నుంచి పూర్తిగా తప్పుకోవాలని ఫోసన్ భావిస్తోంది.

జీసీసీల అడ్డా హైదరాబాద్



273 జీసీసీలతో దేశంలో రెండో స్థానం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కంపెనీలతో పాటు గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కూ హైదరాబాద్ కేంద్రంగా మారుతోంది. ప్రస్తుతం దేశంలో బెంగళూరు తర్వాత హైదరాబాద్‌లోనే ఎక్కువ జీసీసీలు కొలువుదీరాయి. దేశంలో ఉన్న దాదాపు 1,700 జీసీసీల్లో 29 శాతం (487) బెంగళూరులో ఉంటే, 273 జీసీసీలతో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. అమెరికా కేంద్రంగా పనిచేసే రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ వెస్టియన్ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది.

డిల్లీ-ఎన్‌సీఆర్ (272), ముంబై (207), పుణె (178), చెన్నై (162) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దేశవ్యాప్తంగా నగరాల్లో పెరుగుతున్న మౌలిక వసతులు, నిపుణులైన ఉద్యోగులు దొరకడం, ప్రభుత్వాల ప్రోత్సాహం, ఇతర దేశాలతో పోలిస్తే తక్కువ ఖర్చులు మన దేశంలో పెద్దఎత్తున జీసీసీల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాయి.

నివేదికలోని ఇతర ప్రధానాంశాలు

- దేశంలోని మొత్తం జీసీసీల్లో 55 శాతం (922) బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లోనే
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3,200 జీసీసీల్లో 53 శాతం భారత్‌లోనే
- దేశంలోని మొత్తం జీసీసీల్లో 94 శాతం ఆరు నగరాల్లోనే ఉన్నాయి
- 2028 నాటికి దేశంలో జీసీసీల సంఖ్య 2,100 దాటే అవకాశం
- ఏటా కొత్తగా 150 జీసీసీల ఏర్పాటు
- దేశంలోని జీసీసీల్లో దాదాపు సగం ఐటీ, ఐటీఈఎస్ ఆధారిత జీసీసీలు

నిధుల వేటలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

త్వరలో రూ.6,000 కోట్ల ఎన్‌సీడీల జారీ!

న్యూఢిల్లీ: జీఎంఆర్ గ్రూప్ మరోసారి పెద్ద ఎత్తున నిధుల సమీకరణకు సిద్ధమవుతోంది. గ్రూప్ కంపెనీ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ రుణ పత్రాల జారీ ద్వారా త్వరలో రూ.4,000 కోట్ల నుంచి రూ.6,000 కోట్లు సమీకరించబోతున్నట్టు సమాచారం. ఈ నిధులను కంపెనీకి ఉన్న రూ.5,700 కోట్ల అధిక వడ్డీ రుణాలు చెల్లించేందుకు ఉపయోగిస్తారని భావిస్తున్నారు. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) రూపంలో జారీ చేసే ఈ రుణ పత్రాలను సాధారణ ప్రజానీకం, సంస్థాగత మదుపరులకు కాకుండా మ్యూచువల్ ఫండ్స్‌కు జారీ చేస్తారని సమాచారం.

యూకో బ్యాంక్ లాభం రూ.607 కోట్లు

కోల్‌కతా: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.607 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.551 కోట్లతో పోల్చితే లాభం 10.16% పెరిగింది. బలమైన రుణ వృద్ధితో పాటు ఆస్తుల నాణ్యత మెరుగుపడడం ఇందుకు దోహదపడినట్టు బ్యాంక్ తెలిపింది. ఇటు వడ్డీ ఆదాయం, అటు వడ్డీయేతర ఆదాయం కూడా పెరిగాయని బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వినీ కుమార్ తెలిపారు. రుణాలపై ఆర్జించిన వడ్డీ ఆదాయమే రూ.6,000 కోట్ల నుంచి రూ.6,400 కోట్లకు పెరిగిందన్నారు. దీనికి తోడు నిర్వహణా వ్యయాలు 4% మాత్రమే పెరగడం లాభదాయకత పెరుగుదలకు దోహదపడిందని తెలిపారు. అయితే రుణాలపై వడ్డీ సవరణ ముందస్తుగానే ప్రకటించిన కారణంగా నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) గతంలో అంచనా వేసిన 3-3.10% నుంచి 2.9-3 శాతానికి తగ్గవచ్చని ఆయన చెప్పారు. జూన్ త్రైమాసికంలో ఎన్ఐఎం 2.96 శాతంగా ఉన్నట్టు తెలిపారు. జూన్ 30 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం 13.51% వృద్ధితో రూ.5,23,736 కోట్లకు పెరగగా, రుణాలు 16.48% వృద్ధితో రూ.2,25,101 కోట్లకు, డిపాజిట్లు 11.37% వృద్ధితో రూ.2,98,635 కోట్లకు చేరాయని పేర్కొంది. ఈ కాలంలో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 3.32% నుంచి 2.63 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 0.78% నుంచి 0.45 శాతానికి తగ్గాయి.

దొడ్ల డెయిరీ లాభంలో క్షీణత

దొడ్ల డెయిరీ జూన్ త్రైమాసికంలో రూ.62.87 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.65.02 కోట్లతో పోల్చితే లాభం 3 శాతం తగ్గింది. అయితే సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.918.53 కోట్ల నుంచి రూ.1,023.78 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయం రూ.825.73 కోట్ల నుంచి రూ.942.80 కోట్లకు పెరిగింది.

ఎంజీ ఎం9 ఎలక్ట్రిక్ కారు

ధర రూ.69.90 లక్షలు



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.. మార్కెట్లోకి ఎంజీ ఎం9 ఎలక్ట్రిక్ లిమోసిన్ కారును తీసుకువచ్చింది. ఈ కారు పరిచయ ధర రూ.69.90 లక్షలు (ఎక్స్‌షోరూమ్). కంపెనీ లగ్జరీ రిటైల్ విభాగం ఎంజీ సెలెక్ట్ ద్వారా ఈ కార్లను విక్రయించనుంది. రూ.లక్ష చెల్లించి ఈ కారును బుక్ చేసుకోవచ్చని ఎంజీ వెల్లడించింది. ఆగస్టు 10 నుంచి ఈ కారు డెలివరీలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. 90కేడబ్ల్యూహెచ్ నికెల్ మాంగనీస్ కోబాల్ట్ (ఎన్ఎంసీ) బ్యాటరీతో కూడిన ఈ కారు ఒకసారి చార్జింగ్‌తో 548 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. 160 కేడబ్ల్యూ డీసీ ఫాస్ట్ చార్జర్‌తో ఈ బ్యాటరీ కేవలం గంటన్నరలోనే వంద శాతం చార్జింగ్ అవుతుంది.

మళ్లీ లాభాల్లోకి మార్కెట్లు

● సెన్సెక్స్ 442 పాయింట్లు అప్

ముంబై: గత వారాంతంలో వరుసగా రెండు రోజులు నష్టాలు చవిచూసిన దేశీయ మార్కెట్ సూచీలు సోమవారం మళ్లీ లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ 442.61 పాయింట్ల వృద్ధితో 82,200.34 వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 122.30 పాయింట్ల లాభంతో 25,090.70 వద్ద ముగిసింది. ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు చేపట్టడం ఇందుకు దోహదపడింది. అయితే, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో అమ్మకాలు సూచీల లాభాలను పరిమితం చేశాయి.

ఫ్యాప్సీ అధ్యక్షుడిగా అరుమిల్లి సత్యనారాయణ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) అధ్యక్షునిగా కోరమాండల్ పెయింట్స్ ఎండీ అరుమిల్లి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఫ్యాప్సీ ఆరో వార్షిక సర్వసభ్య సమావేశంలో 2025-26 సంవత్సరానికి గాను ఆయనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సత్యనారాయణ ఇప్పటి వరకు ఫ్యాప్సీ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు.

● ఐటీసీ కుకీస్ బ్రాండ్ సన్ ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్.. అడాప్షన్ ఇన్ ఇండియా కార్యక్రమానికి తోడ్పాటునందిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఇండియన్ సొసైటీ ఫర్ స్పాన్సర్‌షిప్ అండ్ అడాప్షన్ (ఐఎస్ఎస్ఏ) రూపొందిస్తున్న 'డియర్ మా' చిత్రంలో భాగస్వాములవుతున్నట్లు వెల్లడించింది. ప్రతి చిన్నారి జీవితంలో సూపర్‌పవర్‌గా ఉన్న మాతృమూర్తి గొప్పతనం వివరించనున్నట్లు తెలిపింది. అంతేకాకుండా దేశంలో దత్తత గురించి ఉన్న అపోహలను తొలగించటంతో పాటు దత్తత తీసుకున్న తల్లులకు సమాన గౌరవం లభించే విధంగా కార్యక్రమాలను చేపట్టనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,150 ▲	91,800 ▲	1,26,000 ▲
విజయవాడ	1,02,000 ▲	96,000 ▼	1,16,800 ▲
విశాఖపట్నం	1,02,290 ▲	91,800 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,00,150 ▲	91,800 ▲	1,16,100 ▲
ప్రొద్దుటూరు	98,500 ▲	90,620 ▲	1,01,470 ▼
ముంబై	98,896 ▲	90,589 ▲	1,13,465 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	112
వరంగల్	109	గుంటూరు	117
కరీంనగర్	109	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	109
కర్నూలు	109	నెల్లూరు	114
విశాఖపట్నం	95	అనంతపురం	114
గోదావరి	112		

సెమీఫైనల్లో భారత్ X చైనా


దివ్య

- ఫైనల్-4కు దివ్య దేశ్‌ముఖ్
- టైబ్రేక్‌లో హారికపై గెలుపు
- మహిళల చెస్ వరల్డ్‌కప్

బటూమి (జార్జియా): మహిళల చెస్ వరల్డ్ కప్‌లో ఇద్దరు భారత ప్లేయర్లు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ సెమీస్ చేరి సరికొత్త చరిత్ర సృష్టించారు. 2003 టోర్నీలో ద్రోణవల్లి హారిక క్వార్టర్స్ చేరడం అత్యుత్తమం కాగా.. ఇప్పుడు హంపి, దివ్య ఆ రికార్డును అధిగమించారు. హంపి ముందుగానే ఫైనల్-4 బెర్త్‌ను సొంతం చేసుకోగా.. సోమవారం జరిగిన టైబ్రేక్‌లో సహచర జీఎం హారికపై గెలిచిన దివ్య సెమీస్‌కు దూసుకెళ్లింది. కాగా, క్వార్టర్ ఫైనల్స్‌లో దివ్య 3-1తో హారికపై నెగ్గింది. వీరిమధ్య తొలి రెండు గేమ్‌లు డ్రా కావడంతో 1-1తో సమంగా నిలిచారు. అయితే, టైబ్రేక్‌లో రెండు గేముల్లోనూ హారికకు దివ్య ఝలక్ ఇచ్చింది. మొత్తంగా ఇద్దరు భారత మాస్టర్లు, ఇద్దరు చైనా ప్లేయర్లు ఫైనల్-4కు చేరుకోవడం విశేషం. మంగళవారం జరిగే సెమీస్‌లో జీఎం లీ టింగ్జీతో హంపి, జీఎం టాన్ జోంగ్‌యితో దివ్య తలపడనున్నారు.

మెరుగైన ప్రదర్శనపైనే సాత్విక్ జోడీ దృష్టి

- బరిలో సింధు, ప్రణయ్, లక్ష్య సేన్
- చైనా ఓపెన్ నేటి నుంచి



చాంగ్‌జౌ: వరల్డ్ చాంపియన్‌షిప్స్ నేపథ్యంలో.. భారత డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకోవాలనుకొంటోంది. మంగళవారం నుంచి జరిగే చైనా ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. పారిస్‌లో వచ్చే నెల 25 నుంచి జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్ ముందు ఇదే మేజర్ ఈవెంట్. ఈ సీజన్‌లో సాత్విక్ జోడీ మూడు టోర్నీల్లో సెమీస్‌కు చేరుకొంది. అయితే, సాత్విక్ అనారోగ్యం ఆందోళన కలిగిస్తుండగా.. చిరాగ్ కూడా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. సింగిల్స్‌లో లక్ష్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్, పీవీ సింధు, ఉన్నతి హుడా బరిలో నిలవనున్నారు. డబుల్స్‌లో కవిప్రియ-సిమ్రన్, రుతుపర్ణ-శ్వేతపర్ణ, అమృత-సోనాలి, రుత్విక శివాని-రోహన్ కపూర్ జంటలు ఆడనున్నాయి.

బరిలోకి దిగకుండా.. ఆరుగురు భారత షట్లర్ల అడ్డగింత!

వివాదాస్పదంగా వరల్డ్ యూనివర్సిటీ క్రీడలు

న్యూఢిల్లీ: జర్మనీలో జరుగుతున్న వరల్డ్ యూనివర్సిటీ క్రీడలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లిన 12 మంది భారత ఆటగాళ్లలో సగం మందికి ఆడేందుకు అనుమతి లభించలేదు. జర్మనీ వెళ్లిన ఆరుగురు షట్లర్లు అధికారుల వైఫల్యం కారణంగా బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. కాగా, ఈ నెల 16న జరిగిన మేనేజర్ల సమావేశంలో అందరి పేర్లను సరిగ్గా సమర్పించక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్టు తెలుస్తోంది. అయితే, ఈ తప్పిదానికి కారణమేంటనేది కచ్చితంగా ఎవరూ బయటపెట్టడం లేదు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేపడతామని భారత యూనివర్సిటీల సంఘం (ఏఐయూ) కార్యదర్శి పంకజ్ మిట్టల్ చెప్పాడు. 'సమావేశంలో భారత్ తరఫున బరిలోకి దిగే 12 మంది ఆటగాళ్ల జాబితాను సమర్పించారు. ఆ లిస్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి మిస్ అయిన వారు, గాయపడిన వారి స్థానాలను మరొకరితో భర్తీ చేయాలి. అయితే, నిర్వాహకులు తేలిగ్గా తీసుకొన్నార'ని విశ్వసనీయ వర్గాల సమాచారం. కనీసం సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ కేటగిరీల్లో ఎవరెవరు బరిలోకి దిగుతారో కూడా పేర్కొనలేదట. కానీ, ట్రయల్స్‌లో విజేతలుగా నిలిచిన ప్లేయర్లు మిక్స్‌డ్ డబుల్స్ నుంచి తప్పుకోవడంతో.. అధికారులు ఆరుగురి పేర్లను మాత్రమే లేఖలో పొందుపరిచారనే టాక్ కూడా వినిపిస్తోంది. మరోవైపు సెలెక్షన్ ట్రయల్స్ నుంచి అవకతవకలు జరిగినట్టు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ట్రయల్స్‌కే డుమ్మాకొట్టిన ఆటగాళ్లు కూడా ఈ టోర్నీకి ఎంపికైనట్టు ఆరోపణలు వినవస్తున్నాయి.

బుమ్రా బరిలోకి..



తేల్చిన పేసర్ సిరాజ్

పంత్ కీపింగ్ ప్రాక్టీస్.. అన్షుల్‌కు చాన్స్!

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో జరిగే కీలకమైన నాలుగో టెస్టుకు భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉంటాడా? లేడా? అనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే సిరీస్‌లో 1-2తో వెనుకబడిన దశలో టీమిండియాకు మాంచెస్టర్ టెస్టు చావోరేవో లాంటిది. ఇందులో గెలిస్తేనే సిరీస్ ఆశలు సజీవంగా ఉంటాయి. అలాంటి ముఖ్యమైన టెస్టుకు పనిఒత్తిడిలో భాగంగా బుమ్రాకు విశ్రాంతినివ్వడం సరికాదని విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే ఈ సస్పెన్స్‌కు పేసర్ మహ్మద్ సిరాజ్ తెర దించాడు. ఈనెల 23 నుంచి ఇక్కడి ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగే టెస్టులో బుమ్రా బరిలోకి దిగుతాడని తేల్చాడు. 'నాకు తెలిసినంత వరకు నాలుగో టెస్టులో బుమ్రా ఆడతాడు. గాయాల కారణంగా రోజురోజుకూ మా కాంబినేషన్ మారుతూ వస్తోంది. గాయంతో బాధపడుతున్న ఆకాశ్ దీప్ ఫిజియో పర్యవేక్షణలో ఉన్నాడు. సోమవారం ఉదయం తను బౌలింగ్ కూడా చేశాడు. కానీ అతడి ప్రాతినిధ్యంపై ఫిజియో నుంచి ప్రతిస్పందన రావాల్సి ఉంది. ఇక ఇంగ్లండ్ ఆటతీరును బట్టి మా బౌలింగ్ వ్యూహాలను మార్చుకుంటాం' అని సిరాజ్ తెలిపాడు. ఇక బుమ్రా రాకతో జట్టు బౌలింగ్ విభాగం బలంగా మారనుంది. తాజా సిరీస్‌లో తను తొలి, మూడో టెస్టు ఆడి బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్నాడు. అలాగే చివరి టెస్టుకు అందుబాటులో ఉంచాలని ముందుగా భావించారు. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో నాలుగో టెస్టులోనే తనను ఆడించాల్సిన అవసరం ఏర్పడింది.


సిరాజ్

కీపింగ్‌కు పంత్ సిద్ధమా?

మూడో టెస్టులో వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఎడమ చేతి చూపుడు వేలికి గాయమైంది. దీంతో తను బ్యాటింగ్ మాత్రమే చేసి కీపింగ్ బాధ్యతలను ధ్రువ్ జురెల్‌కు అప్పగించాడు. అందుకే నాలుగో టెస్టులో పంత్ ప్రాతినిధ్యంపై కూడా సందేహాలు వ్యక్తమయ్యాయి. ఆదివారం నెట్స్‌లోనూ తను బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా.. జురెల్ కీపింగ్ చేస్తూ కనిపించాడు. దీంతో మాంచెస్టర్‌లో పంత్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడించి కీపర్‌గా జురెల్‌ను బరిలోకి దించుతారని అంతా భావించారు. కానీ ఈనెల 10 తర్వాత తొలిసారిగా పంత్ సోమవారం నెట్స్‌లో కీపింగ్ గ్లోవ్స్ ధరించడం కనిపించింది. దీంతో కీపర్‌గా పంత్ కొనసాగవచ్చని సమాచారం. అదే జరిగితే జురెల్‌కు స్థానం కష్టమే. కానీ నితీశ్ సిరీస్‌కు దూరమయ్యాడు కాబట్టి.. అతడి స్థానంలో జురెల్‌ను ఆడిస్తారా? లేక మరో ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌ను బరిలోకి దింపుతారా? అనేది వేచిచూడాల్సిందే.

వెంటాడుతున్న గాయాలు

నాలుగో టెస్టుకు ముందు భారత జట్టును గాయాల బెడద వేధిస్తోంది. యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ మోకాలి గాయంతో సిరీస్‌కు దూరమైనట్టు బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. పునరావాస శిబిరంలో పాల్గొనేందుకు స్వదేశం వెళతాడని పేర్కొంది. జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా అతడి మోకాలి లిగమెంట్ దెబ్బతింది. అలాగే పేసర్ అర్ష్‌దీప్ ఎడమచేతి బొటన వేలి గాయంతో ఈ టెస్టుకు అందుబాటులో లేడు. ఇక మరో పేసర్ ఆకాశ్‌దీప్ వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. అతడి ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రాలేదు. అందుకే ముందు జాగ్రత్తగా హరియాణా యువ పేసర్ అన్షుల్ కాంబోజ్‌ను ఇంగ్లండ్‌కు రప్పించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో బుమ్రా, సిరాజ్‌కు జతగా మూడో పేసర్ స్థానంలో అన్షుల్‌తో అరంగేట్రం చేయించినా ఆశ్చర్యపోనవసరం లేదు.

పేసర్లకే అనుకూలం

మాంచెస్టర్ పిచ్ పచ్చికతో కళకళలాడుతోంది. అలాగే కొన్ని రోజులుగా ఇక్కడ కురుస్తున్న వర్షాల కారణంగా అవుట్‌ఫీల్డ్ మాత్రం తడిగా ఉంది. ఇక వికెట్‌పై గ్రీన్ టాప్ కారణంగా బంతి స్వింగ్‌తో పాటు చక్కటి సీమ్ అయ్యే అవకాశం ఉంది. దీంతో పిచ్ ఫాస్ట్ బౌలర్లకు లాభించనుంది. ఆరంభ సెషన్లలో బ్యాటింగ్ చేయడం కష్టంగా మారనుంది.

ఏకాంశ్ సింగ్ శతకం

- ఇంగ్లండ్ 309 ఆలౌట్
- భారత్ 51/1
- యూత్ టెస్ట్


ఏకాంశ్ సింగ్ (117)

చెమ్స్‌ఫోర్డ్: ఏకాంశ్ సింగ్ (117) శతకంతో రాణించడంతో.. భారత అండర్-19తో రెండో అనధికార టెస్ట్‌లో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 309 పరుగులకు ఆలౌటైంది. ఆటకు రెండో రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 229/7కు ఇంగ్లండ్ మరో 80 పరుగులు జోడించి మిగతా మూడు వికెట్లు చేజార్చుకొంది. నిన్నటి బ్యాటర్ ఏకాంశ్ వంద మార్క్ దాటాడు. నమన్ పుష్పక్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం వర్షం కారణంగా ఆట నిలిచే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 51/1 స్కోరు చేసింది. కెప్టెన్ ఆయుష్ మహత్రే (24), విహాన్ మల్హోత్రా (6) క్రీజులో ఉన్నారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (20)ను గ్రీన్ పెవిలియన్ చేర్చాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు భారత్ 258 పరుగుల దూరంలో ఉంది.

తుది జట్టులో డాసన్

నాలుగో టెస్టుకు ఇంగ్లండ్ టీమ్



మాంచెస్టర్: భారత్‌తో ఈనెల 23 నుంచి జరిగే నాలుగో టెస్టు కోసం ఇంగ్లండ్ తుది జట్టును ప్రకటించారు. చేతి వేలి గాయంతో జట్టుకు దూరమైన స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో 35 ఏళ్ల లెఫ్టామ్ స్పిన్నర్ లియామ్ డాసన్‌కు చోటు కల్పించారు. లార్డ్స్ టెస్టులో ఆడిన ఇంగ్లండ్ జట్టులో ఇదొక్కటే మార్పు కావడం గమనార్హం. దీంతో డాసన్ ఎనిమిదేళ్ల తర్వాత టెస్టు ఆడబోతున్నాడు. కెరీర్‌లో తను మూడు టెస్టులు ఆడగా 2017లో చివరిసారి దక్షిణాఫ్రికాపై బరిలోకి దిగాడు.

తుది జట్టు: స్టోక్స్ (కెప్టెన్), క్రాలే, డకెట్, రూట్, పోప్, బ్రూక్, స్మిత్, వోక్స్, డాసన్, కార్స్, ఆర్చర్.

రద్దయితే పీసీబీకి భారీ నష్టమే..

ఆసియాకప్

కరాచీ: ఈ ఏడాది జరగాల్సిన ఆసియా కప్ టీ20 టోర్నమెంట్ నిర్వహణపై ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఒకవేళ ఆసియా కప్ రద్దయితే మాత్రం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆదాయానికి భారీ గండి పడినట్టే. ఈ ఆర్థిక సంవత్సరానికి ఐసీసీ నుంచి తమ వాటాగా పీసీబీ రూ.233 కోట్ల ఆదాయాన్ని ఆశిస్తోంది. అలాగే ఆసియా కప్ నుంచి రూ.48 కోట్లు, ఇతర క్రికెట్ టోర్నమెంట్ల ద్వారా రూ.66 కోట్లు ఆర్జించే చాన్సుంది.

ఎవరిదో సిరీస్ ?

నేడు భారత్ X ఇంగ్లండ్ మహిళల మూడో వన్డే

చెస్టర్ లీ స్ట్రీట్: మూడు వన్డేల సిరీస్‌లో 1-1తో సమంగా ఉన్న భారత్-ఇంగ్లండ్ మహిళల జట్ల మధ్య నేడు (మంగళవారం) చివరి వన్డే జరుగనుంది. తొలి వన్డేలో బ్యాటర్లు విశేషంగా రాణించడంతో మ్యాచ్ నెగ్గిన భారత్.. వర్షాభావ రెండో మ్యాచ్‌లో మాత్రం బ్యాట్లెత్తేశారు. కేవలం మంధాన, దీప్తి శర్మ మాత్రమే ఆకట్టుకోగలిగారు. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తడబడ్డారు. నేటి కీలక మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, జెమీమా, ఓపెనర్ ప్రతీక, రిచా ఘోష్ తమ స్థాయికి తగ్గట్టు ఆడితే భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. అటు బౌలర్లు కూడా నిరాశపర్చడంతో లార్డ్స్‌లో సిరీస్ పట్టేయాలనుకున్న అమ్మాయిలకు నిరాశే ఎదురైంది. ఇక సిరీస్‌లో కచ్చితంగా గెలవాల్సిన రెండో మ్యాచ్‌లో సివర్ సేన అదరగొట్టింది. అన్ని విభాగాల్లోనూ సంపూర్ణ ఆధిపత్యం చూపింది. ఈ మూడో వన్డేలోనూ ఎలాంటి అలక్ష్యం లేకుండా చెలరేగి సిరీస్‌ను పట్టేయాలని భావిస్తోంది.

సా. 5.30నుంచి సోనీ స్పోర్ట్స్‌లో




విమానం కూలిపోయిన చోట శకలాలు, కాలిపోయిన స్కూలు భవనం

స్కూలుపై కూలిన విమానం

» బంగ్లాదేశ్‌లో పైలట్ సహా 20 మంది దుర్మరణం

ఢాకా, జూలై 21: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఎయిర్‌ఫోర్స్ శిక్షణ విమానం కూలి, 20 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 171 మంది గాయపడ్డారు. బంగ్లాదేశ్ సైన్యానికి చెందిన ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) కథనం ప్రకారం.. బంగ్లాదేశ్ వాయుసేనకు చెందిన ఎఫ్-7బీజీఐ శిక్షణ విమానం సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఢాకా ఎయిర్ బేస్ నుంచి గాల్లోకి ఎగిరింది. కాసేపట్లోనే ఆ విమానంలో సాంకేతిక లోపాలు తలెత్తి.. 1.08 గంటల సమయంలో సమీపంలోని మూడంతస్తుల మైల్స్ స్టోన్ స్కూల్‌పై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ విమానంలో ఒక పైలట్ ఉన్నారు. ఈ ప్రమాదంలో పైలట్‌తో పాటు.. మైల్స్ స్టోన్ బడిలోని ఇద్దరు ఉపాధ్యాయులు, 17 మంది విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో 171 మందికి గాయాలయ్యాయి. సాంకేతిక కారణాలతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐఎస్‌పీఆర్ వివరించింది. "ప్రమాదం జరిగిన సమయంలో ఆ విమానంలో పైలట్.. లెఫ్టినెంట్ మహమ్మద్ తౌఖీర్ ఇస్లాం ఉన్నారు. సాంకేతిక లోపంపై ఆయన ఏటీసీకి సమాచారం అందించారు. నిజానికి ఆ విమానం జనసమ్మర్థత అధికంగా ఉండే ప్రాంతంలో పడేది. కానీ, పైలట్ సమయస్ఫూర్తితో ఉత్తర ఢాకా వైపు మళ్లించారు" అని ఐఎస్‌పీఆర్ వివరించింది.

ముంబై విమానాశ్రయంలో..
ఎయిరిండియా విమానానికి తప్పిన ప్రమాదం

» రన్‌వే పక్కకు దూసుకెళ్లిన కోచి విమానం

ముంబై, జూలై 21: ముంబై విమానాశ్రయంలో సోమవారం ఎయిరిండియా విమానం స్వల్ప ప్రమాదానికి గురైంది. కోచి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ముంబై బయలుదేరియన ఎయిరిండియా విమానం.. సోమవారం ఉదయం 9.27 గంటలకు ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అయితే.. ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై ఆ విమానం అదుపుతప్పినట్లు ఎన్డీటీవీ ప్రచురించిన దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి. విమానం రన్‌వే పక్కకు చొచ్చుకుపోవడంతో.. ఓవైపు వంగిపోయింది. ఈ ఘటనలో రన్‌వే పక్కన ఉండే మూడు సైన్ బోర్డులు, రన్‌వే అంచుల్లో ఉండే నాలుగు లైట్లు దెబ్బతిన్నాయి. విమానంలోని కుడి ఇంజన్ దెబ్బతిన్నది. ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నారని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై ఎయిరిండియా కూడా స్పందించింది. విమానంలోని ఇద్దరు పైలట్లను విధుల నుంచి తప్పించినట్లు ప్రకటించింది. మరోవైపు, ఎయిరిడియా విమానం సాంకేతిక సమస్య కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టు వద్ద టేకాఫ్‌ను రద్దు చేసుకున్న ఉదంతం సోమవారం చోటుచేసుకుంది. ఏఐ2403 విమానం ఢిల్లీ నుంచి కోల్‌కతా బయలుదేరడానికి సిద్ధంగా ఉండగా.. పైలట్లు సాంకేతిక లోపాలను గుర్తించారని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. అయితే.. టేకాఫ్‌ను రద్దు చేసుకునే సమయంలో విమానం రన్‌వేపై 155 కి.మీ వేగంతో వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో పైలట్లు సాంకేతిక లోపాన్ని గుర్తించారు.

అన్ని హద్దులూ దాటేస్తున్నారు!

(మొదటిపేజీ తరువాయి)



చేయొద్దని ఏఎస్‌జీని కోరింది. సోమవారం రెండు కేసుల విచారణ సందర్భంగా దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. వీటిలో ఒకటి కర్ణాటక సీఎం సిద్దరామయ్య భార్యకు ముడా కేసులో ఉపశమనం కల్పిస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఈడీ అప్పీలుకు సంబంధించినది కాగా, రెండోది క్లైంట్‌లకు సలహాలు ఇచ్చినందుకు సీనియర్ న్యాయవాదులకు ఈడీ సమన్లు జారీ చేసిన కేసు. ముడా(మైసూర్ పట్టణాభివృద్ధి సంస్థ) స్థలాల అక్రమ కేటాయింపుల కేసులో కర్ణాటక సీఎం సిద్దరామయ్య భార్య బీఎం పార్వతి, కర్ణాటక పట్టణాభివృద్ధి మంత్రి బైరాతి సురేశ్‌లపై మనీ లాండరింగ్ ప్రొసీడింగ్స్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టివేయడంతో ఈడీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. తాజాగా హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ కేసులో దిగువ కోర్టుతోపాటు హైకోర్టు కూడా చాలా స్పష్టంగా తీర్పులు ఇచ్చినప్పటికీ ఈడీ అప్పీలు చేయడాన్ని సీజేఐ ప్రశ్నించారు. 'విచారణ కోర్టు తీర్పును సింగిల్ జడ్జి సమర్థించారని మీకు బాగా తెలుసు. రాజకీయ యుద్ధాలు ఎన్నికల వరకే పరిమితం కానివ్వండి. ఇందులో మిమ్మల్ని ఎందుకు వాడుకుంటున్నారు? దురదృష్టవశాత్తూ మహారాష్ట్రలోనూ ఈడీ నుంచి ఇలాంటి వైఖరినే చూశాం. ఇంతకుమించి వ్యాఖ్యానించేలా మాపై ఒత్తిడి తీసుకురావొద్దు. లేదంటే ఈడీ గురించి ఇంతకంటే కఠినంగా మేం మాట్లాడాల్సి వస్తుంది' అని సీజేఐ పేర్కొన్నారు. దీంతో అప్పీలును ఉపసంహరించుకుంటున్నామని ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) ఎస్‌వీ రాజు తెలపగా, కఠిన పదాలు వాడకుండా మమ్మల్ని కాపాడారంటూ ఆయనకు సీజేఐ ధన్యవాదాలు తెలిపారు.

ఈడీకి అడ్డుకట్ట వేసేందుకు మార్గదర్శకాలు అవసరం

తమ క్లైంట్‌లకు న్యాయ సలహాలు ఇచ్చారంటూ సీనియర్ న్యాయవాదులు డి.అరవింద్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఈడీ సమన్లు జారీ చేయడంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. న్యాయ వృత్తిపై ఈడీ చర్యలు భయంకరంగా ఉన్నాయన్న సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్.. కొన్ని అంతర్జాతీయ ఘటనలనూ విచారణలో ప్రస్తావించారు. 'టర్కీలో మొత్తంగా బార్ అసోసియేషన్‌నే రద్దు చేయడం చూశాం. చైనాలోనూ అలాంటిదే చూశాం. మనం ఆ దిశలో వెళ్లకూడదు. కొన్ని మార్గదర్శకాలు రూపొందించాలి' అన్నారు. దీనికి సీజేఐ అంగీకరించారు. ఈ అంశంలో అమికస్ క్యూరీని నియమిస్తామని తెలిపారు. దీంతో సీనియర్ న్యాయవాదులకు జారీ చేసిన సమన్లను ఈడీ ఉపసంహరించుకుంది. ఇకపై ఈడీ డైరెక్టర్ అనుమతి లేకుండా లాయర్లకు సమన్లు జారీ చేయబోంటూ ఈడీ ఒక లేఖను విడుదల చేసింది. కాగా, ఈడీపై తప్పుడు అభిప్రాయం కలిగించేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు.

మీరేమీ సూపర్ పోలీసు కాదు

» ఈడీపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం

చెన్నై, జూలై 21: 'మీ దృష్టికి వచ్చిన ఏ అంశంపైనైనా దర్యాప్తు చేయడానికి మీరేమీ సూపర్ పోలీసు కాదు. లేదా ప్రతి నేర కార్యకలాపంపైనా దాడి చేయడానికి మీరేమీ డ్రోన్ కాదు' అంటూ ఈడీపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నైకి చెందిన ఆర్‌కేఎం పవర్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన రూ.901 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను స్తంభింపజేస్తూ ఈడీ జనవరి 31న జారీ చేసిన ఆదేశాలను హైకోర్టు పక్కన పెట్టింది. ఈ అంశం ఈడీ పరిధిలోకి రాదని తేల్చిచెప్పింది. 2006లో ఛత్తీస్‌గఢ్‌లోని ఒక థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు బ్లాకులు కేటాయించడంపై దాఖలైన పిల్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఆ కేటాయింపును రద్దు చేయడంతోపాటు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించగా, 2014లో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా అదే ఏడాది మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసింది. ఈ ఏడాది జనవరి 31న ఆర్‌కేఎం పవర్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సోదాలు నిర్వహించిన ఈడీ.. ఆ సంస్థకు చెందిన రూ.901 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను స్తంభింపజేసింది. దీన్ని ఆర్‌కేఎం పవర్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ సవాలు చేయగా.. ఈ కేసు మనీలాండరింగ్ నిరోధక చట్టం పరిధిలోకి రాదంటూ ఈడీ ఆదేశాలను ధర్మాసనం పక్కనపెట్టింది.

భారత్‌పై చైనా కుయుక్తులు!

(మొదటిపేజీ తరువాయి)

పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకమైన 32 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.75 లక్షల కోట్ల) విలువైన స్మార్ట్‌ఫోన్ల ఎగుమతి లక్ష్యాన్ని ప్రమాదంలో పడేస్తుందని హెచ్చరించింది. 'ప్రపంచ తయారీ హబ్‌గా భారత్ ఆవిర్భావాన్ని, భారత సరఫరా చైన్లను దెబ్బతీయడమే లక్ష్యంగా చైనా ఉద్దేశపూర్వకంగా ఈ చర్యలకు పాల్పడుతోందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది. చైనా నియంత్రణలపై తక్షణం జోక్యం చేసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. మరీ ముఖ్యంగా ఎలాంటి అధికారిక సమాచారం లేకుండా, కేవలం మౌఖిక సూచనల ద్వారానే చైనా ఒక ప్రణాళిక ప్రకారం, క్రమ పద్ధతిలో ఆంక్షలకు పాల్పడుతోందని ఐసీఈఏ పేర్కొంది. ఇండియా సెల్యూలర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్‌లో ప్రముఖ సంస్థలైన యాపిల్, గూగుల్, మోటోరోలా, ఫాక్స్‌కాన్, వివో, ఒప్పో, లావా, డిక్సాన్, ఫ్లెక్స్ టాటా ఎలక్ట్రానిక్స్ ఉన్నాయి. కాగా, భారత్‌లోని ఫాక్స్‌కాన్ ప్లాంట్లలో పనిచేస్తున్న తమ దేశ ఇంజనీర్లు, టెక్నీషియన్లు వెంటనే అక్కడి నుంచి వచ్చేయాలని చైనా కోరినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. యాపిల్‌కు వాణిజ్య భాగస్వామి, అతిపెద్ద ఐఫోన్ల తయారీదారు ఫాక్స్‌కాన్ తన భారత్‌లోని ఉత్పత్తి కేంద్రాల్లో 300 మందికి పైగా చైనా ఇంజనీర్లు, టెక్నీషియన్లను రీకాల్ చేసిందని బ్లూమ్‌బర్గ్ ఇటీవలి కథనాలు వెల్లడించాయి. భారత్‌లో ఐఫోన్-17 తయారీకి యాపిల్ సంస్థ సిద్ధమవుతున్న వేళ.. ఇది ఇబ్బందిగా మారనుంది. ఈ పరిస్థితిపై కేంద్రం స్పందించింది. దీన్ని తట్టుకొనేందుకు యాపిల్ సంస్థ వద్ద ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని విశ్వసిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నట్లు వార్తాసంస్థ పీటీఐ పేర్కొంది. ఇది ప్రధానంగా యాపిల్, ఫాక్స్‌కాన్‌లకు చెందిన విషయమని అధికార వర్గాలు అందులో పేర్కొన్నాయి.

బరాక్ ఒబామా 'అరెస్టు'!

» ఏఐ వీడియో పోస్ట్ చేసిన ట్రంప్



న్యూఢిల్లీ, జూలై 21: అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా లక్ష్యంగా.. ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ వివాదాస్పద చర్యకు పాల్పడ్డారు. ఒబామాను పోలీసులు అరెస్టు చేస్తున్నట్లు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా సృష్టించిన వీడియోను ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్' సోషల్‌లో పోస్ట్ చేశారు. ట్రంప్, ఒబామా ఇద్దరూ వైట్‌హౌస్‌లో కూర్చుని ముచ్చటించుకుంటుండగా.. ఎఫ్‌బీఐ పోలీసులు అక్కడికి వచ్చి ఒబామా రెక్కలు విరిచి బేడీలు వేసినట్లు, ట్రంప్ కాళ్ల వద్ద ఒబామా పడిపోయినట్లు ఈ వీడియోను సృష్టించారు. ఒబామాను అరెస్టు చేస్తుంటే ట్రంప్ చిరునవ్వులు చిందిస్తున్నట్లుగా వీడియోలో కనిపిస్తుంది. పైగా, 'చట్టానికి ఎవరూ అతీతులు కాదు' అన్న వ్యాఖ్య కూడా వీడియోలో కనిపిస్తుంది. అనంతరం ఒబామా ఖైదీ దుస్తుల్లో జైల్లో కటకటాల వెనక ఉన్నట్లుగా చిత్రీకరించారు. 2016 ఎన్నికల సమయంలో ట్రంప్ అధ్యక్షుడు కాకుండా అడ్డుకునేందుకు, ఎన్నికయ్యాక ఆయన పాలనను నియంత్రించేందుకు ఒబామా ప్రయత్నించారంటూ అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ ఇటీవల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ట్రంప్ ఎన్నికలో రష్యా ప్రమేయం ఉందన్నట్లుగా ప్రచారం చేసినట్లు ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ ఈ వీడియోను పోస్ట్ చేయడం సంచలనంగా మారింది. ట్రంప్ చర్యను నెటిజన్లు తప్పుబట్టారు. అయితే లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్ సంబంధాలు కొనసాగించినట్లుగా వార్తలు వస్తున్న వేళ.. దాని నుంచి దృష్టి మరల్చేందుకే ట్రంప్ ఈ చర్యకు దిగారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ముంబై రైళ్లలో పేలుళ్ల కేసులో ఆ 12 మందీ నిర్దోషులే

» నిందితులను హింసించి నేరం ఒప్పించారు

» బాంబే హైకోర్టు సంచలన తీర్పు

» ఉరిశిక్ష పడిన ఐదుగురు సహా నిందితులందరి విడుదలకు ఆదేశం

ముంబై, జూలై 21: ముంబై లోకల్ ట్రైన్లలో వరుస బాంబుపేలుళ్ల కేసులో శిక్షలుపడిన మొత్తం 12 మందినీ విడుదల చేయాలని బొంబాయి హైకోర్టు ఆదేశించింది. 2006 జూలై 11 నాటి ఈ ఘటనలో 189 మంది మరణించగా, 800మందికిపైగా గాయపడ్డారు. ఈ కేసులో నిందితులుగా పోలీసులు పేర్కొన్న 12 మందికి 2015 సెప్టెంబరు 30న మోకా (మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్) ప్రత్యేక కోర్టు శిక్షలు విధించింది. వీరిలో ఐదుగురికి మరణశిక్షను, మిగతావారికి యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. మరణశిక్షలు పడిన ఐదుగురు ఈ తీర్పును సవాల్ చేస్తూ బాంబే హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ ఎస్సీ చంద్రక్‌లతో కూడిన ప్రత్యేక బెంచ్ 8 నెలలపాటు ఈ పిటిషన్లపై విచారణ జరిపి గత నెల 31న తీర్పును రిజర్వు చేసింది. సోమవారం తుది తీర్పును వెలువరించింది. ఈ కేసులో అరెస్టు చేసిన 12 మందిని దోషులుగా నిర్ధారించే ఆధారాలేవీ ప్రాసిక్యూషన్ సమర్పించలేకపోయిందని 671 పేజీల తీర్పులో స్పష్టం చేసింది. తమ పిటిషనర్లను తీవ్ర చిత్రహింసలకు గురిచేసి నేరాన్ని ఒప్పించారన్న న్యాయవాది వాదనతో ఏకీభవించింది. పేలుళ్లకు ఏ రకం పదార్థం ఉపయోగించారనేది వివరించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని స్పష్టం చేసింది. ఘటన జరిగిన నాలుగేళ్లకు నిందితులను గుర్తించడానికి పరేడ్ నిర్వహించడం అసాధారణమని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. పౌరు లు చట్టం, కోర్టుల పట్ల ఉంచిన విశ్వాసాన్ని తక్కువచేసే విధంగా ప్రాసిక్యూషన్ చర్య ఉందని ఆక్షేపించింది. కాగా, ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజా ఠాకరే వాదనలు వినిపించారు. మహారాష్ట్రలోని పలు జైళ్లలో ఉన్న పిటిషనర్లు వీడియోకాన్ఫరెన్సింగ్ పద్ధతిలో విచారణలో పాల్గొన్నారు. మరణశిక్ష పడి నాగపూర్ కేంద్ర కారాగారంలో ఉన్న నవేద్ హుస్సేన్ ఖాన్ తన వాదనలు తానే వినిపించుకున్నారు. కాగా, హైకోర్టు తీర్పు విస్మయం కలిగించిందని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ అన్నారు. చెప్పారు.


చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

మా కుటుంబానికి సన్నిహితుడు



ఇటీవల కన్నుమూసిన సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను డాక్టర్ మోహన్‌బాబు పరామర్శించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని, నాటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు. కోట శ్రీనివాసరావు మరణించిన రోజున తాను హైదరాబాద్‌లో లేనని, అందుకే ఈ రోజు ఇలా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చాననీ మోహన్‌బాబు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కోట శ్రీనివాసరావు నాకు అత్యంత ఆప్తుడు. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. 'కన్నప్ప' సినిమా విడుదలైన రోజున నాకు ఫోన్ చేసిన 'సినిమా చాలా బాగుంది. విష్ణుకు మంచి పేరు వచ్చింది' అని చెప్పారు. 1987లో 'వీర ప్రతాప్' సినిమాలో మాంత్రికుడిగా ఆయనకు మెయిన్ విలన్‌గా అవకాశం ఇచ్చాను. ఆ తర్వాత మా బేనరులోనే కాకుండా బయటి చిత్రాల్లో కూడా ఇద్దరం కలసి నటించాం. ఏ పాత్ర అయినా అవలీలగా పోషించగల గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. అలాగే రకరకాల మాడ్యులేషన్స్‌లో డైలాగులు చెప్పగలిగిన నటుడు. మా కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, ఆయన మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటు' అన్నారు.

శరవేగంగా మ్యూజిక్ సెషన్స్



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'వీటీ15(వర్కింగ్ టైటిల్)' సినిమా మ్యూజిక్ సెషన్లు శరవేగంగా జరుగుతున్నాయి. థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్ - థమన్ కాంబినేషన్ మరోసారి అద్భుతమైన ఆల్బమ్ ఇవ్వబోతున్నారని, ఇప్పటికే రెండు పాటలు పూర్తయ్యాయని మేకర్స్ తెలిపారు. కాగా, ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మూడు మేజర్ షెడ్యూళ్లను ఇండియా, విదేశాల్లో చిత్రీకరించారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. త్వరలోనే టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

250 రోజుల షూటింగ్.. మూడేళ్ల కష్టం



రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తోన్న భారీ చిత్రం 'కాంతార చాప్టర్-1'. 'రాజకుమార', 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన హోంబలే ఫిల్మ్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు 'కాంతార చాప్టర్-1' మేకింగ్ వీడియోను విడుదల చేశారు. దాదాపు 250 రోజుల షూటింగ్, మూడు సంవత్సరాల కష్టాన్నంతా ఈ వీడియోలో చూపించారు. ఆర్ట్ డైరెక్టర్ వినేష్ ఆధ్యాత్మిక దృశ్యాలను అద్భుతంగా డిజైన్ చేశారు. కాగా, ఈ సినిమా అక్టోబరు 2న కన్నడ, హిందీ, తెలుగు, మలయాళం, తమిళం, బెంగాలీ, ఇంగ్లీష్ బాషల్లో రిలీజ్ కానుంది.



అన్నం పెట్టిన పరిశ్రమకు అండగా ఉంటా

పవన్ కల్యాణ్

'నిర్మాతలు కనుమరుగవుతున్న ఈ సమయంలో ఒక బలమైన చిత్రం నిర్మించి, ఒడుదొడుకులు తట్టుకొని నిలబడిన నిర్మాతకు అండగా ఉండాలనే ఉద్దేశంతో.. నా బిజీ షెడ్యూల్‌ని వదిలేసి, ప్రత్యర్థులు నన్ను విమర్శిస్తున్నా ఇక్కడికి వచ్చాను. ఎందుకంటే సినీ పరిశ్రమ నాకు అన్నం పెట్టింది. అలాంటి పరిశ్రమకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను' అని అన్నారు పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో చిత్రబృందం పాల్గొంది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ 'ఒక సినిమా చేయడమంటే ఎన్నో యుద్ధాలు చేయాలి. అది ఆర్థికంగా కావచ్చు, సృజనాత్మకంగా కావచ్చు. ప్రాంతీయ స్థాయి సినిమాని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి ఏ.ఎమ్.రత్నం. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా రత్నం పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి ప్రతిపాదించాను. ఆయన నా నిర్మాత అని కాదు.. ఇలాంటి వ్యక్తి ఉంటే సినీ పరిశ్రమ బాగుంటుందని ప్రతిపాదించాను. సినిమా అంటే నాకు అపారమైన గౌరవం. రత్నం లాంటి నిర్మాత ఇబ్బంది పడకూడదని ఈ సినిమాని నా భుజాలపైకి తీసుకున్నాను. కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతిభ ఉంటే ఎవరైనా సినీ రంగంలో రాణించవచ్చు. 'భీమ్లానాయక్' విడుదలైనప్పుడు అందరి సినిమాల టిక్కెట్లు వందల్లో ఉంటే, నా సినిమాకు పదుల్లో ఉండేవి. నేనెప్పుడూ రికార్డుల కోసం ప్రయత్నించను. అసలు నేను యాక్టర్ అవ్వాలనే కోరుకోలేదు. ఒక సగటు మనిషిగా జీవించాలనే ఆలోచన తప్ప నాలో ఏం లేదు. ఒక సినిమా చేయాలంటే చాలా కష్టం. హిట్లు, ఫ్లాప్స్ కాకుండా నేను అభిమానులు చూపే ప్రేమనే నమ్మాను. నా బలం మీ అందరి అభిమానమే. కీరవాణి అద్భుతమైన సంగీతం ఇచ్చారు. మనోజ్ పరమహంస ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు. చిత్రీకరణకు వారానికి ఐదు రోజుల్లో రోజూ రెండు గంటలే కేటాయించినా, దానికి తగ్గట్లు వర్క్ చేసిన టీమ్ కృషి వెలకట్టలేనిది. చిత్ర ప్రమోషన్స్ కోసం నిధి అగర్వాల్ ఎంతో కష్టపడ్డారు. ఈ విషయంలో ఆమెను అభినందించాలి. ఈ సినిమా సబ్జెక్ట్ నాకు చాలా ఇష్టమైనది. ఇందులో నేను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ ఉపయోగించిన క్లైమాక్స్‌లో 18 నిమిషాల ఫైట్ కంపోజ్ చేశా" అని అన్నారు. చిత్ర దర్శకుడు జ్యోతి కృష్ణ మాట్లాడుతూ '17వ శతాబ్దం మొఘల్స్ నేపథ్యంలో ఉండే సినిమా ఇది. ఆ సమయంలో ఔరంగజేబుకి, వీరమల్లు అనే కల్పిత పాత్రకి మధ్య జరిగే యుద్ధం ఈ సినిమా' అని చెప్పారు. నిర్మాత ఏ.ఎమ్ రత్నం మాట్లాడుతూ "నేను ఇన్ని సినిమాలు నిర్మించినా, ఇది చాలా స్పెషల్. ఇందులో పవన్‌కల్యాణ్ విశ్వరూపం చూస్తారు. ఈ చిత్రాన్ని నిర్మించినందుకు గర్వంగా ఉంది" అని తెలిపారు. నిర్మాత దయాకర్ రావు మాట్లాడుతూ "అభిమానులకు ఈ సినిమా విందుభోజనంలా ఉండబోతోంది. మీరు ఊహించిన దానికంటే ఎక్కువ వినోదం అందివ్వబోతున్నాం" అని చెప్పారు. నిధి అగర్వాల్ మాట్లాడుతూ "పవన్‌కల్యాణ్‌తో పనిచేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు, కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ కండ్రే, నటులు బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, సంగీత దర్శకుడు కీరవాణి తదితరులు పాల్గొన్నారు.



నెగెటివ్ పాత్రలకు సిద్ధమే

త్రిప్తి దిమ్రి

వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు త్రిప్తి దిమ్రీ. ఇటీవలె ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' సినిమాలో అవకాశం కొట్టేసిన ఆమె, దర్శకుడు విశాల్ భరద్వాజ్ చేసే చిత్రంలోనూ నటిస్తున్నారు. అలాగే, సిద్దార్థ్ చతుర్వేదితో ఆమె నటించిన 'ధడక్ 2' ఆగస్టు 1న ప్రేక్షకులు ముందుకు వస్తోంది. చిత్ర ప్రచారంలో భాగంగా ఆమె మీడియాతో కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "ఇందులో నేను కాలేజీ విద్యార్థిగా కనిపిస్తాను. నేనిప్పటివరకూ ఎన్నో కామెడీ, లవ్ చిత్రాల్లో నటించాను. కానీ యాక్షన్ జానర్‌లో రూపొందిన చిత్రాల్లో నటించలేదు. ఒకవేళ అటువంటి సినిమాల్లో అవకాశం వస్తే అస్సలు వదులుకోను. యాక్షన్ పాత్రలు చేయడం ద్వారా నా నటనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించొచ్చని భావిస్తా. కంటెంట్ బాగుంటే నెగెటివ్ పాత్రలు చేయడానికైనా సిద్ధమే" అని పేరొన్నారు.

టికెట్ ధరల పెంపునకు అనుమతి

తెలంగాణలో 'హరిహర వీరమల్లు' సినిమా టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలాగే సినిమా ముందు రోజు (ఈనెల 23న) రాత్రి 9 గంటలకు ప్రీమియర్ షోకు సైతం అంగీకరించింది. ఈ షోకు టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. ఈనెల 24 నుంచి 27 వరకు మల్టీప్లెక్స్‌లలో టికెట్‌పై రూ.200, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ.150 వరకు పెంచుకునేందుకు అనుమతినిచ్చింది. అలాగే ఈనెల 28 నుంచి ఆగస్టు 2 వరకు మల్టీప్లెక్స్‌లలో టికెట్‌పై రూ.150, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ.106 వరకు పెంచుకునేందుకు అనుమతిని ఇచ్చింది.

మేకోవర్ మొదలైంది



రామ్‌చరణ్ కథానాయకుడిగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు కీలక షెడ్యూళ్ల చిత్రీకరణను పూర్తి చేసింది చిత్ర బృందం. తదుపరి జరిగే షెడ్యూల్ కోసం బీస్ట్ లుక్‌లోకి మారిపోయారు రామ్‌చరణ్. ఈ సందర్భంగా కండలు తిరిగిన దేహంతో జిమ్‌లో కసరత్తులు చేస్తున్న పిక్‌ను రామ్‌చరణ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'పెద్ది' కోసం మేకోవర్ మొదలైంది. ఈ సవాలు కఠినమైనదైనా.. ఎంతో సంతోషాన్ని ఇస్తోంది" అని పేర్కొన్నారు. ఇప్పుడీ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. ఇటీవలె విడుదల చేసిన ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత రెట్టింపు చేసింది. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్ర శక్తిమంతంగా ఉండబోతోంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న చిత్రం విడుదలవుతోంది.

బెట్టింగ్ యాప్‌ల కేసు..

- రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండకు నోటీసులు
- మంచు లక్ష్మికి కూడా.. రేపు ఈడీ ముందుకు రానా
- ఆ తర్వాతి వరుసలో ప్రకాశ్ రాజ్

బెట్టింగ్ యాప్‌ల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్స్ చేసిన సినీ నటులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నోటీసులు జారీచేసింది. యాప్‌ల ప్రమోషన్ల వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఈడీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. మొత్తం 29 మంది సినీనటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్) నమోదు చేసిన ఈడీ.. తాజాగా నోటీసులు జారీచేసింది. ఈ నెల 23న తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ దగ్గుబాటి రానాకు నోటీసులు జారీ అయ్యాయి. జూలై 30న ప్రకాశ్‌రాజ్, ఆగస్టు 6న విజయ్ దేవరకొండ, ఆగస్టు 13న మంచు లక్ష్మిని తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా ఈడీ అధికారులు వారికి జారీ చేసిన నోటీసుల్లో స్పష్టం చేశారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేయడానికి కారణాలేంటి? వీరికి రెమ్యునరేషన్ ఏ రూపంలో అందింది? తదితర అంశాలపై ఈడీ వీరి వాంగ్మూలాన్ని రికార్డు చేయనుంది. హవాలా, మనీ లాండరింగ్ కోణాలపై ప్రధానంగా దృష్టి సారిస్తోంది. సినీ నటుల మాటలు నమ్మి లక్షల మంది అమాయకులు బెట్టింగ్ యాప్‌ల వలలో పడి, నిలువుదోపిడీకి గురైన విషయం తెలిసిందే..! కొందరైతే ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు.

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)



వివేకా హత్య కేసులో.. తదుపరి దర్యాప్తు అవసరమా?

- సీబీఐకి సుప్రీంకోర్టు ప్రశ్న
- కడప కోర్టులో ప్రభుత్వం వేసిన క్లోజర్ రిపోర్టుపై మీ వైఖరేంటి?
- కేసు ట్రయల్, తదుపరి విచారణ ఏకకాలంలో సాధ్యమేనా?
- ఈ 3 ప్రశ్నలకు సీబీఐ ఇచ్చే జవాబుల ఆధారంగా నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై నిర్ణయం
- ధర్మాసనం స్పష్టీకరణ.. విచారణ 5కి వాయిదా

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి కడప సెషన్స్ కోర్టులో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టుపై మీ అభిప్రాయమేంటని సీబీఐని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరమో కాదో చెప్పాలని కూడా స్పష్టంచేసింది. ఈ హత్య కేసులో నిందితులు వైఎస్ అవినాశ్ రెడ్డి, డి.శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, గంగిరెడ్డి తదితరుల బెయిల్ రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి, సీబీఐ దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం సుప్రీం కోర్టు ముందుకొచ్చాయి. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం అన్ని పిటిషన్లనూ కలిపి విచారించింది. సునీతారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని, ఆయన బయట ఉంటే దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సీబీఐని కోర్టు ఆదేశించింది. 'ఈ కేసులో ఇంకా తదుపరి దర్యాప్తు అవసరమని దర్యాప్తు సంస్థ భావిస్తోందా.. లేదా? రాష్ట్రప్రభుత్వం కడప సెషన్స్ కోర్టులో దాఖలుచేసిన క్లోజర్ రిపోర్టుపై సీబీఐ అభిప్రాయమేంటి? కేసు ట్రయల్, తదుపరి దర్యాప్తు ఏకకాలంలో కొనసాగించే అవకాశం ఉందా లేదా..' అని ప్రశ్నలు సంధించింది. దాని సమాధానాల ఆధారంగా నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. అలాగే.. బెయిల్ రద్దు పిటిషన్లను ట్రయల్ కోర్టు పరిశీలించిందా.. లేదా? ఒకవేళ పరిశీలించకుంటే.. వాటిపై విచారణ జరిపి నిర్ణయం తీసుకోవలసిందిగా ఆదేశిస్తామని పిటిషనర్లకు ధర్మాసనం స్పష్టంచేసింది. తదుపరి విచారణను ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేసింది.

30న నింగిలోకి 'నిసార్'

- జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగానికి ఇస్రో ఏర్పాట్లు

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో భూపరిశీలన ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. నాసా భాగస్వామ్యంతో రూపొందించిన నాసా-ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్ మిషన్ (నిసార్) ఉపగ్రహ ప్రయోగానికి వడివడిగా ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ నుంచి ఈనెల 30న జీఎస్ఎల్వీఎఫ్16 రాకెట్ ద్వారా 2,392 కిలోల బరువున్న 'నిసార్'ను ప్రయోగించనుంది. షార్‌లోని వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ మూడు దశల అనుసంధాన పనులతో పాటు ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను కూడా శాస్త్రవేత్తలు పూర్తిచేసి ప్రయోగానికి సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 4:40 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీఎఫ్16 రాకెట్ నింగిలోకి ఎగరనుంది. భూ పర్యావరణ వ్యవస్థలతో పాటు వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలను అధ్యయనం చేసేందుకు నిసార్‌ను కక్ష్యలోకి పంపుతున్నారు. ఈ ఉపగ్రహం అంతరిక్షంలోకి వెళ్లిన అనంతరం అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ భూగోళాన్ని స్కాన్‌చేసి డేటాను అందించనుంది.



జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ శిఖర భాగంలో నిసార్ ఉపగ్రహాన్ని అమర్చిన దృశ్యం

జోరుగా వర్షాలు

మెరుగైన వర్షపాతం..14 జిల్లాల్లో సాధారణ స్థితి

- పలు నగరాల్లో భారీ వర్షం
- నర్సీపట్నంలో 114 మి.మీ.
- మరో ఐదు రోజులు వర్షాలు

అమరావతి/విశాఖపట్నం/పోలవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షపాతం మెరుగుపడింది. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావం, రుతుపవనాల కదలికతో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 14 జిల్లాల్లో వర్షపాతం సాధారణ స్థితికి వచ్చింది. అయితే, మరో 12 జిల్లాల్లో లోటు నెలకొందని వాతావరణ నిపుణులు తెలిపారు. విజయనగరం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్షపాతం సాధారణ స్థాయికి చేరగా, శ్రీకాకుళం, మన్యం, కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో వర్షపాతం సాధారణం కన్నా తక్కువగా ఉంది. రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఈ నెల 21 వరకు 199.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 157.1 మిల్లీమీటర్లు నమోదైంది. మరోవైపు, గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ పంటలు జీవం పోసుకున్నాయి. ఈ నెల 24న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ విభాగం ప్రకటించింది. కాగా సోమవారం కోస్తా జిల్లాల్లో అనేక చోట్ల వర్షాలు పడ్డాయి. అలాగే మంగళవారం అల్లూరి సీతారామరాజు, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తాయని, మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.



ఏలూరు జిల్లా ముసునూరులో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపునీరు

24న అల్పపీడనం

రాష్ట్రంలో మరో ఐదు రోజులపాటు వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు, దక్షిణ ఒడిసా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో సోమవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నర్సీపట్నంలో 114, మందసలో 88.75, గొలుగొండలో 88.25, ఇనుమెల్ల(పల్నాడు జిల్లా)లో 80, అనకాపల్లి జిల్లా గంధవరంలో 78, పరవాడలో 71, ఏలూరు జిల్లా టి.నరసాపురంలో 67.75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దక్షిణ కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణశాఖ హెచ్చరించింది. కాగా, ఈ నెల 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది.



స్పిల్‌వే నుంచి వరద నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

స్వల్పంగా పెరిగిన గోదావరి

- పోలవరం నుంచి నీటి విడుదల

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఏలూరు జిల్లా పోలవరంలో గోదావరికి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో సోమవారం సాయంత్రానికి నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టులోకి వస్తున్న 1,09,622 క్యూసెక్కుల వరదను స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. స్పిల్‌వే ఎగువన 27.190 మీటర్లు, దిగువన 17.170 మీటర్ల మేర నీటిమట్టం నమోదైనట్టు పేర్కొన్నారు.



పార్లమెంటులో ఏపీ

ఐదేళ్లలో 610 కళాఖండాలు స్వాధీనం

- భారత్‌లో క్రిప్టోపై నియంత్రణ లేదు: లోక్‌సభలో కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఆస్ట్రేలియా, కెనడా, ఇటలీ, థాయిలాండ్, యూకే, యూఎస్ఏ నుంచి మొత్తం 610 భారతీయ కళాఖండాలను స్వాధీనం చేసుకున్నామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. సోమవారం, లోక్‌సభలో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గోలింగేశ్వర ఆలయానికి చెందిన నంది శిల్పాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. అక్రమ విదేశీ క్రిప్టో కరెన్సీ ప్లాట్‌ఫామ్‌లపై కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ మహేష్ అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో క్రిప్టో కరెన్సీ లేదా వర్చువల్ ఆస్తులు నియంత్రణలో లేవని, ఈ కారణంగా ఏ ప్లాట్‌ఫామ్ చట్టబద్ధమో, చట్టవిరుద్ధమో అనే అంశం స్పష్టంగా నిర్ణయించబడలేదని పేర్కొన్నారు.

ఏపీ, తెలంగాణలో తలసరి ఆదాయాల పెరుగుదల

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో నికర దేశీయోత్పత్తి ఆదాయం గత పదేళ్లలో 78.9 శాతం, తెలంగాణలో 85.3 శాతం పెరిగిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ 2013-14లో ఏపీలో నికర దేశీయోత్పత్తి రూ.79174 కాగా 2024-25లో అది రూ. 1,41,609కు చేరుకుందని ఆయన తెలిపారు. కాగా, 2023-24లో ఏపీలో నికర దేశీయోత్పత్తి రూ.1,31,083 కాగా అది ఏడాదిలోనే రూ. పదివేలకు పైగా పెరిగి 1,41,609కి చేరుకోవడం గమనార్హం. ఇక తెలంగాణలో 2023-24లో నికర దేశీయోత్పత్తి రూ. 1,77,000 కాగా, అది 2024-25లో రూ.పదివేలకు పైగా పెరిగి రూ. 1,87,912కు చేరుకుంది. గత పదేళ్లలో తెలంగాణలో నికర దేశీయోత్పత్తి 85.3 శాతం పెరిగిందని చెప్పారు.

పది కంపెనీల మోసాలపై దర్యాప్తు

గత ఏడాదిలోనే ఏపీలో పది కంపెనీల తీవ్రమైన మోసాలకు సంబంధించి దర్యాప్తు ప్రారంభమైందని కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష మల్హోత్రా చెప్పారు. లోక్ సభలో టీడీపీ ఎంపీ బీకే పార్థసారథి ప్రశ్నకు సమాధానమిస్తూ రియల్ ఎస్టేట్, వ్యవసాయోత్పత్తి, ఆహార పదార్థాల ఉత్పత్తి, లోహాలు, ఇతర ఉత్పత్తులకు సంబంధించి దాదాపు పది కంపెనీలపై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయం దర్యాప్తు జరుపుతోందని, డమ్మీ డైరెక్టర్లతో నడుస్తున్న ఒక పేపర్ కంపెనీ కుంభకోణంపై దర్యాప్తు పూర్తయిందని తెలిపారు.

సైట్ క్లియరెన్స్ కోసం ఏపీ దరఖాస్తు

- కుప్పం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంపై రాజ్యసభలో కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కోసం సైట్ క్లియరెన్స్ అనుమతుల కోసం రాష్ట్రప్రభుత్వం గత జూన్‌లో దరఖాస్తు చేసిందని కేంద్ర పౌర విమాన సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం వారానికి 1194 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయని పేర్కొన్నారు. సోమవారం, రాజ్యసభలో టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 2008లో కేంద్రం తీసుకొచ్చిన విధానాన్ని అనుసరించి 2016లో ఓర్వకల్లు(కర్నూలు), దగదర్తి (నెల్లూరు), భోగాపురం(విజయనగరం) విమానాశ్రయాలకు 'ఇన్-ప్రిన్సిపల్' ఆమోదం ఇచ్చిందని తెలిపారు. దగదర్తికి సంబంధించి, 2018లో ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం జరిగిందని, అయితే ఆ ఒప్పందాన్ని గత ఏపీ ప్రభుత్వం రద్దు చేసిందని కేంద్రమంత్రి మురళీధర్ తెలిపారు.

ఏపీకి 'పీఎం ఉపాధి' కింద ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో ప్రధానమంత్రి ఉపాధి హామీ పథకం(పీఎంఈజీపీ) ద్వారా రూ.445.74 కోట్ల మేర మార్జిన్ మనీ, సబ్సిడీలు వినియోగించుకున్నట్లు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. రాజ్యసభలో ఎంపీ బీద మస్తాన్‌రావు అడిగిన ఒక ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ.. 2022-23 నుంచి 2024-25 వరకు మొత్తం 11,899 యూనిట్లు స్థాపనతో, 95,192 మంది లబ్ధిదారులకు ప్రత్యక్ష ఉపాధి లభించిందన్నారు.

సంక్షేమ హాస్టళ్లపై ఇంత నిర్లిప్తతా?

- వాటి దుస్థితి తెలియనట్లు ఉంటారా?
- అధికారులపై హైకోర్టు మండిపాటు
- మౌలిక వసతులు మెరుగవకుంటే ముఖ్యకార్యదర్శులను బాధ్యులను చేస్తాం
- వసతుల కల్పనపై ప్రతి నెల నివేదికలు ఇవ్వండి
- సీఎస్‌కు హైకోర్టు ధర్మాసనం ఆదేశం
- తదుపరి విచారణ వచ్చేనెలకు వాయిదా

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ, బీసీ, గురుకుల హాస్టళ్లలో వసతుల కల్పన విషయంలో అధికారుల నిర్లిప్తతపై హైకోర్టు మండిపడింది. జిల్లాస్థాయిలో అధికారులు హాస్టళ్లను సందర్శించి, పరిస్థితులు చక్కదిద్దకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. హాస్టళ్లలో పరిస్థితులు దయనీయంగా ఉంటే అధికారులు ఏమీ తెలియనట్లు ఎలా ఉంటున్నారని నిలదీసింది. నిర్వహణకు ఏటా ఖర్చుచేస్తున్న కోట్లాది రూపాయలు ఎటుపోతున్నాయి? కాంట్రాక్టర్ల లబ్ధికోసం పనులు చేస్తున్నారా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. విద్యార్థులకు బెడ్లు అందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఇంట్లో మన చిన్నారులను కింద పడుకోపెడతామా? అని సూటిగా ప్రశ్నించింది. బెడ్లు లేదా పరుపులు అందించేందుకు అవసరమైతే అదనపు బడ్జెట్ కేటాయించాలని సీఎస్ విజయానంద్‌కు సూచించింది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్(ఎన్‌సీపీసీఆర్) మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు, పౌష్టికాహారం, బెడ్లు, బెడ్ షీట్లు, మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని గుర్తుచేసింది. హాస్టళ్లలో వసతులను మెరుగుపరిచే విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సాంఘిక, బీసీ, గురుకుల సంక్షేమశాఖల ముఖ్యకార్యదర్శులను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. మీరు జోక్యం చేసుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం దొరకదని, వ్యక్తిగత హాజరుకు అందుకే ఆదేశించామని సీఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. జిల్లాస్థాయిలో సీనియర్ అధికారులు క్రమం తప్పకుండా హాస్టళ్లను తనిఖీ చేసేలా చూడాలని పేర్కొంది. సంబంధిత అధికారుల పేర్లు, ఎప్పుడెప్పుడు వారు హాస్టళ్లను సందర్శించారనే వివరాలను కోర్టు ముందు ఉంచాలని, వసతుల మెరుగుదలకు సంబంధించి స్థాయీ నివేదికలను ప్రతీనెల తమ ముందుంచాలని సీఎస్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను నెలరోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.



పనులు జరుగుతున్నాయి: సీఎస్

సంక్షేమ హాస్టళ్లలో మౌలికసదుపాయాలు కల్పించకపోవడాన్ని సవాల్ చేస్తూ కాకినాడకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్ గత విచారణల సందర్భంగా, ప్రతీ జిల్లాలో కనీసం 5 సంక్షేమ హాస్టళ్లను పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ధర్మాసనం ఆదేశించింది. వారిచ్చిన నివేదికలను చూసి హాస్టళ్లలో దుస్థితిపై విస్మయం వ్యక్తం చేసింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు నిర్దిష్ట ప్రతిపాదనలతో తమ ముందు హాజరుకావాలని సీఎస్‌ను ఆదేశించింది. సోమవారం విచారణకు సీఎస్ విజయానంద్ ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీజే స్పందిస్తూ.. నివేదికను పరిశీలిస్తే వసతి గృహాల్లో కనీస మౌలిక వసతులు లేనట్లు తేలిందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితి దురదృష్టకరమని చెప్పారు. విజయనగరం జిల్లాలోని అంధుల పాఠశాలలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సీఎస్ విజయానంద్ బదులిస్తూ.. సంక్షేమ హాస్టళ్లలో వసతుల మెరుగుదలపై అధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించానన్నారు. అవసరమైన చోట నూతన భవనాల నిర్మాణంతో పాటు హాస్టళ్లలో వసతులను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. టెండర్లు పిలిచామని, కొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయని కోర్టుకు తెలిపారు. వచ్చే ఏడాది, రెండేళ్లలో చేపట్టే పనుల వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు. పరుపులు అందించే నిబంధన లేదని, విద్యార్థులు పడుకొనేందుకు వీలుగా కార్పెట్లు, మందపాటి దుప్పట్లు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. ఈ ఏడాది జనవరిలో నర్సీపట్నం హాస్టల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారులు సందర్శించినపుడు మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం అవి అన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు. విజయనగరం అంధుల పాఠశాలకు డిప్యుటేషన్ విధానంలో సహాయకులను నియమించామన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జి.అరుణ్‌శౌరి వాదనలు వినిపిస్తూ... వసతులు మెరుగుపర్చేందుకు సరిపడా నిధులు విడుదల చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు.

నాడు పగలకొట్టాలని.. నేడు బిగిస్తారా?

- అదానీకి లబ్ధి కోసమే స్మార్ట్ మీటర్లు: సీపీఐ రామకృష్ణ

విజయవాడ(ధర్నాచౌక్), జూలై 21(ఆంధ్రజ్యోతి): నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలకొట్టాలని పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చాక బిగించడం సరైందేనా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లు, నూతన షిఫ్ట్ ఆపరేటర్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, పర్మినెంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో 'చలో విజయవాడ'లో భాగంగా ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన అదానీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఎక్కడా స్మార్ట్ మీటర్లు బిగించడం లేదు: మంత్రి గొట్టిపాటి

రాష్ట్రంలో రైతులకు ఎక్కడా స్మార్ట్ మీటర్లు బిగించడం లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పరిశ్రమల కేంద్రంలో మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల వలన ఎలాంటి నష్టం ఉండదని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో విద్యుత్ శాఖ అభివృద్ధి కోసం ఒక్క పని కూడా చేయలేదన్నారు. జగన్ పాలనలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. తాము అలాంటి నిర్ణయం తీసుకోకపోయినప్పటికీ వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు.

టీచర్ల జీతాల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలి

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన, పదోన్నతులు పొందిన టీచర్లకు జీతాల చెల్లింపులో ఏర్పడిన జాప్యాన్ని నివారించాలని యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కొత్త పొజిషన్ ఐడీలు రాకపోవడంతో వారికి జీతాలు నిలిచిపోయాయని, ఆర్థిక శాఖ నుంచి జీవో విడుదల చేసి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, బదిలీలు, పదోన్నతుల వల్ల జీతాలు ఆగిపోయిన టీచర్లకు వెంటనే జీతాలు వచ్చేలా జీవో జారీ చేయాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. కేబినెట్ ఆమోదం వరకు వేచి చూడకుండా తొలుత జీవో జారీచేసి, ఆ తర్వాత కేబినెట్‌లో రాటిఫై చేయాలని కోరారు.

కొత్త లా కాలేజీల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

- నోటిఫికేషన్ జారీచేసిన ఉన్నత విద్యామండలి

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త న్యాయ కళాశాలల ఏర్పాటుకు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీచేసింది. ఆసక్తి కలిగిన సొసైటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆగస్టు 8 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, సెప్టెంబరులో తనిఖీలు నిర్వహించి, అదే నెల 29న అనుమతుల ఉత్తర్వులు జారీచేస్తారని వివరించింది. కాలేజీల ఏర్పాటుకు విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు నగరాల్లో వెయ్యి మంది వరకు విద్యార్థులకు అయితే ఒక ఎకరం, వెయ్యి దాటితే రెండు ఎకరాలు ఉండాలని తెలిపింది. ఇతర ప్రాంతాల్లో అయితే వెయ్యి మంది లోపు విద్యార్థులకు రెండు ఎకరాలు, వెయ్యి మంది దాటితే నాలుగు ఎకరాలు ఉండాలని పేర్కొంది. తరగతి గదులు, మూట్ కోర్ట్ హాల్, టీచర్స్ రూమ్, లైబ్రరీ ఇలా 13 కేటగిరీల్లో ఎంత స్థలం ఉండాలనేది వివరించింది.

ఎంఫార్మసీ అడ్మిషన్లకు త్వరలో సవరణ షెడ్యూలు

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎంఫార్మసీ అడ్మిషన్లకు త్వరలో సవరణ షెడ్యూలు ప్రకటిస్తామని ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. ఫార్మసీ కౌన్సిల్ నుంచి అన్ని కాలేజీలకూ అనుమతులు రానందున తాత్కాలికంగా ఈ మేరకు మార్పులు చేయనున్నట్లు తెలిపింది. ఇప్పటికే విడుదల చేసిన పీజీఈసెట్ షెడ్యూలు ఎంటెక్ ప్రవేశాలకు వర్తిస్తుందని స్పష్టంచేసింది.

దశలవారీగా రెవెన్యూ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ

అమరావతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులు, నూతన చట్టాలు, రూల్స్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు రెవెన్యూశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు.. జిల్లా స్థాయిలో అన్ని మండల కార్యాలయాల్లో గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్ఏ)ల నుంచి తహసీల్దారు వరకు, విభాగాధిపతి ఆఫీసుల్లో సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్ వరకు ఉద్యోగులకు కీలకాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్ఆర్‌డీఐ)లో ఉద్యోగులకు దశల వారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం రూ.50 లక్షలను హెచ్ఆర్‌డీకి చెల్లించేందుకు పరిపాలనా అనుమతి ఇస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి జీఓ-745 జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏను ప్రభుత్వం ఆదేశించింది.

డీజీపీ గుప్తాకు విజిలెన్స్ అదనపు బాధ్యతలు

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా హరీశ్ కుమార్ గుప్తాకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ద్వారకా తిరుమల రావును డీజీపీగా నియమించిన ప్రభుత్వం, హరీశ్ కుమార్ గుప్తాను విజిలెన్స్ డీజీగా నియమించింది. ఈ ఏడాది జనవరి 31న తిరుమల రావు పదవీ విరమణ చేయడంతో హరీశ్ కుమార్ గుప్తాకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయనకు రెండేళ్ల పాటు డీజీపీగా కొనసాగించేందుకు యూపీఎస్‌సీ సెలక్షన్ కమిటీ సిగ్నలివ్వడంతో ఏపీ ప్రభుత్వం మే చివరి వారంలో హరీశ్ కుమార్ గుప్తాను నియమించింది. తాజాగా, విజిలెన్స్ డీజీగా ఎఫ్ఏసీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి ఆచరణాత్మక అడుగులు: మంత్రి కొండపల్లి

అమరావతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఎంఎస్ఎంఈ అభివృద్ధి, వనరుల కార్యాలయంలో రెగ్యులర్ జాయింట్ డైరెక్టర్‌గా ఆర్.సెంథిల్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె.శివరామ్‌ప్రసాద్‌లను నియమించడంపై రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నియామకాలతో రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ఆచరణాత్మక అడుగులు పడతాయని, కేంద్ర పథకాల ద్వారా లభించే రాయితీలు, ఇతర వనరుల కల్పన సులువుగా మారుతుందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించి ఈ నియామకాలు చేసిన కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి జితన్‌రామ్ మాంఝీకి ధన్యవాదాలు తెలిపారు.

యూరియా అక్రమ రవాణా నిరోధించాలి: అగ్రి డైరెక్టర్

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పంటల సాగు కోసం వినియోగించాల్సిన యూరియా పక్కదారి పట్టకుండా క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం నిఘా పెట్టి, పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు సూచించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించే పద్ధతులను తెలిపే వాల్‌పోస్టర్లను సోమవారం అన్ని జిల్లాల్లో జరిగిన గ్రీవెన్సుల్లో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని వ్యవసాయశాఖ ప్రధాన కార్యాలయం నుంచి డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ.. వ్యవసాయేతర అవసరాలకు యూరియాను అక్రమంగా రవాణా కాకుండా నిరోధించేందుకు ఎరువుల నియంత్రణ చట్టం 1985-క్లాజ్ 25 ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను కోరారు.

ఆయిల్‌పామ్ ధరల ఫార్ములా ఖరారు

అమరావతి, జూలై21(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ గెలలకు ధరల ఫార్ములాను ఖరారు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిం ది. 2023-24కి తాజా పండ్ల గెల(ఎఫ్ఎఫ్‌బీ)ల్లో నూనె నిష్పత్తి శాతం 19.17%, గింజల శాతం 10.25%, 2024-25 సంవత్సరానికి నూనె నిష్పత్తి శాతం 19.42%, గింజల శాతం 10.15%గా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం తాత్కాలికంగా టన్ను ధర రూ.17,180 అమల్లో ఉండగా, ఫార్ములా ఖరారు ప్రకారం టన్నుకు రూ.200 పెరుగుతుందని అధికారులు తెలిపారు.

మరో 6 ఉమ్మడి జిల్లాల్లో సీనరేజీ కాంట్రాక్టు

- టెండర్ల ద్వారా ఏజెన్సీల ఎంపిక.. గనుల శాఖకు సర్కారు అనుమతి

అమరావతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పూర్తిస్థాయిలో గనుల సీనరేజీ వసూళ్ల కాంట్రాక్టును ప్రైవేటుకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గనులశాఖకు పరిపాలనా అనుమతి ఇచ్చింది. నిజానికి గత వైసీపీ ప్రభుత్వంలో 2021లోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే.. ఏడు ఉమ్మడి జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, గుంటూరు, చిత్తూరు, కడప, అనంతపురంలోనే సీనరేజీ కాంట్రాక్ట్‌ను అమలు చేశారు. మిగిలిన ఆరు జిల్లాలైన విశాఖపట్నం, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలులో గనుల శాఖనే సీనరేజీ వసూళ్లు చేసింది. తాజాగా.. ఈ ఆరు జిల్లాల్లో సీనరేజీ వసూళ్లను గనులశాఖ నుంచి తప్పించి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. టెండర్ల ద్వారా ప్రైవేటు ఏజెన్సీలను ఎంపిక చేయాలని గనులశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు (జీవో 127) జారీచేశారు. కూటమి ప్రభుత్వం జారీచేసిన జీవో 56, 75ల ఆధారంగా టెండర్ విధివిధానాలు, బేస్‌ప్రైస్ ఉండాలని స్పష్టం చేశారు. ఈ మేరకు టెండర్ నిబంధనలు రూపొందించాలని గనులశాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.

13 ఉమ్మడి జిల్లాలకు టెండర్లు..

తాజా ఆదేశాల మేరకు 13 ఉమ్మడి జిల్లాలకు సీనరేజీ వసూళ్ల కాంట్రాక్ట్ (ఎస్‌సీసీ)ను అమలు చేయనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన టెండర్లు నిర్వహించి ప్రైవేటు ఏజెన్సీలను ఎంపిక చేసేలా గనులశాఖ డైరెక్టర్.. విధివిధానాలు రూపొందించాలి. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వం 2021లో ఇచ్చిన 7 ఉమ్మడి జిల్లాల కాంట్రాక్ట్ ఇప్పటికే ముగిసింది. వీటితోపాటు కొత్తగా కూటమి ప్రభుత్వం మరో ఆరు ఉమ్మడి జిల్లాల్లోనూ ఎస్‌సీసీ కాంట్రాక్ట్‌ను అమలుచేయాలని తాజాగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకేసారి 13 జిల్లాలకు కలిపి టెండర్లు నిర్వహించే అవకాశం ఉంది.

విభజన హామీలు నెరవేర్చాలి: సుంకర పద్మశ్రీ

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ విభజన హామీలు నెరవేర్చాలని ఏపీ కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినోత్సవాన్ని ఏపీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఖర్గేను పద్మశ్రీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం.. ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ ఏపీ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, అమరావతి రాజధానిని త్వరగా పూర్తి చేయాలని అన్నారు.

నేత ముసుగులో నేరస్థుడు జగన్

▸ ఎంపీ అరెస్టు వెనుక రాజకీయ దురుద్దేశం లేదు: అనిత



మడకశిర, ఒంగోలు, తిరుపతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రాజకీయ నాయకుడి ముసుగులో ఉన్న నేరస్థుడని హోం మంత్రి వంగలపుడి అనిత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'జగన్ నేరస్థుడు కాబట్టే ఆయన అండ్ కో కూడా వైసీపీ హయాంలో అక్రమాలు, అవినీతికి పాల్పడింది. రాష్ట్రాన్ని ఐదేళ్లు దోపిడీ చేశారు. వారి అక్రమాలను బయటపెట్టి సాక్ష్యాధారాలతో అరెస్టు చేస్తున్నాం. దాన్ని రాజకీయంగా వాడుకోవాలని ప్రయత్నించడం నీచం. ఒక ఎంపీని ఆధారాలు లేకుండా అరెస్టు చేయడం సాధ్యమా..? ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు వెనక ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవు. వారు చేసిన అవినీతి, అక్రమాలు బయటపడినా కూటమి ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగడం వారి నైజం. ఇంత జరుగుతున్నా జగన్ మాత్రం అక్రమార్కులను, మహిళలను విమర్శించే వారినే వెనకేసుకొస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్నందున మిథున్‌రెడ్డి అంశంపై నేను మాట్లాడలేను. అక్రమాలకు పాల్పడినవారు మూల్యం చెల్లించుకోక తప్పదు' అని మంత్రి అనిత చెప్పారు.

లిక్కర్ స్కాంలో ఎంతటి వారైనా జైలుకే: గొట్టిపాటి



గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటుచేసుకున్న లిక్కర్ స్కాంలో ప్రమేయం ఉన్న ఎంతటి వారైనా జైలుకు వెళ్లాల్సిందేనని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం ఒంగోలులో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'వైసీపీ పాలకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారు. జే బ్రాండ్ వలన ఎందరో ప్రాణాలు కోల్పోయారు' అని మంత్రి ఆరోపించారు.

మద్యం కుంభకోణంలో చట్టం
తనపని తాను చేసుకుపోతుంది: జనార్దనరెడ్డి



వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో చట్టం తనపని తాను చేసుకుపోతుందని మంత్రి బీసీ జనార్దనరెడ్డి చెప్పారు. తిరుపతిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ తీరు చూస్తుంటే, దొంగే దొంగా దొంగా అన్నట్లు ఉంది. కక్షపూరిత రాజకీయాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్. రాష్ట్రంలో ఇసుక, మద్యం కుంభకోణం జరిగిందని పిల్లోడిని అడిగినా చెబుతారు. అసలైన నిందితులు ఎవరనేది, దర్యాప్తు సంస్థ విచారణ చేస్తోంది. నిందితులకు శిక్ష తప్పదు! ఈ డబ్బు ఎక్కడికెళ్లింది, త్వరలో బయటకు వస్తుంది. కక్ష సాధింపులు లేవు కాబట్టే, మాకు ప్రజలు అధికారం ఇచ్చారు' అని మంత్రి జనార్దనరెడ్డి చెప్పారు.

హంతకుడికన్నా ఆర్థికనేరగాడితోనే ప్రమాదం

▸ మద్యం స్కాంలో రెవెన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేయాలి: యనమల



అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో జగన్ దోచుకున్న రూ.3,500 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేయాలని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఓ ప్రకటనలో కోరారు. హత్య చేసిన వ్యక్తి కంటే ఆర్థిక నేరస్థుడు చాలా ప్రమాదకరమని, ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు కూడా చెప్పిందన్నారు. మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డిది మాస్టర్ మైండ్ అయితే, ప్రధాన లబ్ధిదారుడు జగనే అన్నారు. మద్యం కేసును కక్షపూరిత కేసని వైసీపీ నేతలు చెప్పటం నేరం నుంచి తప్పించుకునేందుకే నిందితులు ఆడే మైండ్ గేమ్‌గా యనమల అభివర్ణించారు. జగన్, అతని అనుచరులు అవినీతితో కోటీశ్వరులైతే... రాష్ట్రం అప్పుల పాలైందని అన్నారు.

తాడేపల్లి దొంగల ముఠా బిగ్‌బాస్ ఎవరో తెలిసింది

▸ పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు మద్దతివ్వాలి: అచ్చెన్నాయుడు




పెందుర్తి (విశాఖపట్నం), కొత్తవలస, జూలై 21(ఆంధ్రజ్యోతి): మద్యం ముడుపుల్లో బిగ్‌బాస్ ఎవరో ప్రజలకు తెలిసిపోయిందని, తాడేపల్లి ప్యాలెస్ దొంగల ముఠా నాయకుడి గుట్టును సిట్ రట్టు చేసిందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వైసీపీ పాలనలో మద్యం కుంభకోణాన్ని సిట్ అధికారులు ఆధారాలతో సహా వెలికితీశారన్నారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలం గుర్రంపాలెంలో, విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో సోమవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెందుర్తి మండలం గుర్రంపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో అచ్చెన్న మాట్లాడుతూ... ప్రస్తుతం రాష్ట్రంలో చేతల ప్రభుత్వం ఉందని, ప్రజలు వైకుంఠపాళి ఆటలాడకుండా పనిచేసే ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన వైసీపీ.. గత ఐదేళ్లలో విధ్వంసం సృష్టించిందని, పారిశ్రామికవేత్తలను భయపెట్టి రాష్ట్రం నుంచి పారిపోయేలా చేసిందని విమర్శించారు. విజనరీ నేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండడం వల్లే దెబ్బతిన్న వ్యవస్థలను, కుదేలైన ఆర్థిక స్థితిని గాడిన పెడుతున్నారన్నారు.

అలా ఎవరైనా అంటే.. చెంప చెళ్లుమనిపించండి..

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదంటూ ఏ నాయకుడైనా గ్రామాలకు వచ్చి తప్పుడు ప్రచారం చేస్తే వాళ్ల చెంప చెళ్లమనిపించాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్‌లాంటి భూతాన్ని మళ్లీ రానీయొద్దని, ఈసారి ఆ భూతాన్ని 100 అడుగులు గొయ్యితీసి కప్పేయాలని పిలుపునిచ్చారు. ఆ భూతం మళ్లీ వస్తే రాష్ట్ర ప్రజలే మరోసారి నష్టపోతారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.

రోజా.. రోజులు లెక్కపెట్టుకో!

▸ మరో 10 రోజుల్లో జైలుకెళ్లడం తప్పదు: శాప్ చైర్మన్




తిరుపతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న మాజీ మంత్రి రోజా ఊచలు లెక్కపెట్టుకునే రోజులు దగ్గరపడ్డాయని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మరో పది రోజుల్లో రోజా కూడా జైలుపాలవడం తప్పదన్నారు. ఏయే శాఖల్లో అవినీతికి పాల్పడిందో అన్నీ తేలుస్తామన్నారు. చట్టపరంగానే చర్యలుంటాయని వివరించారు. వైసీపీ దొంగల పార్టీ అని ముద్రపడేందుకు తిరుపతి ఉప ఎన్నికే కారణమని.. దీనిపై ఎన్నికల కమిషన్‌కు లేఖ కూడా రాశామన్నారు. 'రోజా తన శాఖల ద్వారా చేసిన అభివృద్ధి శూన్యం. సభ్యసమాజం తలదించుకునేలా నోరు పారేసుకోవడమే ఆమె పని. జగన్ ఓడిపోవడానికి ఒక రకంగా ఆమె కూడా కారణమే. సీఎం చంద్రబాబును దుర్భాషలాడిన నీచ సంస్కృతి ఆమెది. లోకేశ్, పవన్‌కల్యాణ్, నాగబాబు, చిరంజీవి, బాలయ్యలను ఇష్టానుసారంగా మాట్లాడి వారి తల్లులను అవమానిస్తూ నోరుపారేసుకుంది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌ను 'కొడకా..' అంటూ నువ్వు చేసిన వ్యాఖ్యలు సరైనవేనా రోజా? నువ్వైతే ఇష్టానుసారం మాట్లాడేయవచ్చా' అని నిలదీశారు. మహిళలను కించపరిచే ఆమె.. మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రవినాయుడు చెప్పారు.

కిడ్నీలు పిండేశారు!


జగన్ మద్యం మూత్రపిండాలను దారుణంగా పిండేసింది. నాసిరకం మద్యం నేరుగా కిడ్నీలపై ప్రభావం చూపింది. 2014-15లో 7,427 మందిలో కిడ్నీ సమస్యలు తలెత్తాయి. ఆ సంఖ్య... 2019-20కి 15,363కు పెరిగింది. 2023-24కు ఏకంగా 23,553కు చేరింది. మొత్తంగా 2014-19 మధ్యకాలంలో మద్యంవల్ల 49,060 మంది కిడ్నీ సమస్యలతో బాధపడగా... 2019-24లో ఆ సంఖ్య 90,385 వేలకు పెరిగింది. మొత్తంగా కిడ్నీ కేసులు 84% పెరిగాయి. వీరిలో అనేకమంది ఇప్పటికీ డయాలసిస్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు.

"అందులో ఏం కలుపుతారో... ఏమో! తాగిన మూడు నాలుగు గంటలకే మళ్లీ మందువైపు మనసు లాగేస్తుంది. ఎంతగా నియంత్రించుకున్నా కుదరదు. మళ్లీ ఆ మందు తాగితేనే శరీరం అదుపులో ఉంటుంది. ఇలా రోజుకు మూడునాలుగు సార్లు జగన్ మందు తాగాల్సిందే. లేదంటే ఆ రోజు బతకలేమన్నంతలా చేసేస్తుంది!"

... జగన్ హయాంలో మందుకు బానిసైన వ్యక్తి చెప్పిన మాటలివి. జగన్ ఇచ్చిన మందు అంతలా జనాన్ని పిచ్చోళ్లను చేసింది.



జగన్ ధనాశకు జనం బలి!



(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం... సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య జగన్ హయాంలో ఒక్కసారిగా పెరిగిపోయింది. కిడ్నీ, లివర్, నరాల వ్యాధిగ్రస్తుల సంఖ్య బయటపడింది. వీరంతా 'ఆరోగ్యశ్రీ' (ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ) పరిధిలో చికిత్స చేయించుకున్న వారు మాత్రమే. ఆ పథకం పరిధిలోకి రాని, ఇతర రాష్ట్రాల్లో వైద్యం చేయించుకున్న వారి సంఖ్య దీనికి అదనం. ప్రాణాలు కోల్పోయిన వారి లెక్కలూ తేలలేదు.

ఔను... విషం!

నాసిరకం మద్యంతో నాడీ వ్యవస్థ నిర్వీర్యమవుతుంది. కిడ్నీలూ, కాలేయం దెబ్బతింటాయి. జే-బ్రాండ్లతో ఇదే జరిగింది. 2014-19 మధ్యకాలంలో కేవలం మద్యంతో లివర్ దెబ్బతిని, చికిత్స పొందిన వారి సంఖ్య 14,026. 2019-24 మధ్య ఆ సంఖ్య ఏకంగా 29,369కి పెరిగింది. జగన్ అధికారంలోకొచ్చిన 2019-20లోనే లివర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య స్వల్పంగా పెరిగింది. కరోనా కారణంగా ఆ తర్వాతి సంవత్సరం తగ్గినా... 2021-22 నుంచి పెరుగుతూ పోయింది. 2019-20లో మద్యం కారణంగా కాలేయం దెబ్బతిని చికిత్స పొందినవారి సంఖ్య 1492కాగా... జగన్ హయాంలో చివరి ఏడాది 2023-24లో అది 11,223కు చేరింది. మొత్తంగా ఐదేళ్లలో లివర్ బాధితుల సంఖ్య 14,026 నుంచి 29,369కి పెరిగింది. అంటే... రెట్టింపు కంటే ఎక్కువ! వీరిలో 24,519 మంది పురుషులే.

చచ్చుపడ్డ నరాలు...

జగన్ ఇచ్చిన నాసిరకం మద్యం తాగి వేల మంది నరాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ మద్యం దెబ్బకు నరాలు చచ్చుపడ్డాయి. 2014-19 మధ్యలో నరాల సమస్యలతో బాధపడేవారి సంఖ్య కేవలం 1,276 మాత్రమే ఉండేది. 2019-24 మధ్య ఆ సంఖ్య 12,663కి పెరిగింది. అంటే... దాదాపు పదిరెట్లు అధికం! నిజానికి.. మద్యం నరాల మీద పెద్దగా ప్రభావం చూపదు. మత్తు దిగిన తర్వాత సాధారణ స్థితిలోకి వస్తారు. కానీ.. జగన్ ఇచ్చిన నాసిరకం మద్యం మాత్రం నేరుగా నరాలపైనే ప్రభావం చూపింది. ఇది దీర్ఘకాలికంగా కొనసాగడంతో మెదడుపై దుష్ప్రభావం పడింది. నరాల సమస్య మనిషిని ఏ పనీచేయలేక, బయటకు వెళ్లలేక ఒంటరిని చేస్తుంది.

మధ్య వయస్సుపై మహమ్మారి

జగన్ మద్యం దెబ్బకు మధ్య వయస్సు వారి ఆరోగ్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

- మద్యం వల్ల లివర్ దెబ్బతిన్న వారిలో 35 - 54 మధ్య ఏళ్ల వయస్సు వారే అధికం. అందులో 35-44 మధ్య వయస్సు వారు 987 మంది. 45-54 మధ్య వయస్సు వారు 1140.
- కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో 35-44 ఏళ్ల మధ్య వయస్కులు 5217 మంది కాగా, 45-54 మధ్య వయస్సు వారు 7479 మంది ఉన్నారు.
- నరాలు దెబ్బతిన్న వారిలో 35-44 ఏళ్ల మధ్య వయస్కులు 625 మంది, 45-54 మధ్య వయస్సు వారిలో 1140 మంది ఉన్నారు.

నాకు తెలియదు..!

▸ మద్యం పాలసీ తయారీ నా దృష్టికి రాలేదు.. రాజ్ కసిరెడ్డి ఎవరో తెలియదు
▸ వినియోగం తగ్గింపునకే సర్కారీ షాపులు.. సిట్ ప్రశ్నలకు నారాయణస్వామి జవాబు
▸ 30నిమిషాలు..14 ప్రశ్నలు.. ప్రతిదీ దాటవేత



అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అమలుచేసిన మద్యం విధానాన్ని ఎలా రూపొందించారో తనకు తెలియదని మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సిట్ అధికారులకు తెలిపారు. అప్పట్లో ఆయన ఎక్సైజ్ శాఖ బాధ్యతలు చూశారు. రూ.3,500 కోట్ల భారీ కుంభకోణంలో ఆయనను ఈ నెల 21న ప్రశ్నించేందుకు ఇటీవల సిట్ నోటీసు జారీచేసింది. అనారోగ్య కారణాల రీత్యా తాను విజయవాడకు రాలేకపోతున్నట్లు నారాయణస్వామి సమాచారమిచ్చారు. దీంతో సోమవారం విజయవాడ నుంచి తిరుపతి వెళ్లిన సిట్ అధికారులు వీడియోకాల్ చేసి అక్కడి అధికారుల ద్వారా ప్రశ్నించినట్లు తెలిసింది. లిక్కర్ స్కామ్‌లో మాస్టర్ మైండ్ రాజ్ కసిరెడ్డి(ఏ1) ఎవరో తనకు తెలియదని, ప్రైవేటు షాపులుంటే వినియోగం తగ్గించడం కుదరదు గనుక ప్రభుత్వ షాపులు ఏర్పాటు చేస్తున్నట్లు తనకు చెప్పారని ఆయన బదులిచ్చినట్లు తెలిసింది. ఆయనకు ప్రతి నెల యాభై లక్షల రూపాయలు చొప్పున ముడుపులు అందజేసినట్లు సిట్ సేకరించిన ఆధారాలపై ప్రశ్నించగా, అసలు అవినీతే జరగనప్పుడు, తనకెందుకు డబ్బులిస్తారని ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. సుమారు 35 నిమిషాలపాటు 14 ప్రశ్నలు వేయగా, తాను చెప్పాల్సింది చెప్పి ఆరోగ్యం సహకరించడం లేదంటూ మాజీ మంత్రి మౌనం వహించినట్లు తెలిసింది.



4196

▸ మిథున్ రెడ్డికి రిమాండ్ ఖైదీ నంబర్ కేటాయింపు

రాజమహేంద్రవరం/విజయవాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి (ఏ4)కి రిమాండ్ ఖైదీ నంబరు 4196 ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి కేంద్ర కారాగారంలో గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్న స్నేహ బ్యారక్‌లో ఆయన్ను ఉంచారు. ఆదివారం విజయవాడలోని ఏసీబీ కోర్టు ఆగస్టు 1 వరకూ మిథున్ రెడ్డికి రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఆయన్ను అదే రోజు రాత్రి పోలీసులు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు. రాత్రి 8.50 గంటలకు అడ్మిషన్ తీసుకున్నామని సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. జైలు మెడికల్ అధికారితో ఆయనకు ఆరోగ్య పరీక్షలు చేయించగా ఆరోగ్య పరిస్థితి సాధారణ స్థాయిలో ఉందని తెలిపారు. ఆయనకు ప్రత్యేక సదుపాయాలు ఏమీ ఉండవని, భద్రత విషయంలో మాత్రం అవసరమైన చర్యలన్నీ తీసుకున్నామని వివరించారు. సోమవారం ములాఖత్ తీసుకొని ఆయనను ఎవరూ కలవలేదని, లాయర్లు కూడా రాలేదని వెల్లడించారు. జైలు నిబంధనల ప్రకారమే ఆయనకు ఆహారం అందించామని చెప్పారు. కాగా సోమవారం ఉదయం మిథున్ రెడ్డి చిన్నాన్న, వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి తన అనుయాయులతో సుమారు 10 కార్లలో జైలు వద్దకు చేరుకున్నారు. జైలు ఎదురుగా ఉన్న సెంట్రల్ ప్రిజన్ కేఫ్‌లో సాయంత్రం వరకూ వేచి ఉండి వెళ్లిపోయారు. అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ ఉదయం జైలు వద్దకు వచ్చి వెళ్లిపోయారు.

ఈ సదుపాయాలు ఇవ్వండి

ఆదివారం మిథున్ రెడ్డికి రిమాండ్ విధించిన సమయంలో జైలులో కల్పించాల్సిన సదుపాయాలకు సంబంధించి ఒక చిట్టాతో ఆయన తరపు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఎంపీగా ఉండడం, వై కేటగిరి భద్రత ఉండడంతో జైలులో కొన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. మంచం, కుర్చీ, టేబుల్, టీవీ, సహాయకుడు(అటెండర్), ప్యూరిఫైడ్ వాటర్ బాటిల్స్, ముక్కులో వేసుకునే చుక్కల మందు, యోగాసనాలు వేసుకోవడానికి మ్యాట్, మల్టీవిటమిన్ మందులు, చేపనూనె మందులు, ప్రొటీన్ పౌడర్, దిండు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ఇవి కాకుండా రెండు పూటలా ఇంటి నుంచి భోజనం, ఉదయం అల్పాహారం అనుమతించాలని విజ్ఞప్తి చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కాగా పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున వాటిని వీక్షించడానికి టీవీ ఏర్పాటు చేయాలని మిథున్‌రెడ్డి ఏసీబీ కోర్టులో సోమవారం మరో పిటిషన్ దాఖలు చేశారు.

మిథున్‌రెడ్డికి మంచం ఇవ్వలేదు

మిథున్ రెడ్డికి జైలు అధికారులు మంచం ఇవ్వలేదని, నేలపైనే పడుకోబెట్టారని వైసీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ఏసీబీ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రాజమండ్రి జైలు సూపరింటెండెంట్‌తో మాట్లాడాలని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశించారు. మంగళవారం కోర్టులో జైలు సూపరింటెండెంట్ హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. తన తరఫున డీఎస్పీ స్థాయి అధికారిని కోర్టుకు పంపుతానని జైలు సూపరింటెండెంట్ జవాబు ఇచ్చారు. దీంతో విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

జే బ్రాండ్లకు గేట్లెత్తారు

▸ అనుమతి పొందిన వెంటనే లక్షల కేసుల ఆర్డర్లు
▸ మద్యం స్కామ్ చార్జిషీట్‌లో సిట్ వెల్లడి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒక మద్యం బ్రాండ్‌కు అనుమతి రావాలంటే నెలల సమయం పడుతుంది. కొన్నిసార్లు అది సంవత్సరాలు కూడా అవుతుంది. కానీ జగన్ జమానాలో కొత్త బ్రాండ్లకు అలా అడిగిన వెంటనే ఇలా అనుమతులు వచ్చేశాయి. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ఆరు నెలల్లోనే ఎస్పీవై హెచ్‌డీ గోల్డ్ విస్కీకి అనుమతి లభించింది. ఆ తర్వాత ఏడాదిన్నర కాలంలో మరో 18 బ్రాండ్లకు అనుమతులు వచ్చేశాయి. అయితే అనుమతులు రావడం ఒకెత్తు అయితే అసలు కథ ఆ తర్వాతే మొదలైంది. కొత్తగా వచ్చిన బ్రాండ్లకు నెలకు గరిష్ఠంగా 10వేల కేసులు మాత్రమే ఆర్డర్లు ఇవ్వాలి. ఈ నిబంధనను తుంగలో తొక్కిన గత జగన్ ప్రభుత్వం కొత్త బ్రాండ్లకు మొదటి నెలలోనే లక్షల కేసుల ఆర్డర్లు ఇచ్చేసింది. అప్పటికే మార్కెట్‌లో ఉన్న పాపులర్ బ్రాండ్లను పక్కనపెట్టి ఇలాంటి జే బ్రాండ్లకు పెద్దపీట వేసింది. ఆ బ్రాండ్లనే ప్రభుత్వ మద్యం షాపులకు తరలించి బలవంతంగా అమ్మించింది. ఫలితంగా పాపులర్ బ్రాండ్లు కనుమరుగై, వాటి స్థానంలో ఊరుపేరు లేని జే బ్రాండ్లు విచ్చలవిడిగా అమ్మారు. అనుమతిపొందిన వెంటనే లక్షల్లో ఆర్డర్లు ఇచ్చిన విషయాన్ని మద్యం కుంభకోణంపై చార్జిషీట్‌లో దర్యాప్తు ప్రత్యేక బృందం (సిట్) వెల్లడించింది.



పాపులర్ అయితే మాకేంటి?

ఎస్పీవై హెచ్‌డీ గోల్డ్ విస్కీ బ్రాండ్‌కు 2019 నవంబరు 22న అనుమతి లభించింది. ఆ వెంటనే డిసెంబరు నెలలో ఏకంగా 1,51,600 కేసుల ఆర్డర్లు ఆ ఒక్క బ్రాండ్‌కే వెళ్లాయి. అదాన్ కంపెనీకి చెందిన అదాన్స్ సుప్రీం బ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్ విస్కీ బ్రాండ్‌కు 2020 మే 21న అనుమతి లభించింది. జూలైలో 1,03,400 కేసుల ఆర్డర్లు ఆ బ్రాండ్‌కు ఇచ్చారు. లీలాస్ బ్రిలియంట్ బ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్ విస్కీ బ్రాండ్‌కు 2021 మార్చి 7న అనుమతి వచ్చింది. అదే ఏడాది జూన్‌లో 69,300 కేసుల ఆర్డర్లు ఆ బ్రాండ్‌కు దక్కాయి. ఎస్పీవై సెలబ్రిటీ బ్రాందీకి 2020 జూన్ 19న అనుమతి వస్తే, అక్టోబరులో 35,100 కేసుల ఆర్డర్లు వెళ్లాయి. ఇవన్నీ ఆ బ్రాండ్లకు మొదటి నెల అమ్మకాలకు ఇచ్చిన ఆర్డర్లు. అలాగే గోల్డెన్ రిజర్వ్ ప్రిస్టేజ్ విస్కీకి 30వేలు, కింగ్స్‌వెల్ సెలెక్ట్ బ్రాందీకి 30వేలు, బీడీహెచ్ గుడ్ ఫ్రెండ్స్ డీలక్స్ విస్కీకి 22,500, గోల్డెన్ కింగ్ డీలక్స్ ఓల్డ్ ఫైన్ విస్కీకి 22,450, సిల్వర్ స్ట్రిప్స్ ఒరిజినల్ రిజర్వ్ విస్కీకి 21,060, ఎస్పీవై గెలాక్సీ ప్యూర్ గ్రెయిన్ విస్కీకి 17,500, ఎస్ఎన్‌జె డాక్టర్ బ్రాందీకి 17,150, ఎస్పీవై గెలాక్సీ బ్రాందీకి 33,100 కేసులు మొదటి నెలలోనే ఆర్డర్ ఇచ్చినట్లు చార్జిషీట్‌లో సిట్ తెలిపింది.

లోపాలున్నా ఇచ్చేశారు

మద్యం బ్రాండ్లకు అనుమతి ఇచ్చేటప్పుడు వాటిని సరఫరా చేసే కంపెనీలు అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఒక్కటి లేకపోయినా అనుమతి ఇవ్వరు. కానీ సొంత బ్రాండ్లను తీసుకొచ్చే క్రమంలో వైసీపీ ప్రభుత్వం అనేక ఉల్లంఘనలకు పాల్పడింది. అనేక పత్రాలు సమర్పించకపోయినా ఎడాపెడా అనుమతులు జారీచేసింది.

ఎస్పీవై కంపెనీ ఫొటోలు, చిరునామా పత్రాలు, ఈ-ఆఫర్ టెండర్ నోటిఫికేషన్, వార్షిక నివేదికలు, మద్యం అసోసియేషన్‌తో ఒప్పంద పత్రం, ఆర్‌టీజీఎస్ బ్యాంకు ఖాతా వివరాలు, ఫ్రాంచైజీ కాపీ, ఆథరైజేషన్ లెటర్ ఇవ్వలేదు. అయినా అనుమతులు ఇచ్చేశారు. అదాన్ కంపెనీ, జీఎస్‌బీ అండ్ కో ఎల్ఎల్‌పీ, ఈగల్ డిస్టిలరీ, ఓమ్ సన్స్ మార్కెటింగ్, పెరల్ డిస్టిలరీ, లీలాస్ డిస్టిలరీ, ఎన్‌వీ డిస్టిలరీస్ అండ్ బ్రూవరీస్, సన్‌రేస్ బాటిలింగ్, బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ కంపెనీల్లో ఉత్పత్తి చేసిన బ్రాండ్లకు అనేక పత్రాలు సమర్పించకపోయినా అప్పనంగా అనుమతులు మంజూరుచేశారని సిట్ తన చార్జిషీట్‌లో పేర్కొంది.

ప్రీమియం బ్రాండ్లను తొక్కేశారు

అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం కంపెనీలతో గత జగన్ ప్రభుత్వం కమీషన్ల బేరాలు మొదలుపెట్టింది. ఇందుకు అంగీకరించని పాపులర్ బ్రాండ్లను రాష్ట్రం నుంచి తరిమేసింది. కింగ్‌ఫిషర్ బీర్ ఉత్పత్తి చేసే రణస్థలంలోని బ్రూవరీ అప్పట్లో కంపెనీనే మూసేసింది. దీనివల్ల తమ ఉపాధి పోయిందని స్థానికులు రోడ్డెక్కారు. ఆ బ్రాండ్ అప్పటికే సరఫరా చేసిన వేల కేసుల బీరును షాపులకు పంపకుండా మద్యం డిపోల్లోనే ఉంచారు. చివరికి పాడైపోయిందనే కారణంతో రోడ్ రోలర్‌తో ఎక్సైజ్ శాఖ ధ్వంసం చేయించింది. అయితే కొంతకాలం తర్వాత అంతర్గతంగా ఒప్పందం కుదుర్చుకుని మళ్లీ కింగ్‌ఫిషర్‌కు ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చింది.

పాపులర్ బ్రాండ్ల ఆర్డర్లలో (కేసులు) వ్యత్యాసం

బ్రాండ్	2018-19	2023-24
మెక్‌డోవెల్స్ బ్రాందీ	22,73,086	5
ఇంపీరియల్ బ్లూ విస్కీ	20,21,955	7
కింగ్‌ఫిషర్ బీర్	1,02,47,566	11,82,388
బడ్వైజర్ బీర్	22,52,195	0

జగన్‌ను ఇరికించేందుకు కుట్ర

▸ 14 నెలల్లో వైసీపీ నేతలపై 2,800 కేసులు: అమర్‌నాథ్

మద్దిలపాలెం (విశాఖపట్నం), జూలై 21(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఇరికించి, అరెస్టు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. విశాఖ నగరంలోని మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో లిక్కర్ కేసును రోజుకో రకంగా మలుపు తిప్పుతున్నారు. లిక్కర్ స్కామ్‌లో రాజశేఖరరెడ్డి ప్రధాన నిందితుడని పేర్కొన్నారు. ఆ తర్వాత ఎంపీ మిథున్ రెడ్డి సూత్రధారి అంటూ అరెస్టు చేశారు. ఏదోవిధంగా జగన్‌ను అరెస్టు చేయడానికి చూస్తున్నారు. ముందు రూ.లక్ష కోట్లు స్కామ్ అంటూ ప్రచారం చేసి ఇప్పుడు రూ.3,500 కోట్లకు వచ్చారు. 14 నెలల కాలంలో వైసీపీ నేతలు, కార్యకర్తలపై ప్రభుత్వం సుమారు 2,800 కేసులు బనాయించింది' అని అమర్‌నాథ్ విమర్శించారు.

తిరుపతిలో ఫిజియోథెరపీ కోసం చెవిరెడ్డి పిటిషన్

విజయవాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో ఫిజియోథెరపీ చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. దీనిపై సిట్ కౌంటర్ దాఖలు చేసి వాదనలు వినిపించాల్సి ఉంది. కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని కోరడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు విచారణను వాయిదా వేశారు. మద్యం కుంభకోణం కేసులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సిట్ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

గోవిందప్ప రెండోసారి బెయిల్ పిటిషన్

మద్యం కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బాలాజీ గోవిందప్ప రెండోసారి బెయిల్ పిటిషన్‌ను సోమవారం దాఖలు చేశారు. ఇంతకుముందు ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది.



టీపీ కోట ప్రభుత్వ పాఠశాలలో యూ ఆకారంలో బెంచీల ఏర్పాటు

నో బ్యాక్ బెంచ్

- తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో వినూత్న ప్రయోగం
- 'యూ' ఆకారంలో బెంచీల అమరిక.. విద్యార్థులందరిపై టీచర్ దృష్టి

నాగలాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో బ్యాక్ బెంచ్‌లో కూర్చునే విద్యార్థి అంటే అల్లరి చేసేవాడనో, సరిగ్గా చదవని వాడనో నమ్మకం ఉంది. క్లాసురూమ్‌లో బెంచి వెనకాల బెంచి ఉండటం వల్ల పాఠం చెప్పే ఉపాధ్యాయుల దృష్టి కూడా వారిపై తక్కువగా ఉంటుంది. దీనికి చెక్ చెబుతూ తిరుపతి జిల్లా నాగలాపురం మండలం టీపీ కోట ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో వినూత్న ప్రయోగం చేశారు. సంప్రదాయ పద్ధతికి భిన్నంగా క్లాసురూమ్‌లో యూ ఆకారంలో బెంచీలను అమర్చి సోమవారం నుంచి విద్యాబోధన చేపట్టారు. గతేడాది వినేశ్ విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన మలయాళం సినిమా 'స్థానార్థి శ్రీ కుట్టన్' క్లైమాక్స్ సీన్ స్ఫూర్తితో తొలుత కేరళలోని కొల్లం జిల్లా రామ విలాసం ఒకేషనల్ హయ్యర్ సెకండరీ స్కూలులో ప్రయోగాత్మకంగా యూ అకారం బెంచీల విధానాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. కేరళలో అమలుచేస్తున్న ఈ విధానాన్ని టీపీ కోట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకున్నారు. దీంతో ఇకపై ఇక్కడి తరగతి గదుల్లో బ్యాక్ బెంచ్‌లు కనిపించవు. పాఠశాలల్లో యూ టైప్ సిట్టింగ్‌తో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని భావిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరమణ చెప్పారు. గది మధ్యలో ఉపాధ్యాయుడు నిలబడి పాఠాలు చెప్పడం వల్ల విద్యార్థులందరూ ఒకే స్థాయిలో అభ్యసన ప్రక్రియలో పాలు పంచుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులు సులభంగా వినడం, ఆచరించడం, మెరుగ్గా సంభాషించడానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనం పెంపు

- 3 కేటగిరీలకు రూ.3 వేల చొప్పున పెంచుతూ ఉత్తర్వులు

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులకు రూ.3 వేల చొప్పున వేతనం పెంచుతూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేటగిరి-1 కార్మికులకు ప్రస్తుతం రూ.21,500 వేతనం అందుతుండగా వారికి రూ.24,500లకు పెంచారు. అదే విధంగా కేటగిరి-2 కార్మికులకు రూ.18,500ల నుంచి రూ.21,500లకు, కేటగిరి-3 కార్మికులకు రూ.15 వేల నుంచి రూ.18,500కు పెంచుతూ ఆదేశాలిచ్చారు. అయితే, మున్సిపల్ కార్మికులకు రూ.3 వేల వేతనం పెంచి ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనం మాత్రమే కలిగించిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగనాయకులు, సుబ్బరాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం గ్రేడ్ల వారీగా రూ.21 వేలు, రూ.24,500లు ఇవ్వాల్సి ఉంటే అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందని అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఖతర్ నుంచి తెలుగు పాస్టర్ల విడుదల

- మత ప్రచారం అభియోగంపై 2 నెలలు పోలీసుల అదుపులో..

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఖతర్ దేశంలో చట్ట నిబంధనలకు విరుద్ధంగా మతప్రచారం చేస్తున్నారనే అభియోగంపై పోలీసులు అదుపులోకి తీసుకున్న 9 మంది ప్రవాస క్రైస్తవ పాస్టర్లకు ఊరట లభించింది. వీరిలో ముగ్గురు ఏపీకి చెందిన వారు కాగా, దేశం విడిచి వెళ్లకుండా వీరిపై ఉన్న నిషేధాన్ని తొలగించడంతో వీరంతా ఖతర్ నుంచి విడుదలై స్వస్థలాలకు చేరుకున్నారు. పశ్చిమ గోదావరి, విజయనగరం, కృష్ణా జిల్లాలకు చెందిన ఈ ముగ్గురూ క్రైస్తవ ప్రముఖులే. వీరిలో ఇద్దరు ఒక చర్చి వార్షికోత్సవ సభకు, మరొకరు వ్యక్తిగత పనిపై ఖతర్‌కు వచ్చి, ఒక చర్చికి వెళ్తుండగా పోలీసులు ఏప్రిల్ 27న అరెస్ట్ చేశారు. అనంతరం, జూలై 4న విడుదల చేశారు. కానీ దేశం విడిచి వెళ్లకుండా నిషేధం విధించారు. ఖతర్‌లోని సామాజిక సేవకుడు, కడప జిల్లా ప్రముఖుడైన మనీష్ రెడ్డి అరుణ్ వీరి కేసును భారతీయ ఎంబసీ సాయంతో పరిష్కరించారు. విడుదల చేసినందుకు భారతీయ ఎంబసీకి, మనీష్ రెడ్డికి తెలుగు పాస్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

తోటివారికి సేవ చేయడమే దేవుడిపై నిజమైన ప్రేమ

- తిరుమలేశుడి పూజల్లో స్వదేశీ గోవుల పాలే వాడాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య



న్యూఢిల్లీ, జూలై 21: తోటివారికి సేవ చేయడమే దేవుడిపై అసలైన ప్రేమగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. తిరుమల శ్రీవారికి పూజాదికాల్లో స్వదేశీ గోవుల పాలు మాత్రమే వాడేలా తిరుమల తిరుపతి దేవస్థానాల(టీటీడీ)ను ఆదేశించాలన్న పిటిషన్‌పై విచారణకు నిరాకరించింది. ఇంతకంటే ముఖ్యమైన అంశాలు ఉన్నాయని.. తోటి మానవులకు సేవ చేయడంలోనే దేవుడిపై అసలైన ప్రేమ ఇమిడి ఉందని.. ఇలాంటి వాటిలో కాదని జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం స్పష్టంచేసింది. స్వామివారి పూజలు, ప్రసాదాల తయారీలో స్వదేశీ గోవుల పాలు మాత్రమే వాడేలా టీటీడీకి ఆదేశాలివ్వాలని కోరుతూ 'యుగ తులసి ఫౌండేషన్' సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఆగమ శాస్త్రాల ప్రకారం పూజలు నిర్వహించాలని.. ఈ మేరకు చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని ఆ సంస్థ తరఫు న్యాయవాది విచారణ సందర్భంగా న్యాయస్థానాన్ని కోరారు.

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి కేంద్రంగా

రాయలసీమ

- కొప్పర్తి, శ్రీసిటీ, హిందూపురం ఆ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం
- మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలు సాధించేలా ఏపీ ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ పాలసీ-2025
- ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0పై సమీక్షించిన సీఎం చంద్రబాబు



ఎలక్ట్రానిక్స్ కాంపౌండ్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): 'ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు రాయలసీమకు విస్తారమైన అవకాశాలున్నాయి. కొప్పర్తి, శ్రీసిటీ, హిందూపురంతో సహా సీమలోని పలుప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు అనువైన వాతావరణం ఉంది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ 4.0 2025-30పై పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో చంద్రబాబు సమీక్షించారు. గత ఏడాది దేశంలో 70 మిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్ సర్క్యూట్ బోర్డులు దిగుమతి అయ్యాయని అధికారులు వివరించారు. ఎలక్ట్రానిక్స్ సర్క్యూట్‌లకు డిమాండ్ అత్యధికంగా ఉందని వారు సీఎంకు చెప్పారు. చంద్రబాబు మాట్లాడుతూ, '2025-30 మధ్యకాలంలో ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమలు స్థాపించేలా, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామిక దిగ్గజ సంస్థలతో సంప్రదింపులు జరపండి. ఎలక్ట్రానిక్స్ పరికరాల దిగుమతులు తగ్గి స్థానికంగానే ఉత్పత్తికావడం వల్ల ధరలను నియంత్రించే వీలుంది. ఎలక్ట్రానిక్స్ రంగంలో సెల్ఫ్ రిలయన్స్ - మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలు నెరవేరాలి. రాష్ట్రంలో తయారైన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్‌కు బ్రాండ్‌ను సృష్టించాలి. ఇదే అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. పరిశ్రమల ఏర్పాటుతో సహా ఉత్పత్తికి అనువైన ఎకో సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రానిక్ కంపోనెంట్స్ తయారీ రంగంలో 100 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు రాబట్టాలి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ కంపోనెంట్స్ రంగంలో ముందున్న బెంగళూరు, చెన్నైలలో ఎదుర్కొంటున్న భూమి సమస్యను మనకు అనుకూలంగా మలుచుకోవాలి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించేలా ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీపాలసీని రూపొందించాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఐటీ కంపెనీల ఏర్పాటుకు విస్తృత అవకాశాలున్న విశాఖ, అమరావతి, తిరుపతి నగరాల్లో 500 ఐటీ కంపెనీలకు కేటాయించడం ద్వారా ఒకేసారి ఎక్కువ మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయని అన్నారు. విశాఖలో ఐటీ, ఐటీఈఎస్ సంస్థలతో పాటు లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకూ ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ సంస్థలను ఏర్పాటు చేసే వీలుందని చంద్రబాబు చెప్పారు. ఈ ప్రాంతాల్లో కోవర్కింగ్ స్పేస్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. విజయవాడతో పాటు రాష్ట్రంలోని మిగిలిన నగరాల్లోనూ ఉద్యోగావకాశాలు పెరిగేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు.

2030 నాటికి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్ర

2030 నాటికి రాష్ట్రం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రూపుదిద్దుకునేలా అడుగులు వేయాలని ఇంధన శాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో కలసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈడీఏపీ ఎండీ కమలాకరబాబు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దడానికి అవసరమైన కార్యాచరణతో కూడిన డిక్లరేషన్‌ను చంద్రబాబు విడుదల చేశారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో 600 మంది జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను స్థాపించేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని పెంచేలా దేశంలోనే అతి పెద్ద ఎకోసిస్టమ్‌ను అమలు చేయాలని అధికారులకు సీఎం సూచించారు. 2027 నాటికి రెండు గిగావాట్లు, 2029 నాటికి ఐదు గిగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అందిపుచ్చుకోవాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. కిలో హైడ్రోజన్ గ్యాస్ ఉత్పత్తి ధరను రూ.460 నుంచి రూ.160 కి తగ్గించేలా పరిశోధనలు, కార్యాచరణను అమలు చేయాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌ను రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకూ తీర్చిదిద్దాలని డిక్లరేషన్‌లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆవిష్కరణలు, పరిశోధనల కోసం రూ.500 కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించారు. ఆవిష్కరణలను ప్రోత్సహించేలా 50 స్టార్టప్‌లకు ప్రోత్సాహన్ని కల్పించాలని తీర్మానించారు.

ఏపీలో అభివృద్ధి ఒక్కటే అందరి భాష: లోకేశ్



అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): 'భాషతో సంబంధం లేదు. ఆహారపు అలవాట్లు ఎలాంటివైనా పర్వాలేదు. పరస్పరం గౌరవం ఇచ్చిపుచ్చుకునేందుకు ఇవేవీ అడ్డుకాదు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకూ ఇవి అవరోధం కాదు' అని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఇండియన్ టెక్ అండ్ ఇన్‌ఫ్రా' తన ఎక్స్ ఖాతాలో లోకేశ్ సందేశాన్ని రీపోస్ట్ చేస్తూ... 'ప్రస్తుతం భారతదేశంలోనే కూలెస్ట్ పొలిటీషియన్' అంటూ పోస్టు చేసింది. దీనికి లోకేశ్ ప్రతిస్పందిస్తూ... 'కేవలం నేను మాత్రమే కాదు. తెలుగు ప్రజలంతా ఆహ్లాదాన్ని పంచేవారే. ఏపీలో అభివృద్ధి ఒక్కటే అందరి భాష' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.



గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ - అమరావతి డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్, నెడ్ క్యాప్ ఎండీ కమలాకర్ బాబు

జీరో ఫేర్ టికెట్

(మొదటి పేజీ తరువాయి)

జీరో ఫేర్ టికెట్ ఇస్తే ఎంత ఖర్చు ప్రభుత్వంపై పడుతుందో, ఆమె ఎంత లబ్ధి పొందుతారో తెలుస్తుందన్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్న పొరుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చోట్ల ఎంత మేరకు ఖర్చు అవుతోందనే విషయంపై అధికారులతో సీఎం చర్చించారు. నిర్వహణ వ్యయం తగ్గించుకుని, లాభాల కోసం మార్గాలను అన్వేషించాలని ఆర్టీసీ ఉన్నతాధికారులకు సూచించారు. ఆర్టీసీ ఇకపై ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే సమకూర్చుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారిస్తే నిర్వహణ భారం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ఈ బస్సులకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం అధ్యయనం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రయాణికుల సంఖ్య పెరగొచ్చు

ప్రస్తుతం రాష్ట్రంలో పల్లె వెలుగు, సిటీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రోజూ 16.11 లక్షల మంది మహిళా ప్రయాణికులు గమ్యం చేరుతున్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణం అమలు చేస్తే ఉమ్మడి జిల్లాల్లో తిరిగే బస్సులతో పాటు విశాఖపట్నం, విజయవాడ సిటీ సర్వీసుల్లో 27 లక్షల మంది వరకూ ప్రయాణించే అవకాశం ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉచిత ప్రయాణం ద్వారా ఏపీఎస్ఆర్టీసీపై ప్రతి నెలా 245 కోట్ల రూపాయల వరకూ భారం పడే అవకాశం ఉందని ప్రభుత్వానికి నివేదించారు. బస్టాండ్లలో వసతులు, మరుగుదొడ్ల మరమ్మతులు, అదనపు సిబ్బంది, అదనపు బస్సుల గురించి అందులో వివరించారు.

తియ్యని మత్తు!



మార్కెట్‌లో దొరుకుతున్న గంజాయి కలిపిన వివిధ రకాల చాక్లెట్ ప్యాకెట్‌లు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపార యాప్‌ల ద్వారా కూడా ఆయుర్వేద గుళికల పేరుతో యథేచ్ఛగా సరఫరా చేసేస్తున్నారు. వైసీపీ హయాంలో విచ్చలవిడిగా సాగిన గంజాయి వ్యాపారం, వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో అక్రమార్కులు సరికొత్త మార్గాలు ఎంచుకుంటున్నారు. లిక్విడ్ గంజాయి సరఫరాకు ప్రయత్నాలకు అధికారులు చెక్ పెట్టడంతో ఇప్పుడు గంజాయి చాక్లెట్లను మార్కెట్లోకి తీసుకొచ్చేశారు. వీటి వల్ల ఇప్పటికే గంజాయి అలవాటు ఉన్న వారే కాకుండా చిన్నారులు కూడా తినే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఈగిల్ బృందాల ముమ్మర దాడుల్లో వీటి గుట్టు బయటపడింది. వరుస దాడులతో రవాణాదారులు సరుకున్న బ్యాగ్‌లు వదిలేసి పారిపోతుండటంతో.. వాటి మూలాలను పట్టుకోవటం పోలీసులకు సవాల్‌గా మారింది. ఏపీలో విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు వంటి నగరాలు, తెలంగాణలో అత్యధికంగా హైదరాబాద్ వంటి చోట అమ్మకాలు సాగుతున్నాయి.

చాక్లెట్టే కదా.. అని వదిలేస్తే!

చాక్లెట్టే కదా! తింటే ఏమవుతుందిలే అనుకుంటే.. మీ చిన్నారుల జీవితాలు మత్తుకు బానిసయినట్టే. మినార్, చార్‌మినార్, మహదేవ్ ఫోలా, లహరి, తరంగ్, రాయల్ వటి, భోలా పవర్ గోళీ, ఆనంద్, మహాకల్, మస్తీ వంటి పేర్లతో మార్కెట్‌లోకి ఈ తరహా చాక్లెట్‌లు వచ్చేశాయి. పైగా వాటిపై ఆయుర్వేద గుళికలంటూ కలరింగ్ ఇచ్చేస్తున్నారు. వీటిని తినటం వల్ల చిన్నారుల్లో వింత ప్రవర్తన కనిపిస్తుంది. తాజాగా హైదరాబాద్‌లోని ఒక పాఠశాలలో ఇదే పరిస్థితి ఎదురైంది. దీనికి కారణం తెలియక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అయోమయానికి గురయ్యారు. వింతగా ప్రవర్తించిన పది మందిపై కొద్ది రోజులు నిఘా ఉంచారు. గంజాయి చాక్లెట్లు తినటం వల్లే ఇలా జరిగినట్లు తేలడంతో పోలీసులు అమ్మకాలు చేసిన దుకాణాలపై దాడులు చేసి, గంజాయి చాక్లెట్ గుట్టును రట్టు చేశారు. తాజాగా గుంటూరులోని ఒక పాన్ దుకాణంలోనూ భారీగా గంజాయి చాక్లెట్లు టాస్క్‌ఫోర్స్ బృందాలకు పట్టుబడ్డాయి. అప్రమత్తమైన ప్రభుత్వం ప్రత్యేక ఈగిల్ బృందాలను ఏర్పాటు చేసింది. ఇటీవల తెనాలి రైల్వేస్టేషన్‌లో తాంబ్రమ్-యూన్సీ ఎక్స్‌ప్రెస్‌లో చెన్నై తరలిస్తున్న మినార్ అనే పేరుతో ఉన్న గంజాయి చాక్లెట్‌లను పోలీసులు పట్టుకున్నారు.



చాక్లెట్ కవర్‌లో ఉండే గంజాయి కలిపిన నల్లని గోళీల తరహాలో ఉండలు

ఏవోబీలోని ఏజెన్సీ కేంద్రంగా..

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు డబ్బు ఆశ చూపి దళారులు గంజాయి సాగు చేయిస్తున్నారు. అక్రమ సాగుకు ప్రస్తుతం ఒడిశా ఏజెన్సీ ప్రాంతం అడ్డాగా మారింది. ఆంధ్రా-ఒడిశా బోర్డర్‌లో సాగు అధికంగా ఉందనేది అధికారుల మాటే! అక్కడ పండించిన గంజాయిని నేరుగా కాకుండా.. మత్తు కలిగించే ఆకులు, పుష్పాలను ఎండబెట్టి, ఆ పొడిని ఇతర మిశ్రమాలతో కలిసి చాక్లెట్‌ల తరహాలో తియ్యగా ఉండేలా తయారు చేస్తున్నారు. ఆ ప్యాకెట్‌లపై ఆయుర్వేద గుళికలంటూ ముద్రిస్తున్నారు. వాటిని తింటే నిద్రలేమి ఉండదని, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని, ఒత్తిడిని తగ్గించటంతోపాటు, జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుందంటూ ముద్రించి మరీ అమ్మకాల కోసం ప్రత్యేక టీమ్‌ల ద్వారా ప్రధాన నగరాలకు పంపుతున్నారు. గతంలో ఓ ఆన్‌లైన్ వ్యాపార సంస్థ ద్వారా ఆయుర్వేద పొడులు, మాత్రల పేరుతో జరిగిన సరఫరాను పోలీసులు రట్టుచేయటంతో హ్యాష్ ఆయిల్ పేరుతో గంజాయిని ఆయిల్‌గా మార్చి రవాణా చేశారు. దీనిని కొన్ని చోట్ల పట్టుకోవడంతో ఇప్పుడు గంజాయి చాక్లెట్ల తయారీకి రూటు మార్చారు. ఒడిశా, బిహార్ వంటి రాష్ట్రాల్లో మరో అడుగు ముందుకు వేసి, చాక్లెట్ ప్యాకెట్లు లేకుండా పాన్ మసాలా పేరుతో పాన్ డబ్బాల్లో చిన్నపాటి గోళీల ఆకారంలో గంజాయి గుళికలు తయారు చేసి సరఫరా చేస్తున్నారు.

సింథటిక్ ఉత్పత్తులు మరింత ప్రమాదం!

గంజాయి సాగు, రవాణా జఠిలం కావడంతో కృత్రిమ రూపంలో తయారీకి తెగబడుతున్నారు. హైదరాబాద్, కోల్‌కతా, బిహార్, ఢిల్లీ, ముంబై నగరాల నుంచి ఈ తరహా సింథటిక్ గంజాయి ఉత్పత్తులు తెలుగు రాష్ట్రాల్లోకి వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. గంజాయిలో మత్తును కలిగించే టీహెచ్‌సీ (టెట్రా హైడ్రో కానబినాల్) అనే పదార్థాన్ని ప్రయోగశాలలో తయారుచేస్తారు. ఇది సాగుచేసే గంజాయితో పోలిస్తే అత్యంత ప్రమాదమని నిపుణులు చెబుతున్నారు. గంజాయి మొక్క నుంచి వచ్చిన టీహెచ్‌సీ ఎప్పుడూ ఒకే ప్రభావాన్ని చూపితే.. సింథటిక్ గంజాయి భిన్న ప్రభావాలను చూపుతాయని అంటున్నారు. సింథటిక్ గంజాయిని ద్రవరూపంలో ఎండిన ఆకులపై పిచికారి చేసి గంజాయి పేరుతో అమ్ముతున్నారని చెబుతున్నారు. సింథటిక్ గంజాయి వాడితే మానసిక సమస్యలతోపాటు నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని, గుండెపోటుతో మరణం సంభవించే పరిస్థితి కూడా వస్తుందని పేర్కొంటున్నారు.

భవిష్యత్ పోలీసింగ్ ఏఐతోనే..!

- ఫిర్యాదు నుంచి చార్జిషీటు వరకూ అదే చేస్తుంది: డీజీపీ
- హరీశ్ గుప్తాను కలిసిన 28 మంది ట్రైనీ ఐపీఎస్‌లు
- ఏఐ, అస్త్రం, శక్తి, ఈగల్‌పై అవగాహన

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): నేరాల తీరుతెన్నులు ఎప్పటికప్పుడు మారుతున్నాయని, భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు కృత్రిమ మేధ తోడ్పాటు ఎంతో కీలకమని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 28 మంది యువ ఐపీఎస్‌లు సోమవారం మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీలు ఆకే రవికృష్ణ, సీహెచ్ శ్రీకాంత్, రాజకుమారి తదితరులతో కలిసి వారికి డీజీపీ వృత్తిపరమైన మెలకువలతో పాటు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో నేరాల కట్టడి, శాంతిభద్రతల నిర్వహణకు చేపడుతున్న చర్యలను వివరించారు. "మహిళల రక్షణకు 'శక్తి', గంజాయిని అరికట్టేందుకు 'ఈగల్' బృందాన్ని, అదేవిధంగా సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ నియంత్రణకు 'అస్త్రం' అమలవుతోంది. డ్రోన్లు పర్యవేక్షిస్తే సిబ్బంది అప్రమత్తమై ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఏపీ పోలీసింగ్‌లో ఏఐని ప్రవేశపెడుతున్నాం. ఫిర్యాదు నుంచి చార్జిషీటు వరకూ అన్నీ అదే చేస్తుంది. ఇటీవల గుంటూరులో ఏఐ హ్యాకథాన్ నిర్వహించి జాతీయస్థాయిలో నిపుణుల సలహాలు, సూచనలు తీసుకున్నాం.. శిక్షల శాతం పెంచడం నుంచి ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకు నిరంతరం శ్రమిస్తున్నాం.. శాంతిభద్రతల పరిరక్షణలో కొత్త కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎప్పటికప్పుడు సిద్ధమవుతున్నాం' అని డీజీపీ తెలిపారు.



సోమవారం మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో యువ ఐపీఎస్‌ల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

పీఆర్సీ కమిటీని తక్షణమే నియమించాలి

- పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి
- ఏపీఎన్జీజీఓ అధ్యక్షుడు విద్యాసాగర్ డిమాండ్

విజయవాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని ఏపీఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ డిమాండ్ చేశారు. సోమవారం సీఎస్ విజయానంద్‌కు లేఖ అందజేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వేతన సవరణ రెండేళ్ల ఆలస్యమైందని, వెంటనే వేతన సవరణ కమిషనర్‌ను నియమించి ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏల్లో రెండింటినైనా మంజూరు చేయాలని కోరారు. 2019-24 మధ్య ఉద్యోగులపై నమోదైన పెండింగ్ కేసులన్నింటినీ ఎత్తేసి, రిలీఫ్ ఫండ్ చెల్లించాలని కోరారు. 2004కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన సీఎస్ విజయానంద్.. స్టాఫ్ కమిటీ ఏర్పాటుకు ముందు కార్యాచరణ జరిపి, కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని సూచించనట్టు తెలిపారు.



సీఎస్ విజయానంద్‌కు లేఖను అందజేస్తున్న ఏపీఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, సంఘ నాయకులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.